సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 15

సంచిక: 350

ఆదివారం

12-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సాక్షి ఫ్యామిలీ II
విజయవాడ
ఆదివారం ॥ 12-3-2023

బ్యూటిప్స్



కాఫీ, టీ పొడితో మేని కాంతి

వాడేసిన కాఫీ, టీ పొడి/ఆకులను చెత్త బుట్టలో పడేస్తుంటారు. అలా కాకుండా టీ ఆకులు లేదా పొడి పదార్థాలను చర్మ పోషణకు ఉపయోగించవచ్చు..

మొటిమల నివారణ

ఒకసారి ఉపయోగించిన టీ ఆకులను వేడి నీటిలో వేసి చల్లారేవరకు ఉంచాలి. ఆ నీళ్లలో వేళ్లు ముంచి, ముఖానికి రాసుకోవాలి. ముఖమంతా పట్టించాక, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. దీనివల్ల మొటిమల సమస్య తగ్గుతుంది.

పాదాలకు టీ నీళ్లు

వాడిన టీ ఆకులు లేదా పొడిలో తగినన్ని నీళ్లు మరిగించి, ఐదు లీటర్ల నీటిలో పోయాలి. ఆ నీటిలో పాదాలను ఉంచాలి. పావు గంట సేపు అలాగే ఉంచి, తర్వాత బయటకు తీసి పాదాలను తడి లేకుండా తుడవాలి. తరచూ ఇలా



చేయడం వల్ల పాదాలపై ఉన్న ట్యాన్ సమస్య తగ్గిపోతుంది. దురద, పాదాల ఇన్ఫెక్షన్ వంటి సమస్యలు ఉంటే తగ్గుతాయి. కాలిన కొద్దిపాటి గాయాలకు మందులా పనిచేస్తుంది. దుర్వాసన కూడా దరి చేరదు. కాబట్టి వేడి టీ రుచిని ఆస్వాదించినప్పుడు దాని అవశేషాన్ని పడేయకుండా ఇలా వాడుకోవచ్చు.

స్క్రబ్

వాడేసిన కాఫీ పొడిని బాడీ స్క్రబ్‌గా ఉపయోగిస్తే చర్మంపై మలినాలు, ట్యాన్ సమస్య తగ్గుతుంది.



తహానున్నీసా బేగం

ఆమె చూపిన బడిబాట

తహానున్నిసా బేగంకి బీఎస్సీ నర్సింగ్ పూర్తయిన తర్వాత తెలంగాణ రాష్ట్రం గద్వాల్ జిల్లా, మానపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత కమిషన్ ఆన్ గ్రాడ్యుయేట్స్ ఆఫ్ ఫారిన్ నర్సింగ్ స్కూల్స్ (సీజీఎఫ్ఎన్ఎస్) కోర్సు చేసింది. అమెరికా వెళ్లడానికి ఐల్ట్స్ కూడా మంచి స్కోర్‌తో పూర్తి చేసినా అక్కడికి వెళ్లడం కుదరకపోవడంతో ఎమ్ఎస్సీ నర్సింగ్ సైకియాట్రీ కోర్సులో చేరింది. ఏడాది పూర్తయ్యేసరికి పునరాలోచనలో పడి కుటుంబ అవసరాల కోసం గృహిణిగా ఇంటికే పరిమితం అయింది. కొడుకుకి తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్‌లో సీటు రావడంతో మకాం తిరుపతికి మారింది. చదువు మీదున్న ఆసక్తిని సేవా కార్యక్రమాల వైపు మళ్లించి ఎందరికో ఆదర్శంగా నిలిచింది. సావిత్రీ పూలే అవార్డును అందుకుంది. తన సేవా ప్రస్థానం ఆమె మాటల్లోనే...

అమ్మమ్మ... అమ్మ స్ఫూర్తితో...

''మాది తెలంగాణలోని వనపర్తి. మా అమ్మ సైన్స్ టీచర్, నాన్న డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా లెప్రసీ విభాగంలో పని చేశారు. ఆ స్ఫూర్తితోనే నేను నర్సింగ్ కోర్సు చేశాను. సర్వీస్ మా ఇంటి వాతావరణంలోనే ఉంది. రంజాన్ మాసంలో జకాత్ ఇవ్వడంతో సరిపెట్టే వాళ్లు కాదు. రోజూ ఆకలి తీర్చేవాళ్లు. మా అమ్మమ్మ రోజూ జొన్న రొట్టెలు చేసి రెండు తీసి పక్కన పెట్టి ఆ తర్వాత మాకు తినడానికి పెట్టేది. పక్కన తీసి పెట్టిన రొట్టెలు ఆ రోజు ఆకలితో ఎవరు వస్తే వారికిచ్చేది. మా అమ్మ కూడా తన నెల జీతంలో కొంత భాగం పేద వారికి ఇవ్వడం కోసమే తీసి పక్కన పెట్టేది. అవి చూస్తూ పెరిగాను, నాకు ఉద్యోగం రాగానే ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. ఆకాశమే హద్దు అన్నంతగా సమాజానికి వైద్యసేవ చేయాలనుకున్నాను. అక్కడి పరిస్థితుల్లో ఎంతో కాలం ఇమడలేకపోయాను. నా దృష్టికి వచ్చిన వాళ్లకి చేతనైన సహాయం చేయడంతోనే కొన్నేళ్లు జరిగిపోయాయి. తిరుపతికి వచ్చిన తర్వాత కరోనా సమయంలో నాకు ఒక దారి దొరికింది. నా అసలైన అవసరం ఎక్కడ ఉందో తెలిసింది. మా వారు డాక్టర్, కొడుకు ఎంబీబీఎస్ పూర్తి చేసి కోవిడ్ మెడికల్ ఆఫీసర్‌గా సర్వీస్ మొదలు పెట్టాడు. వాళ్లిద్దరూ సర్వీస్ ఇస్తున్నారు. నాకు మెడికల్ నాలెడ్జ్ ఉంది కాబట్టి సర్వీస్ చేస్తానంటే మా వారు, అబ్బాయి ఇద్దరూ నా ఆరోగ్యరీత్యా వద్దన్నారు. అప్పుడు నేను ఆహారం పెట్టడం అయినా చేయాలని మొదలు పెట్టాను. ఒక పూట అన్నానికి కూడా భరోసా లేని కాలనీలను చూశాను. వాళ్లకు రోజూ అన్నం పెట్టడం, ఆ పిల్లల బాగోగులు అడిగి తెలుసుకుంటూ ఉంటే ఆశ్చర్యకరమైన విషయాలు తెలిశాయి. బ్రష్, పేస్ట్, సబ్బు కూడా తెలియని బాల్యం వాళ్లది. వాళ్లకు స్కూల్‌లో పేరుంటుంది,



కానీ వాళ్లు స్కూలుకి పోరు. తర్వాత క్లాస్‌కి ప్రమోట్ కాలేరు. ఏం చదువుతున్నారని అడిగితే ఏదో ఓ క్లాసు చెప్తారు, ఎక్కడ ఆపేశారో కూడా వాళ్లకు గుర్తుండదు. ఇంకా ఇలాంటి జీవితాలున్నాయేంటి... అని బాధ కలిగింది. ఈ స్థితిని చూసిన తర్వాత 'వియ్ సపోర్ట్' అంటూ చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి పూర్తి స్థాయిలో పని మొదలు పెట్టాను.

అన్నింటా రాణిస్తున్నారు!

అలాంటి పిల్లలు ఈ మూడేళ్లలో ఎంతగా మారిపోయారంటే... వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో బహుమతులందుకున్నారు. త్రోబాల్, వంద మీటర్ల పరుగు, ఖోఖో వంటి ఆటల్లో ముందుంటున్నారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నా పిల్లల నంబరు ఏడాదికేడాదీ పెరుగుతోంది. ఇంకో విషయం... వీళ్లు మేడమ్, టీచర్ అనే పదాలంటేనే భయపడేవాళ్లు. 'ఆంటీ' అని పిలిపించుకోవడం అలవాటు చేశాం. దాంతో బాగా మాలిమి అయ్యారు. ఇంకా ఇలాంటి వారిని వెతికి మరీ బడిబాట పట్టించాలి. అదే పనిలో ఉన్నాను'' అన్నారు తహానున్నిసా బేగం.

స్నేహితులు వచ్చారు!

మొదట అన్నారావు సర్కిల్ దగ్గరున్న ఎస్‌టీ కాలనీతో మొదలు పెట్టాను. రోజూ కాలనీకి వెళ్లడం పిల్లలందరినీ బ్రష్ చేయమని, స్నానం చేసి రమ్మని చెప్పడం నుంచి సంస్కరణ మొదలు పెట్టాను. పాఠాలను కంఠతా పట్టడం, ఆ తర్వాత చదవడం, రాయడం నేర్పించాను. ఆ తర్వాత వాళ్లు చదవగలిగిన క్లాసులో చేర్పిస్తున్నాను. ఈ యజ్ఞంలో నన్ను చూసి నా స్నేహితులు ముందుకు వచ్చి పాఠాలు చెప్తున్నారు. కొంతమంది పుస్తకాలు, బ్యాగులు సహాయం చేశారు. వీళ్లు స్కూల్ డ్రాపవుట్స్ కావడంతో ప్రభుత్వం ఇచ్చే పథకం వర్తించదు. అలాంటి పిల్లలను ఒక దారిలో పెట్టిన తరవాత టీటీడీ ఓరియెంటల్ స్కూల్‌లో చేర్పిస్తున్నాం.

– వాకా మంజులారెడ్డి

ఫొటోలు : మహమ్మద్ రఫీ, తిరుపతి

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసిన అర్చనాకు వంటలు అంటే ఇష్టం. ఆ ఇష్టం ఎక్కడి దాకా వెళ్లిందంటే ఉద్యోగానికి రాజీనామా చేసి 'అర్చనాస్ కిచెన్' టైటిల్‌తో సోషల్ మీడియాలో అడుగు పెట్టేంతగా! 'ఫుడ్ గురు'గా పేరు తెచ్చుకున్న అర్చన, ఆరోగ్యానికి మేలు చేసే వంటకాల గురించి పుస్తకాలు రాస్తోంది. 'బ్యాలెన్స్‌డ్ ప్లేట్' కాన్సెప్ట్‌ను ప్రచారం చేస్తోంది....

షెఫ్ అర్చన, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

కొత్త దారి



అర్చన

ఎనిమిది సంవత్సరాల వయసులోనే అర్చనాకు రకరకాల వంటకాలపై ఆసక్తి మొదలైంది. ఈ చిన్నారి వంటగదిలో తల్లితో కలిసి గరిట తిప్పడానికి ఎంతో కాలం పట్టలేదు. బెంగళూరుకు చెందిన అర్చన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసింది. సాఫ్ట్‌వేర్‌రంగంలో పనిచేస్తున్నప్పటికీ తన మనసంతా రకరకాల వంటకాల రుచులతో నిండిపోయేది.

రెండు సంవత్సరాల తరువాత ఉద్యోగానికి రాజీనామా చేసి 'అర్చనాస్ కిచెన్' పేరుతో సోషల్‌మీడియాలోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న రకరకాల వంటకాల వీడియోలు, వేగంగా చేయగలిగిన ఆరోగ్యకరమైన అల్పాహారం ఐడియాలతో పాటు డిన్నర్, లంచ్‌బాక్స్, పార్టీ, పండగ వంటకాల ఐడియాలతో వీడియోలు చేయడం ప్రారంభించింది. ఊహించని స్థాయిలో తన యూట్యూబ్ ఛానల్ పాపులర్ అయింది.



బోర్ కొట్టకుండా డిషెస్ కాంబినేషన్‌ను ప్లేట్‌లోకి తీసుకురావడం అనేది కొందరికి జటిలమైన టాస్క్!

'అలాంటిదేమీ లేదండి. చాలా ఈజీ' అని చెప్పడానికి '30 మీల్ ప్లాన్స్ ఫ్రమ్ అర్చనాస్ కిచెన్' అనే పుస్తకం రాసింది అర్చన.

'పుస్తకంలో ప్రస్తావించిన వంటలన్నీ స్వయంగా చేసి చూశాను. కుటుంబసభ్యులకు సర్వ్ చేసి వారి అభిప్రాయాన్ని అడిగేదాన్ని. ఇప్పటికీ రోజూ ఒక కొత్త రకం వంటకాన్ని తయారుచేయడం నాకు అలవాటు. కేవలం రుచి మాత్రమే కాదు రుచితో పాటు ఆరోగ్యానికి మేలుచేసే వంటకాలకు ప్రాధాన్యత ఇస్తాను' అంటోంది అర్చన.

ఒకవైపు నోరూరిస్తూనే రకరకాల పోషకవిలువలు, ఫైబర్‌తో ఆరోగ్యానికి మేలు చేసే వంటకాల గురించి ఈ పుస్తకంలో రాసింది అర్చన.

వివిధ రకాల ప్రాంతీయ వంటకాలతో పాటు 'థాలీ కాన్సెప్ట్' 'కలోరి డైట్' లాంటివి ఈ పుస్తకంలో ఉంటాయి. రుచి, పోషక విలువల సమన్వయం 'బ్యాలెన్స్‌డ్ ప్లేట్' కాన్సెప్ట్‌తో రాసిన ఈ పుస్తకంలో వంటలకు సంబంధించి చేయాల్సినవి, చేయకూడని విషయాలను ప్రస్తావించింది.

'రెస్టారెంట్‌లలో ఎప్పుడూ కనిపించనివి, ఇంటిలో మాత్రమే చేసుకోగలిగే వంటకాల గురించి ఈ పుస్తకంలో రాశాను. మన దేశంలో ఎన్నో ప్రాంతాలలో ఎన్నో రకాల ఆరోగ్యకరమైన వంటకాలను అందరికీ పరిచయం చేయాలనేది నా కల. పార్ట్–2 కూడా తీసుకువస్తాను' అంటోంది అర్చన.

హెల్త్

నిత్యజీవితంలోని పనులే ఫిజియో వ్యాయామాలైతే...

సాధారణంగా పక్షవాతంతో అవయవాలు చచ్చుబడ్డా లేదా ఇతరత్రా ఏదైనా ప్రమాదం కారణంగా అవయవాల్ని కొద్ది రోజులు పని చేయించలేకపోతే... అవి మళ్లీ నార్మల్‌గా పని చేయడానికి ఫిజియోథెరపీ వ్యాయామాలు అవసరమవుతాయి. మునపటిలా పని చేయడానికి ఉపకరిస్తాయి కాబట్టి కొన్ని సందర్భాల్లో వీటినే రీ–హ్యాబ్ వ్యాయామాలని కూడా అంటారు. వ్యాయామం అనగానే ఏదో శ్రమతో కూడిన పని అనీ, ఎలాగోలా తప్పించుకుంటే బెటరని అనిపించేవాళ్ల సంఖ్యే ఎక్కువ. చాలా సందర్భాల్లో కంప్యూటర్ సహాయంతోనో లేదా రొబోటిక్స్ సహాయంతోనో వినోదాత్మకంగా తీర్చిదిద్దిన వ్యాయామాలూ ఎక్కువగానే ఉంటాయి. ఈ కంప్యూటర్ లేదా రొబోటిక్ పద్ధతుల కంటే మనం రోజూ చేసే పనులనే 'ఫిజియో' వ్యాయామ పద్ధతులుగా తీర్చిదిద్దడమే మంచిదనీ, అవే ఎక్కువ మేలు చేస్తాయంటున్నారు కొందరు నిపుణులు. రోజువారీ పనులే 'ఫిజియో' వ్యాయామరీతులిలా అవుతాయో తెలుసుకుందాం.



ఫిజియోవ్యాయామాలు అనగానే 'పక్షవాతం'లాంటి స్ట్రోక్‌కు గురై, కోలుకునే ఏ కొందరికి మాత్రమే పరిమితమైనవనే అభిప్రాయం చాలామందిలో ఉంది. కానీ మన మొత్తం దేశ జనాభాలో... ఆ మాటకొస్తే ప్రపంచ జనాభాలోని 15% మందికి ఫిజియో అవసరమనేది 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' (డబ్ల్యూహెచ్‌ఓ) అంచనా. ఒక్క పక్షవాతం వచ్చిన వారే కాదు, ప్రమాదాలకు లోనై మళ్లీ కోలుకునే క్రమంలో తమ అవయవాలను మునుపటిలా కదిలించడానికీ, కొన్ని జబ్బులతో చాలాకాలం పాటు మంచం పట్టి... ఆ తర్వాత మళ్లీ తమ పనులు యథావిధిగా చేసుకోవాలనుకుంటున్న వారికీ, మోకాళ్ల కీలు మార్పిడి చికిత్సల తర్వాత మళ్లీ మునపటిలా నడవాలనీ, జాగింగ్‌చేయాలనుకునే వారు... ఇలా ప్రపంచమంతటా కనీసం 100 కోట్ల మందికి రీ–హ్యాబ్ అవసరం. వీళ్లే కాదు... గుండెపోటు వచ్చాక కూడా వ్యాయామాలు అవసరం కానీ అవి గుండెపై ఏమాత్రం భారం మోపకుండా ఉండేంత సున్నితంగా ఉంటూనే... శరీరానికి తగినంత పని చెప్పేంత శ్రమతో ఉండాలి. ఈ సున్నితమైన బ్యాలెన్స్ పాటించేలా వ్యాయామాలు రూపొందించడం, చేయించడం 'ఫిజియోథెరపిస్ట్' ల పని. వాటిని సైంటిఫిక్‌గా రూపొందించడం ఎంతో కీలకం.



డాక్టర్ విజయ్ బత్తిన (పీటీ)
ఫిజికల్ మెడిసిన్ అండ్ రీహాబిలిటేషన్ స్పెషలిస్ట్

కంప్యూటర్, రొబోటిక్ ఆధారితమైనవి ఎన్నెన్నో...

వ్యాయామాల్ని ఉత్సాహంగా చేయడానికి వీలుగా రూపొందించడం కోసం 'ఫిజియో'లు ఎన్నెన్నో మార్గాలను అన్వేషిస్తుంటారు. ఉదాహరణకు కంప్యూటర్ స్క్రీన్ మీద చుక్కల్ని ఓ వరసలో కలిపి, ఓ ఆకృతి వచ్చేలా చేయడం. లేదా ఏదో టాస్క్‌ని ఓ నిర్దిష్ట/నిర్దేశిత పద్ధతుల్లో పూర్తి చేయడం వంటివి. ఒక రకంగా చెప్పాలంటే చిన్నపిల్లలు కంప్యూటర్ గేమ్స్ ఆడి విజయం సాధించనప్పటి థ్రిల్ పొందేలా ఈ కంప్యూటర్ లేదా రొబోటిక్ ఆధారిత ఫిజియో(గేమ్స్) పద్ధతులు ఉంటాయి. ఇవి కూడా చాలావరకు మేలే చేస్తాయి.

కంప్యూటర్, రొబోటిక్ వ్యాయామాల్లో పరిమితులు

అయితే వాటిలో కొన్ని పరిమితులు ఉండేందుకు అవకాశం ఉంది. 2008లో దాదాపు 330 మందిపై జరిగిన ఓ అధ్యయనంలో ఈ సంగతి రుజువైంది. ఏ వ్యాయామ రీతిలోనైనా... భారం ఎక్కువగా పడుతూ, తక్కువ రిపిటీషన్లతో సమకూరే వ్యాయామం కంటే తక్కువ భారం పడుతూ... ఎక్కువ రిపిటీషన్లతో సమకూరే వ్యాయామంలోనే కండరానికి ఎక్కువ సామర్థ్యం అలవడుతుంది. ఇలా బరువును క్రమంగా పెంచుకుంటూ, దానికి అనుగుణంగానే రిపిటీషన్లను పెంచుతూ పోవడం వల్లనే ప్రయోజనం ఎక్కువ అని అనేక అధ్యయనాలు నిరూపించాయి.

అధిగమించడం ఇలా...

పైన పేర్కొన్న అధ్యయనం ప్రకారం ఆ పరిమితుల్ని అధిగమించేందుకు కొన్ని దేశీయ పద్ధతులతో వ్యాయామ రీతుల్ని మన నిపుణులు అభివృద్ధి చేశారు. మనం రోజూ చేసే పాత పనుల్నే వ్యాయామ రీతులుగా సరికొత్తగా రూపొందించారు. రొబోటిక్ రీ–హ్యాబ్ ప్రక్రియల్లో కంప్యూటర్ ఆధారంగా కొన్ని డిజైన్లు వచ్చేలా చుక్కల్ని కలపడం, రొబోటిక్ కదలికలతో కండరం బలం పెంచుకున్నా కదలికల నైపుణ్యం తగ్గడం వల్ల ఒనగూరాల్సిన ప్రయోజనం అందదు. కానీ రోజువారీ పనులతో రూపొందించిన పద్ధతులతో చచ్చుబడ్డ కండరానికి బలమూ, నైపుణ్యమూ పెరుగుతాయి.

ప్రయోజనమూ ఎక్కువే, స్వావలంబనా సహజమే

ఇలాంటి దేశీయ పద్ధతులతో ఓ ప్రయోజనమూ ఉంది. కంప్యూటర్‌పై ఆటలు చిన్నతనంలో ఆసక్తిగా ఉండవచ్చు. కానీ స్ట్రోక్ లాంటివి మధ్యవయసు దాటాకే వస్తుంటాయి. అందువల్ల ఆ వయసులో కంప్యూటర్‌పై రొటీన్ సీక్వెన్సింగ్ పనులు బోర్‌గా అనిపించవచ్చు. కానీ రోజువారీ పనులు చేస్తుండటం, వాటిలో రోజురోజుకూ మెరుగుదల కనిపించడంతో పేషెంట్లకు ఆత్మస్థైర్యం పెరుగుతుంది. పైగా అవి అటు తర్వాత కూడా వారి రోజువారీ జీవితంలో చేసుకోవాల్సిన పనులు కావడంతో స్వావలంబనా, ఎవరిపైనా ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకోగలమన్న ఆత్మవిశ్వాసమూ పెరుగుతాయి.

రోజువారీ పద్ధతుల్లో కొన్ని...

రోటీలు చేయడం...



చచ్చుబడ్డ కండరాల సహాయంతోనే రోటీలు చేసే ప్రక్రియ కొనసాగుతుంది. రొట్టెలు చేయడంలో అప్పడాల కర్రతో రొట్టెల్ని గుండ్రంగా వచ్చేలా చేయడం. ఇందులో చేతి వేళ్లన్నింటితో పాటు ముంజేయి కండరాలు, మోచేతి కీలు వంటి వాటికి వ్యాయామం సమకూరుతుంది.

కూరగాయలు తరగడం



పూర్తిగా నైపుణ్యంతో కాకపోయినా... వీలైనంత మేరకు కూరగాయలు తరిగేలా చేయిస్తారు. దాంతో బొటనవేలితో పాటు, కత్తి చుట్టూ మిగతా వేళ్ల గ్రిప్ పెరుగుతుంది. చేయి, ముంజేయి, మోచేతి కండరాలతో పాటు మణికట్టు ఎముకల కదలికలతో చేతికి కావాల్సిన రీ–హ్యాబ్ వ్యాయామం సమకూరుతుంది. ఇది క్రమంగా బలమూ పెంచుతుంది. నైపుణ్యాలను సైతం పెరిగేలా చేస్తుంది.

చీర కుచ్చిళ్ల కదలికలతో

మహిళల్లో అయితే వారు రీ–హ్యాబ్ కార్యక్రమంలో ఉన్నప్పుడు నైటీ మీదే చీర కట్టుకునేలా ప్రోత్సహించడం. ఈ ప్రక్రియలో చీర కుచ్చిళ్లను అల్లుకునేలా మాటిమాటికీ చేతులు కదిలించేలా చేస్తారు. స్ట్రోక్‌తో చేతుల్లోని, వేళ్లలోని నరాల కేంద్రం దెబ్బతిన్న వారిలో ఈ వ్యాయామ రీతి వల్ల అతి సున్నితమైన వేలి కండరాలు, వేళ్లకు సప్లై అయ్యే నరాల్లో కదలికల్ని క్రమంగా నింపేలా చూస్తారు.

తోట పని ప్రక్రియలు



మనం తోట పని చేసేప్పుడు గడ్డపారతో తవ్వడం, పార (స్పేడ్) లాంటి పరికరాలతో మట్టిని నిర్దేశిత రీతిలో పోగుపడేలా చేయడం, కిందపడ్డ ఆకుల్ని కాళ్లతో ఓ పక్కకు తోయడం... ఇవన్నీ పూర్తిస్థాయిలో కాకపోయినా... ఆ పనుల్లో కాళ్లూ, చేతులతో ఎలాంటి కదలికలు అవసరమో, అవే జరిగేలా చూస్తారు. ఇక్కడ నైపుణ్యానికి తావు లేకుండా తొలుత ఆసక్తిగా తోటపనిలో పాలు పంచుకునేలా చేస్తుంటారు. క్రమక్రమంగా ఆయా అవయవాలకు బలం సమకూరడమే కాకుండా... నైపుణ్యమూ పెరుగుతుంది.

మెడి టిప్

స్వాభావికంగానే బీపీ నియంత్రణ ఇలా...



రక్తపోటు కారణంగా మనకు తెలియకుండానే 'ఎండ్ ఆర్గాన్స్'లో ఒకటైన కిడ్నీతో పాటు అనేక కీలక అవయవాలు దెబ్బతింటాయి. రక్తపోటు (హైబీపీ)ను నియంత్రించుకుంటూ ఉంటే రక్తప్రసరణ జరిగే క్రమంలో చివరన ఉండే కీలక అవయవాలన్నింటినీ రక్షించుకోవచ్చు. ఈ స్వాభావిక జాగ్రత్తలేమిటో తెలుసుకుందాం.

- ఆహారంలో వెల్లుల్లి ఎక్కువగా వాడటం అన్నది రక్తపోటు నియంత్రించడంతో పాటు చెడు కొవ్వులైన కొలెస్ట్రాల్‌ను, ట్రైగ్లిజరాయిడ్స్‌ను తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుంది.
- మెగ్నీషియమ్ ఎక్కువగా ఉండే ఆహారాలైన ముదురాకుపచ్చటి ఆకుకూరలు, పొట్టు ఉండే ధాన్యాలు, చిక్కుడుకాయలతో పాటు పప్పు ధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉండే పాలు, పెరుగు ఆహారంలో తీసుకోవాలి. అలాగే మెగ్నీషియమ్ ఎక్కువగా ఉండే అరటి, జామ, బొప్పాయి, ద్రాక్ష వంటి పండ్లు ఎక్కువగా తింటుండాలి.
- మాంసాహారం తినేవారైతే చేపల్ని వారంలో కనీసం రెండు నుంచి మూడు సార్లు తీసుకోవడం మేలు.

గర్భవతులూ... ఆస్తమా!

అప్పటికే ఆస్తమా ఉన్న మహిళలు గర్భవతులైనప్పుడు ఒక్కోసారి... ప్రెగ్నెన్సీ సమయంలోనూ ఆస్తమా వచ్చే అవకాశాలుంటాయి. దాదాపు 20 శాతం మందిలో ఆయాసం వచ్చి, మందులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇక మరో 6 శాతం విషయానికి వస్తే వారిని హాస్పిటల్‌లో చేర్చి, చికిత్స అందించాల్సిన పరిస్థితులు రావచ్చు. అందుకే అప్పటికే ఆస్తమా ఉన్నవారు... గర్భవతిగా ఉన్న సమయంలో దాన్ని అదుపులో పెట్టుకోవడం అవసరం. ఎందుకంటే... ఒకవేళ ఆస్తమా అదుపులో లేకపోతే వాళ్లలో అకస్మాత్తుగా రక్తపోటు బాగా పెరగడం (ప్రీ–అక్లాంప్సియా), నెలలు పూర్తిగా నిండకముందే ప్రసవం (ప్రీ–టర్మ్ బేబీ), బిడ్డ చాలా తక్కువ బరువుతో పుట్టడం లేదా మృతశిశువు జన్మించడం వంటివి జరగవచ్చు. అందువల్ల గర్భిణుల్లో ఆస్తమాను అదుపులో ఉంచుకోవడం చాలా ప్రధానం.

పైన పేర్కొన్న అంశాలే కాదు... ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం మరొకటుంది. పుట్టబోయే బిడ్డకు తల్లి నుంచి ఆక్సిజన్ సరఫరా ఎంత బాగుంటే... పుట్టాక ఆ బిడ్డ మానసిక, శారీరక వికాసాలు కూడా అంతే బాగుంటాయి. బిడ్డ జీవన నాణ్యతకూడా బాగుంటుంది. అందుకే గర్భవతిగా ఉన్న సమయంలో ఆస్తమాను నియంత్రణలో ఉంచుకోవడం అన్నది కాబోయే తల్లికీ, కడుపులోని బిడ్డకూ చాలా అవసరం.

సాధారణంగా ఆస్తమా అటాక్ వచ్చినప్పుడు ఇచ్చే మందులు గర్భవతులకైనా, సాధారణ మహిళలకైనా దాదాపుగా ఒకేలా ఉంటాయి. కాకపోతే... గర్భంతో ఉన్నప్పుడు తమకు అటాక్ రాకుండా ఉండేందుకు లేదా వచ్చినప్పుడు వాడాల్సి వస్తే... ఆ మందుల దుష్ప్రభావాలు గర్భధారణపై పడకుండా డాక్టర్లు జాగ్రత్తలు తీసుకుంటారు.



గర్భవతులైన ఆస్తమా సమస్య ఉన్న మహిళలకు కొన్ని సూచనలు...

- గర్భవతులు (మునుపు ఆస్తమాతో బాధపడ్డ మహిళలైతే) ప్రతి 4 లేదా 6 వారాలకు ఒకసారి తమ శ్వాస తీరు ఎలా ఉందో పరీక్షించేందుకు పీక్ ఎక్స్‌పిరేటరీ ఫ్లో పరీక్ష చేయిస్తూ ఉండటం మంచిది. ఆస్తమా అటాక్ రాకుండా ఉండేందుకు వాడే ప్రివెంటార్ ఇన్‌హేలర్స్ తప్పనిసరిగా తీసుకుంటూ ఉండాలి. అవి పిండంపై ఎలాంటి దుష్ప్రభావాలు చూపవు. కాబట్టి వాటిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు.
- గర్భితుల్లో అటాక్ వచ్చి ఆక్సిజన్ తీసుకునే సామర్థ్యం తగ్గితే... పిండానికీ ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. అది ఎంతమాత్రమూ మంచిదికాదు. అందుకే ఏ చిన్న అటాక్ లక్షణాలు కనిపించినా వెంటనే హాస్పిటల్‌లో చేరాలి.
- ఆస్తమాను ప్రేరేపించే అంశాలు (ట్రిగర్ ఫ్యాక్టర్స్)కు దూరంగా ఉండాలి. తమకు సరిపడని వాటిని గుర్తించి, గర్భవతిగా ఉన్న సమయంలో వాటికి దూరంగా ఉండాలి.


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 15 సంచిక: 350

SUNDAY Special ఆదివారం 12-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



శుబ్‌మన్ వంతు

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న చివరి టెస్టులో మూడో రోజు కూడా శతకం నమోదైంది. శుబ్‌మన్ గిల్ (128 పరుగులు), కోహ్లి (59 నాటౌట్) చెలరేగడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది.

- వివరాలు 12లో



ఆస్కారం ఎవరికంటే!

ఈనెల 12వ తేదీన(భారత కాలమానం ప్రకారం 13వ తేదీ) లాస్‌ఏంజిల్స్‌లో ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. అవార్డులు ఎవరికి దక్కుతాయనే దానిపై జరుగుతున్న విశ్లేషణలపై కథనం.

- వివరాలు 12లో



రూ.600 కోట్ల కుంభకోణం

లాలూ కుటుంబసభ్యుల నివాసాల్లో దొరికిన నగదు, పత్రాలను బట్టి నేర విస్తృతి రూ.600 కోట్లకు పైనే ఉంటుందని ఈడీ తెలిపింది.

వివరాలు 6లో ►



అప్రమత్తతే అత్యంత కీలకం

దేశంలో వేగంగా పెరుగుతున్న శ్వాసకోశ సంబంధిత సమస్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

వివరాలు 2లో ►



చైనా ప్రధానిగా లీ కియాంగ్

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అత్యంత నమ్మకస్తుడిగా పేరున్న లీ కియాంగ్ ఆ దేశ ప్రధానిమంత్రిగా నియమితులయ్యారు.

వివరాలు 6లో ►



అమెరికన్ ఇండియన్లకు పదవులు

ఫ్లెక్స్ సీఈఓ రేవతీ అద్వైతి, నేచురల్ రిసోర్సెస్ డిఫెన్స్ కౌన్సిల్ సీఈఓ మనీశ్ బప్నాలకు బైడెన్ సర్కార్‌లో కీలక పదవులు దక్కాయి.

వివరాలు 6లో ►



తోడు దొంగలు

A1 A2

మార్గదర్శి కేసులో ఏ-1 రామోజీరావు
ఏ-2 శైలజగా సీఐడీ ఎఫ్ఐఆర్

- యథేచ్ఛగా అక్రమాలు, ఆర్బీఐ నిబంధనలు బేఖాతరు
- రశీదు రూపంలో అక్రమంగా డిపాజిట్ల సేకరణ
- చిట్ ఫండ్ చట్టం నిబంధనల ఉల్లంఘన
- చందాదారుల సొమ్ము అక్రమార్జనకు మళ్లింపు
- స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీల్లో వెల్లడి
- ఆ శాఖ ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు
- రాష్ట్ర వ్యాప్తంగా మార్గదర్శి కార్యాలయాల్లో సోదాలు
- నరసరావుపేట, ఏలూరులో పారిపోయిన మేనేజర్లు

సాక్షి, అమరావతి: ఈనాడు రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంసీఎఫ్‌పీఎల్) అక్రమాల బండారం బద్దలైంది. రిజర్వ్ బ్యాంకు నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్న అరాచకం ఆట కట్టింది. చిట్‌ఫండ్ చట్టాన్ని తుంగలో తొక్కేస్తూ రామోజీ సాగిస్తున్న అవినీతి ఆధారాలతో సహా నిరూపితమైంది. కొన్ని నెలల క్రితం

మిగతా 2వ పేజీలో ►

8 గంటలు.. ముఖాముఖి

ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవితను విచారించిన ఈడీ

- సౌత్ గ్రూపుతో మీకు సంబంధం ఏమిటి?
- హోటళ్లలో జరిగిన సమావేశాల్లో ఏం చర్చించారు?
- ఇండో స్పిరిట్స్‌లో వాటా సంగతేంటి?
- ఇలా ఒక్కో అంశంపై లోతుగా ఆరా తీసిన ఐదుగురు సభ్యుల బృందం
- ఈ నెల 16న మళ్లీ విచారణకు రావాలని ఈడీ నోటీసులు

2 లో



విచారణ అనంతరం కారులో వెళుతున్న కవిత

ఏపీలో సోలార్ ప్రాజెక్టు పెడతాం

రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నాం

- 'పునరుత్పాదక' విభాగంలో సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు రాష్ట్రం అనుకూలం
- 500–1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు స్థాపించాలని భావిస్తున్నాం
- రూ.3వేల కోట్ల పెట్టుబడితో 1,200 మందికి ఉపాధి
- 'సాక్షి'తో నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ ప్రసన్నకుమార్



- వివరాలు 5లో

ఆత్మగౌరవానికి ప్రతీక

సవాళ్లనే సోపానాలుగా మల్చుకున్న వైఎస్సార్‌సీపీ

- 12 ఏళ్లలో తిరుగులేని శక్తిగా ఆవిర్భావం
- నేడు 13వ వసంతంలోకి అడుగులు
- విప్లవాత్మక కార్యక్రమాలతో వైఎస్ జగన్ ప్రజారంజక పాలన
- సంక్షేమాభివృద్ధి పథకాలతో రాష్ట్రం పరుగులు
- అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని పార్టీ కార్యాలయం పిలుపు

10 లో



ఈ నెల 16 నుంచి వర్షాలు

2 లో

ముగిసిన 'ఎమ్మెల్సీ' ప్రచారం



- రేపు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్
- 16న ఓట్ల లెక్కింపు, ఫలితాలు
- 14 స్థానాలకు నోటిఫికేషన్
- 5 ఏకగ్రీవం.. 9 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- 3 పట్టభద్రుల, 2 టీచర్, 4 స్థానిక సంస్థల స్థానాలు
- 11 జిల్లాల్లో 13న ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు
- ప్రైవేటు ఉద్యోగులకు పర్మిషన్
- 13వ తేదీ సాయంత్రం వరకు మద్యం అమ్మకాలు నిలిపివేత

13 లో

ఇండోనేసియా రాజధాని మార్పు

ఇండోనేసియా రాజధాని జకార్తా నుంచి తరలిపోతోంది. బోర్నియో ద్వీపంలో నుసంతర పేరిట కొత్త రాజధాని నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. దీన్ని కాలుష్యరహిత, హరిత నగరంగా రూపొందిస్తున్నారు. జకార్తాలో జనాభా విపరీతంగా పెరగడం, కాలుష్యం, వరదలు తదితర సమస్యలు ఎదురవ్వడంతో అధ్యక్షుడు జోకో గతేడాది ఈ నిర్ణయం తీసుకున్నారు.

- వివరాలు 6లో


రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటు

- విధులను గంట ముందుగా ముగించుకుని వెళ్లేందుకు అవకాశం
- సీఎం వైఎస్ జగన్‌కు ముస్లిం జేఏసీ కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. రోజువారీ విధులను గంట ముందు ముగించుకుని వెళ్లేందుకు అనుమతిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముత్యాలరాజు అన్ని ప్రభుత్వ శాఖలకు ఉత్తర్వులు జారీ చేశారు. ముస్లిం మతానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు ఈ వెసులుబాటు కల్పించారు. ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 23 వరకు రంజాన్ మాసంలోని ప్రతి రోజూ సాయంత్రం గంట ముందుగా విధులు ముగించుకుని ఆఫీస్ నుంచి వెళ్లిపోవచ్చు. కాగా, పవిత్ర రంజాన్ మాసంలో నమాజ్ చేసుకునేందుకు ముస్లిం ఉద్యోగులకు గంట వెసులుబాటు ఇవ్వడంపై ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ శనివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తుల గడువును 10 నుంచి 20వ తేదీకి పొడిగించడం పైనా ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముస్లిం సమాజానికి పెద్ద మనస్సుతో మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు చెబుతున్నట్టు మునీర్ అహ్మద్ పేర్కొన్నారు.

శ్రీశైలం దేవస్థానం మాస్టర్ ప్లాన్ అభివృద్ధిపై సమీక్ష

- తిరుమల తరహాలో మాడవీధులు, క్యూలైన్ల ఏర్పాటుపై చర్చ
- అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం ఇంటిగ్రేటెడ్ స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మాస్టర్ ప్లాన్ అమలుపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి, శ్రీశైలం దేవస్థానం అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, అందుబాటులోనున్న భూమి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఏవిధంగా అభివృద్ధి చేయనుంది, అవసరమైన ప్రణాళికల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు సీఎస్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న నిర్మాణాలు, మాస్టర్ ప్లాన్‌లో అభివృద్ధి చేయనున్న నిర్మాణాలు, రోడ్ల విస్తరణ, సుందరీకరణ, తిరుమల తరహాలో మాడ వీధుల ఏర్పాటు, క్యూలైన్ల ఏర్పాటుపై సీఎస్ జవహర్ రెడ్డి చర్చించారు. వచ్చే సమావేశంలో విస్తృతంగా ఈ అంశాలపై చర్చిద్దామని, ఆయా ప్రతిపాదనలతో రావాలని ముఖ్య కార్యదర్శి కె.సునీత, దేవదాయశాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి, దేవదాయశాఖ కమిషనర్ హరి జవహర్ లాల్, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, దేవస్థానం ఈవో ఎస్.లవన్న, ఈఈలు రామకృష్ణ, దుర్గేశ్‌ను ఆదేశించారు.

ఈ నెల 16 నుంచి వర్షాలు

- 20 వరకు కొనసాగే అవకాశం
- ఈస్టిండియాపై ద్రోణి, దక్షిణాదిపై ఆవర్తనాల ప్రభావమే కారణం



సాక్షి, విశాఖపట్నం: ఈసారి వేసవిలోనూ వర్షాలు పలకరించనున్నాయి. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ప్రస్తుతం పడమర గాలులతో ఏర్పడిన ద్రోణి సముద్ర మట్టానికి 5.8 కి.మీ. నుంచి 7.6 కి.మీ. ఎత్తులో ఉంటూ బిహార్ నుంచి దక్షిణ కర్ణాటక వరకు ఛత్తీస్‌గఢ్, విదర్భ, తెలంగాణ, ఉత్తర అంతర్గత కర్ణాటక మీదుగా కొనసాగుతోంది. ఈ నెల 16న ఈస్టిండియాపై మరో ద్రోణి, దక్షిణాది రాష్ట్రాలపై మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడబోతున్నాయి. వీటి ప్రభావంతో గాలుల దిశ మారనుంది. ప్రస్తుతం రాష్ట్రంపైకి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. నాలుగు రోజుల్లో ఈ గాలులు దిశ మార్చుకుని దక్షిణ దిశ నుంచి వీచే అవకాశం ఉంది. దీని ప్రభావం 4 రోజులపాటు ఉండనుంది. ఫలితంగా 16 నుంచి 20 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ శనివారం నాటి బులెటిన్‌లో తెలిపింది. అదే సమయంలో క్యుములోనింబస్ మేఘాలు కూడా ఏర్పడే అవకాశం ఉందని, దీంతో అవి ఏర్పడిన ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పలుచోట్ల పగటి (గరిష్ట) ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2–4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. రానున్న ఐదారు రోజులు కూడా ఇవే ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని ఐఎండీ తెలిపింది. ఫలితంగా ప్రస్తుతానికి రాష్ట్రంలో ఉష్ణతాపానికి కాస్త విరామం లభించనుంది.

పంటలు జాగ్రత్త సుమా!

రాష్ట్రంలో కురవనున్న వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, కోత దశలో పంటలను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా రైతులకు సూచించారు.

మార్గదర్శి చిట్‌ఫండ్‌కు కమిషన్ వడ్డింపు

చిట్స్ మొత్తం చెల్లింపులో జాప్యం చేసినందుకు..



గుంటూరు లీగల్ : చిట్స్‌కు సంబంధించిన వాయిదాల నగదును పూర్తిగా చెల్లించినప్పటికీ, ఆ చిట్స్ పూర్తయిన తరువాత ఆ మొత్తం చెల్లింపులో జాప్యం చేసినందుకుగానూ నష్టపరిహారం చెల్లించాల్సిందేనని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్ ఇటీవల ఆదేశించింది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సీహెచ్ సుబ్బారావు 2007 సెప్టెంబర్ 27న మార్గదర్శి చిట్‌ఫండ్‌లో రెండు చిట్స్‌కు చందాదారుడిగా చేరాడు. ఒక్కో చిట్ విలువ రూ.2,50,000. యాభై నెలల కాల వ్యవధి. సుబ్బారావు రెండు చిట్స్‌కు పూర్తిగా నగదు చెల్లించాడు. 2010 అక్టోబర్ 20న చిట్ కాలవ్యవధి పూర్తయింది. దీంతో సుబ్బారావు తన డబ్బులు కోసం మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయంలో సంప్రదించాడు. సాంకేతిక కారణాలవల్ల డబ్బులు చెల్లించలేకపోతున్నట్లు సిబ్బంది తెలిపారు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు బాధితుడు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. అనంతరం బాధితుడి అకౌంట్‌లో నగదు జమచేసినట్లుగా 2019 నవంబర్ 2న రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మార్గదర్శి సిబ్బంది తెలిపారు. తొమ్మిదేళ్ల తరువాత నగదు చెల్లించినందున ఆలస్యానికి నష్టపరిహారం చెల్లించాలని సుబ్బారావు కోరాడు. దీనికి తమ హెడ్డాఫీసు ఒప్పుకోవడం లేదని చిట్‌ఫండ్ సిబ్బంది తెలిపారు. సర్వీసు లోపం కింద నష్టపరిహారం ఇప్పించాలని సుబ్బారావు గుంటూరు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అసలు కమిషన్‌కు ఈ కేసును విచారించే అధికార పరిధిలేదని 'మార్గదర్శి' వాదించగా కమిషన్ దానిని తిరస్కరించింది. 2010 నుంచి 2019 వరకు ఐదు లక్షలకు 12 శాతం వడ్డీ చెల్లించాలని, మానసికంగా హింసించినందుకుగానూ రూ.2 లక్షలు నష్టపరిహారం, కోర్టు ఖర్చులు కింద రూ.10 వేలు చెల్లించాలని మార్గదర్శి చిట్‌ఫండ్‌ను ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు టి.సునీత, కమిషన్ సభ్యులు కె.విజయలక్ష్మి, గుంటకల పున్నారెడ్డి తీర్పు చెప్పారు.

వేటకు వేళాయె..రా!

150కి పైగా కుటుంబాల రాకతో కోనసీమ తీరం కళకళ

- కొత్త గ్రామాలను తలపిస్తున్న పరిసరాలు
- ఏడాదిలో ఎనిమిది నెలలు ఇక్కడే నివాసం
- సముద్రంలో వేటతో జీవనం



ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప వద్ద వలస గ్రామం

సాక్షి, అమలాపురం/ఉప్పలగుప్తం: విస్తారమైన సముద్ర తీరం.. అపారమైన మత్స్యసంపద.. వేటలో సిద్ధహస్తులైన మత్స్యకారులకు కోనసీమ సముద్ర తీరం మత్స్య సంపదకు అక్షయపాత్రే. అందుకే స్థానిక మత్స్యకారులతోపాటు వేటలో నిష్ణాతులైన అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతానికి చెందిన అనేకమంది మత్స్యకారులు కుటుంబాలతో ఇక్కడకు వలస వచ్చి వేటను సాగిస్తుంటారు. ఏటా ఎనిమిది నెలల పాటు ఇక్కడి తీరంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటుచేసుకుని జీవనం సాగిస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సముద్ర తీరాన్ని ఆనుకుని పలు మత్స్యకార గ్రామాలున్నాయి. కాట్రేనికోన మండలం పల్లం, చిర్రయానాం, ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, అల్లవరం మండలం నక్కా రామేశ్వరం, మలికిపురం మండలం తూర్పుపాలెం వద్ద సముద్రతీరం గట్టు మీద పదుల సంఖ్యలో గుడిసెలతో చిన్నచిన్న గ్రామాలు కనిపిస్తుంటాయి. అంతమాత్రాన ఇవి రెవెన్యూ రికార్డుల్లో నమోదైన గ్రామాలు కాదు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి పరిసర ప్రాంతాల నుంచి వేట కోసం ఇక్కడకు వలస వచ్చిన మత్స్యకారుల ఆవాసాలు. ఒక విధంగా ఇవి 'వలస' గ్రామాల కింద లెక్క. పూరి గుడిసెలు, రేకుల షెడ్లలో నివాసం. వినాయక చవితి తరువాత మత్స్యకారులు నక్కపల్లి నుంచి నేరుగా బోట్ల మీద తాము నివాసముండే ప్రాంతాలకు కుటుంబాలతో సహా వస్తారు. అప్పటి నుంచి మేలో సముద్ర వేట నిషేధం విధించే వరకు ఎనిమిది నెలల పాటు ఇక్కడే నివాసముంటారు. ఆదివారం నుంచి శుక్రవారం వరకు సముద్ర వేటకు వెళ్లడం.. శనివారం వేటకు సెలవు పెట్టి స్థానికంగా మార్కెట్ పనులు చూసుకోవడం వీరి దినచర్య. గడిచిన 25 ఏళ్లుగా మత్స్యకారులు ఇక్కడకు వలస వస్తుండడం గమనార్హం.

తెల్లవారుజాము నుంచే వేట..

నిజానికి.. ఈ మత్స్యకారులు తెల్లవారుజామునే బృందాలుగా బోటు మీద వేటకు బయల్దేరుతారు. మధ్యాహ్నం ఒంటి గంట, రెండు మధ్య వేట నుంచి తిరిగి వస్తారు. మత్స్య సంపదకు తీరాన్ని ఆనుకునే వేలం నిర్వహిస్తారు. గులిగింత, ఎర్ర గులిగింత, కచిడి, కూనాలు, పండుగప్ప, చందువాలు ఇటు చెన్నై, అటు కోల్‌కతా, హైదరాబాద్ మార్కెట్‌లకు ఎగుమతి అవుతుంటాయి. మిగిలిపోయిన చేపలను మత్స్యకార మహిళలు ఎండబెట్టి ఎండుచేపలుగా తయారుచేస్తారు. వేటకు వెళ్లే బోటుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు విలువ చేసే మత్స్య సంపద వస్తోంది.



కోనసీమకు ఎందుకు వలస అంటే..

గోదావరి నదీపాయలతోపాటు ప్రధాన మురుగునీటి కాలువలు మొగల ద్వారా సముద్రంలో కలుస్తాయి. సముద్ర ఉప్పునీటిలో మొగల ద్వారా చప్పనీరు వివిధ మార్గాల ద్వారా పెద్దఎత్తున చేరడంవల్ల ఈ తీరంలో మత్స్యసంపద అధికంగా దొరుకుతుంది. నక్కపల్లి తీరం కన్నా కోనసీమ తీరంలోనే మత్స్య సంపద అధికంగా దొరుకుతుందని వీరు చెబుతుంటారు. పండుగప్ప, చందువా, కొయ్యంగ, బొమ్మిడి చుక్క, గులిగింత, మడ పీత, చుక్కపీత, టైగర్ రొయ్యలు, జెల్లలు, ఇసుక దొందులు, టేకు చేపలతోపాటు అత్యంత ఖరీదైన 'కచ్చిడి చేప'లు కూడా దొరుకుతాయి. కచ్చిడి చేప ఖరీదు రూ.75 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉంటోంది.

ఏటా క్రమం తప్పకుండా..



మా ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీల కాలుష్యంవల్ల కొన్నేళ్లగా వేట గిట్టుబాటు కావడం లేదు. ఇక్కడ మాకు వేటకు వెళ్లడానికి పడవలు గట్టుపై పెట్టుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. మత్స్య సంపద మా ప్రాంతంలో కన్నా ఇక్కడ ఎక్కువ.

– దోని చిన్నా, వేంపాడు గ్రామం, నక్కపల్లి మండలం, అనకాపల్లి జిల్లా

మత్స్య సంపద ఎక్కువ



ఈ జిల్లాలో గోదావరి పాయలు ఎక్కువ. చప్పనీరు, ఉప్పునీరు కలిసే చోట మత్స్య సంపద ఎక్కువగా ఉంటుంది. మా ప్రాంతం కన్నా ఇక్కడ రెట్టింపు ఆదాయం వస్తోంది. 8 నెలలు ఇక్కడే ఉంటాం.

– సోడిపల్లి అప్పలరాజు, రాజయ్యపేట, నక్కపల్లి మండలం, అనకాపల్లి జిల్లా

మేం పెట్టుబడి పెడతాం



నాకు సొంతంగా రెండు బోట్లు ఉన్నాయి. అనకాపల్లి జిల్లా నుండి వేట నిమిత్తం ఈ ప్రాంతానికి వస్తున్న మత్స్యకారులకు మేం పెట్టుబడి పెడతాం. వేటలో వచ్చే ఆదాయంలో 10% మాకు ఇవ్వాలి. వారికి ఎటువంటి కష్టం వచ్చినా అండగా ఉంటాం.

– బొమ్మిడి రాంబాబు, వ్యాపారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

స్థానిక మత్స్యకారుల ఎదురు పెట్టుబడి

వలస మత్స్యకారులకు స్థానిక మత్స్యకార వ్యాపారులు ఎదురు పెట్టుబడి పెడతారు. సీజన్‌లోని ఎనిమిది నెలలకు గాను బోటుకు వచ్చి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లిస్తారు. వలస మత్స్యకారులు వేటాడి తెచ్చిన మత్స్య సంపద ద్వారా వచ్చిన ఆదాయంలో పదిశాతం ఈ వ్యాపారులు తిరిగి తీసుకుంటారు.

తోడు దొంగలు

▶ మొదటి పేజీ తరువాయి

స్టాంపులు– రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ఆ సంస్థ కార్యాలయాల్లో నిర్వహించిన సోదాలతో అక్రమాల డొంక కదిలింది. దీనిపై ఆ శాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో సీఐడీ రంగంలోకి దిగడంతో రామోజీరావు అవినీతి సామ్రాజ్యం బాగోతం మొత్తం బహిర్గతమైంది. చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఆ సంస్థపై సీఐడీ అధికారులు శనివారం కేసు నమోదు చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు ఏ–1గా, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ, రామోజీరావు పెద్ద కోడలు చెరుకూరి శైలజ ఏ–2గా, మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ఏ–3గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. వారిపై సెక్షన్లు 120(బి), 409, 420, 477(ఎ) రెడ్‌విత్ 34 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేశారు. ఏపీ ఆర్థిక సంస్థల డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం–1999, చిట్ ఫండ్ చట్టం–1982 కింద కూడా కేసు నమోదు చేసినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.



ఏలూరు మార్గదర్శి కార్యాలయంలో అధికారుల తనిఖీలు

చందాదారుల హక్కులకు విఘాతం

మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ బ్రాంచి కార్యాలయాల్లో రాష్ట్ర స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో సోదాలు నిర్వహించింది. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలు, చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధంగా ఆ సంస్థ అక్రమాలకు పాల్పడుతున్నట్టు గుర్తించింది. ఆ తనిఖీల్లో మార్గదర్శి చిట్ ఫండ్స్ బ్రాంచి మేనేజర్లు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు ఏమాత్రం సహకరించ లేదు. దాంతో అధికారులు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో గత ఏడాది డిసెంబర్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మరిన్ని అక్రమాలు వెలుగు చూశాయి. చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ చందాదారుల హక్కులకు విఘాతం కలిగిస్తున్నారని ఆధారాలతో సహా నిర్ధారించారు. సంస్థ యాజమాన్యం తమ స్వప్రయోజనాల కోసం అక్రమాలకు పాల్పడుతోందని నిగ్గు తేల్చారు. దాంతో చందాదారుల హక్కుల పరిరక్షణ, రిజర్వ్ బ్యాంక్ నిబంధనలను అమలు చేయడం కోసం ఈ వ్యవహారాన్ని సీఐడీకి నివేదించారు. విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, పల్నాడు, కర్నూలు, అనంతపురం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఈ మేరకు సీఐడీకి లిఖిత పూర్వకంగా సీఐడీ విభాగానికి ఫిర్యాదు చేశారు. దాంతో మార్గదర్శి చిట్ ఫండ్స్‌పై సీఐడీ కేసు నమోదు చేసింది. సీఐడీ అధికారులు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో శనివారం సోదాలు నిర్వహించి మేనేజర్లను ప్రశ్నించారు. సోదాలు మొదలుపెట్టగానే నరసరావుపేట, ఏలూరు బ్రాంచి మేనేజర్లు పరారవ్వడం గమనార్హం. ఈ సోదాల్లో సీఐడీ అధికారులు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కూడా సోదాలు కొనసాగించనున్నారు.

అక్రమ డిపాజిట్లు

మార్గదర్శి చిట్ ఫండ్స్ దశాబ్దాలుగా అక్రమ డిపాజిట్లు సేకరిస్తూ వచ్చింది. ఆ సంస్థ కార్యాలయాల్లోనే 'మార్గదర్శి ఫైనాన్సియర్స్' పేరుతో భారీగా అక్రమ డిపాజిట్లను సేకరించింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో దీనిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశారు. అప్పట్లో రిజర్వ్ బ్యాంక్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. దాంతో తాము తప్పు చేశామని రామోజీరావు లిఖిత పూర్వకంగా అంగీకరిస్తూ డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్ మొత్తాలను వెనక్కి ఇచ్చేస్తున్నట్టు ప్రకటించారు. దాంతో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఇక డిపాజిట్ల సేకరణను నిలిపి వేసిందని అంతా భావించారు. కానీ గుట్టుచప్పుడు కాకుండా 'రశీదు'ల రూపంలో అక్రమ డిపాజిట్లు వసూలు చేస్తున్నట్టుగా స్టాంప్స్–రిజిస్ట్రేషన్ల శాఖ ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో బహిర్గతమైంది.

మార్గదర్శి అక్రమాలు ఇవీ..

- చందాదారులు నెలవారీ మొత్తం చెల్లించకపోయినా, వాయిదాల మొత్తం చెల్లించకపోయినా ఆ ఖాతాలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో చూపించారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ఆ చీటీలను ఇతర వ్యక్తుల పేరుతో మార్పు చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం.
- చందాదారులు పాడిన చిట్ మొత్తాన్ని వారికి వెంటనే చెల్లించడం లేదు. ఆ మొత్తంపై 4 శాతం నుంచి 5 శాతం వరకు చందాదారునికి వడ్డీ చెల్లిస్తామని చెబుతూ ఓ రశీదు ఇస్తున్నారు. అంటే మార్గదర్శి సంస్థ ఆ చిట్ మొత్తాన్ని డిపాజిట్‌గా స్వీకరిస్తున్నట్టే. ఇది రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధం. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు స్వీకరించడాన్ని చట్టం నిషేధించింది. అయినప్పటికీ మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా 'ప్రత్యేక రశీదు' ముసుగులో డిపాజిట్లు సేకరించింది.
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ తమ ఆదాయ, వ్యయాల ఖాతాలు, ఆస్తి, అప్పుల నివేదికలు, పెట్టుబడుల నివేదికలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచింది. ఇది చిట్ ఫండ్ చట్టంలోని సెక్షన్ 28 రెడ్‌విత్ 24 నిబంధనలకు విరుద్ధం.
- మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల నుంచి భారీగా నిధులను మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ నిధులను మార్గదర్శి యాజమాన్యం మార్కెట్ రిస్క్ అత్యధికంగా ఉండే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెట్టింది. ఇది చిట్ ఫండ్ చట్టానికి విరుద్ధం.

రికార్డుల నిర్వహణలో గూడు పుఠాణి

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తాము గుర్తించిన అక్రమాలపై స్టాంప్స్– రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు మరింత లోతుగా పరిశీలించారు. మార్గదర్శి సంస్థ సమర్పించిన ఆర్థిక నివేదికల (ఫైనాన్సియల్ స్టేట్‌మెంట్స్)పరిశీలనకు ఓ చార్టెడ్ అకౌంటెంట్‌ను నియమించడం ద్వారా పలు అక్రమాలను గుర్తించారు.
- చిట్టీల వారీగా లాభనష్టాల ఖాతా, బ్యాలెన్స్ షీట్‌లను సక్రమంగా నిర్వహించడం లేదు.
- బ్యాలన్స్ షీట్‌లో నోట్ నంబర్ 7 కింద రూ.459.98 కోట్లు చూపించారు. కానీ పరిశీలించగా ఆ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది.
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు మూడు అనుబంధ కంపెనీలు ఉన్నట్టుగా బ్యాలన్స్ షీట్ నోట్ నంబర్ 40లో పేర్కొన్నారు. మార్గదర్శి చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్–చెన్నై, మార్గదర్శి చిట్స్ (కర్ణాటక) ప్రైవేట్ లిమిటెడ్–బెంగళూరు, ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్– హైదరాబాద్‌లను అనుబంధ కంపెనీలుగా చూపించారు. నిధులను నిబంధనలకు విరుద్ధంగా తరలించేందుకే ఇలా చేశారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ ఆ మూడు అనుబంధ కంపెనీల్లో రూ.1,05,80,000 పెట్టుబడి పెట్టినట్టు బ్యాలన్స్ షీట్‌లో చూపించారు. కానీ ఆ కంపెనీల షేర్ హోల్డర్స్ జాబితా పరిశీలించగా.. ఒక్క ఉషా కిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌లోనే 88.5 శాతం వాటాతో రూ.2 కోట్లు పెయిడ్ అప్ క్యాపిటల్‌గా పెట్టుబడి పెట్టినట్టు నిర్ధారణ అయ్యింది.
- చిట్ ఫండ్ కంపెనీలు ఇతర వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టడం చిట్ ఫండ్ చట్టం–1982కు విరుద్ధం. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు ఉన్న మూడు అనుబంధ కంపెనీలు అదే తరహా వ్యాపారంలో ఉన్నట్టుగా చూపించారు. కానీ ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ చిట్‌ఫండ్ వ్యాపారంలో లేదు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఆ కంపెనీలో మార్గదర్శి చిట్ ఫండ్స్ 88.5 శాతం వాటా ఉంది. అంటే ఆ కంపెనీలో నిర్ణయాధికారం మార్గదర్శి సంస్థదే.

అప్రమత్తతే అత్యంత కీలకం

- జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులపై ఏమాత్రం అలసత్వం వద్దు
- కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా జ్వరాలు, శ్వాసకోశ వ్యాధుల పెరుగుదల
- క్షేత్రస్థాయిలో వైద్యులు, సిబ్బంది చురుకుగా స్పందించాలి
- కోవిడ్ కేసులు తగ్గినా టెస్టింగ్, ట్రాకింగ్, ట్రీట్మెంట్, వ్యాక్సినేషన్ మరవద్దు
- రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: ఇన్‌ఫ్లూయెంజా లైక్ ఇల్‌నెస్ (ఐఎల్ఐ), సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇల్‌నెస్ (ఎస్ఏఆర్ఐ). కొంతకాలంగా వైద్య పరిభాషలో తరచుగా వినియోగిస్తున్న మాటలివి. ఆస్పత్రుల్లో జ్వరం, తీవ్ర శ్వాసకోశ సమస్యలకు సంబంధించిన కేసులు వేగంగా పెరుగుతున్నాయి. సీజన్ మార్పు నేపథ్యంలో జ్వరాలు, జలుబు, దగ్గు లక్షణాలు రావడం సహజమే అయినప్పటికీ ప్రస్తుతం వీటి తీవ్రత కాస్త ఎక్కువగా ఉంటోంది. వైరస్ ప్రభావంతో వస్తున్న ఈ సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది. వైద్యుల సహకారం తీసుకోవాలని, ప్రభుత్వ వైద్య సేవలను విస్తృతం చేసిన క్రమంలో ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందాలని హెచ్చరిస్తోంది. ఈ మేరకు రాష్ట్రాలను అప్రమత్తం చేస్తూ ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేసింది. తాజాగా నమోదవుతున్న జ్వరాలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణం హెచ్1ఎన్1, హెచ్3ఎన్2 వైరస్ ప్రభావం ఉన్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ వైరస్ ప్రభావంతో వస్తున్న వ్యాధులు ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారిపై ఈ వైరస్ ప్రభావం అధికంగా ఉండటంతో వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. వైరస్ సోకిన వ్యక్తులతో మెదిలే సమయంలో మాస్కులు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించడం, చేతులు క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవడం లాంటి చర్యలు తప్పకుండా తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సూచనలు జారీ చేసింది. కాగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా కోవిడ్–19 కట్టడిలో ఉన్నప్పటికీ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వ్యాధుల తీరును పరిశీలిస్తే కోవిడ్–19 కేసుల పెరుగుదలకు అవకాశాలున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ శనివారం రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణ

8 గంటలు.. ముఖాముఖి

ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవితను విచారించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం సుదీర్ఘంగా విచారించింది. ఐదుగురు సభ్యులతో కూడిన ఈడీ అధికారుల బృందం ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల మధ్య దాదాపు 8 గంటలపాటు సుదీర్ఘంగా విచారించింది. మధ్యలో ఒక గంట విరామం ఇచ్చారు. అధికారులు ప్రతి అంశాన్ని విడివిడిగా ప్రస్తావిస్తూ, నిందితుల వాంగ్మూలాలతో, ఆధారాలతో సరిపోల్చుకుంటూ.. కవిత చెప్పిన సమాధానాలను రికార్డు చేసుకున్నారు. ఈ నెల 16న మరోసారి విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. ఈడీ కార్యాలయం లోపలికి పిడికిలి బిగించి అభివాదం చేస్తూ వెళ్లిన కవిత.. విచారణ పూర్తయ్యాక నవ్వుతూ బయటకు వచ్చారు. అనంతరం ఢిల్లీ నుంచి తన సోదరుడు, తెలంగాణ మంత్రి కేటీఆర్, మరో మంత్రి హరీశ్‌రావుతో కలిసి ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వచ్చారు.

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవితను జాయింట్ డైరెక్టర్, మహిళా డిప్యూటీ డైరెక్టర్, ముగ్గురు అసిస్టెంట్ డైరెక్టర్లతో కూడిన బృందం విచారించింది. ''ఢిల్లీ మద్యం పాలసీలో మీ స్థాయిలో ఏం చేశారు? అరుణ్ పిళ్లై, శ్రీనివాసరావు, బుచ్చిబాబు, విజయ్‌నాయర్ తదితరులు ఇచ్చిన స్టేట్‌మెంట్లలో మీ గురించి చెప్పిన అంశాలపై వివరణ ఏమిటి? హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కోహినూర్, ఢిల్లీ ఒబెరాయ్ మైడెన్స్‌లలో జరిగిన సమావేశాల్లో ఏం మాట్లాడారు? మద్యం విధానంపై ఆప్ అగ్రశ్రేణి నేతలతో చర్చించారా? కిక్‌బ్యాక్‌ల రూపంలో రూ.100 కోట్లు వెనక్కి రావడానికి, లాభాల్లో ఆప్‌కు ముడుపులు ఇవ్వడానికి కుదిరిన ఒప్పందం ఏమిటి?'' అని ప్రశ్నించారు. ఈ కుంభకోణంలో సౌత్ గ్రూపునకు ఫ్రంట్ మేన్‌గా ఉన్న అరుణ్ పిళ్లై కవితకు బినామీయేనా అనే కోణంలోనూ విచారించారు. సమీర్ మహేంద్రు, మాగుంట రాఘవ, కవితలకు ఇండో స్పిరిట్స్‌లో 33 శాతం చొప్పున వాటా అనుకుంటున్నామని విజయ్‌నాయర్ వాంగ్మూలంలో చెప్పిన విషయాన్నీ ప్రస్తావించారు. ''మద్యం విధానం రూపకల్పన సమయంలో ఢిల్లీ సీఎం, ఢిల్లీ డిప్యూటీ సీఎంలతో రాజకీయ అవగాహన ఏమిటి? పాలసీ అనుకూలంగా ఉంటే ఇస్తానన్న ముడుపులు ఎంత? ఆ మొత్తాన్ని ఏ విధంగా ఢిల్లీకి తరలించారు? హైదరాబాద్‌లోని నివాసంలో భర్తతో కలిసి సమీర్ మహేంద్రుతో ఏమి చర్చించారు? అరుణ్ పిళ్లైతో చేస్తున్న వ్యాపారాలేమిటి? ఢిల్లీ మద్యం వ్యాపారంలో పిళ్లై పేరిట పెట్టుబడి ఎంత?'' అని ఆరా తీశారు. మద్యం విధానం రూపకల్పన సమయంలో వాడిన రెండు ఫోన్లను ధ్వంసం చేశారా? ఎవరికైనా ఇచ్చారా? అని కూడా ప్రశ్నించారు. విచారణ మధ్యలో కవిత ప్రస్తుతం వినియోగిస్తున్న ఫోన్ ఇవ్వాలని ఈడీ అధికారులు కోరారు. ఆమె తన నివాసంలో ఉంచిన ఆ ఫోన్‌ను తెప్పించి ఇవ్వగా.. అధికారులు ఆ ఫోన్‌ను క్లోనింగ్ చేసుకుని, తిరిగి ఇచ్చినట్టు సమాచారం.

సింగిల్‌గానే విచారణ

అరుణ్ పిళ్లైతో కలిపి కవితను విచారించనున్నట్టు ఈడీ వర్గాలు తొలుత వెల్లడించాయి. కానీ శనివారం ఎమ్మెల్సీ కవిత ఒక్కరినే విచారించారు. తాను కవితకు బినామీనంటూ ఈడీ కోర్టుకు సమర్పించిన వాంగ్మూలం నకిలీదంటూ పిళ్లై కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో ఆయనతో కలిపి కవితను విచారించలేదని తెలిసింది. ఇప్పటికే కస్టడీలో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను కలిపి ఈ నెల 16న కవితను విచారిస్తారని సమాచారం.

పోలవరంపై సీఎస్ సమీక్ష

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై సీఎస్ జవహర్‌రెడ్డి శనివారం విజయవాడలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. డయాఫ్రం వాల్ ఎంత మేర దెబ్బతిన్నది, దానిని ఎప్పటిలోగా పునర్నిర్మాణం చేయగలరు... వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు ప్రగతి వివరాలను, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వివరాలపై సీఎస్ సమీక్షించారు. జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌ను 3 నెలల్లో పునర్నిర్మాణం చేయాలని కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.



..కక్కుర్తి పడి ఎందుకు తీసుకున్నార్సార్..!

ఉద్యమానికి మా మద్దతు లేదు

ఏపీ వీఆర్‌వో అసోసియేషన్

నరసరావుపేట: రాష్ట్రంలో అమరావతి ఏపీఆర్‌ఎస్‌ఏ, ఏపీజేఏసీ చేపడుతున్న ఉద్యమానికి రాష్ట్ర ఏపీ వీఆర్‌వో అసోసియేషన్ తరఫున ఎటువంటి మద్దతు తెలియజేయట్లేదని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని ఓ కల్యాణ మండపంలో పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ అధికార్ల అసోసియేషన్ ఎన్నికల కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, గౌరవ అతిథులుగా సూరేపల్లి రాజశేఖర్, ఇంటూరు అనీల్‌కుమార్ హాజరయ్యారు. రవీంద్రరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్వో నుంచి గ్రేడ్-2 వీఆర్వోలుగా పదోన్నతి పొందిన వారికి ప్రొబేషన్ డిక్లరేషన్ కోసం తీవ్ర ప్రయత్నం చేస్తున్నామన్నారు. వీఆర్వోల సమస్యలపై అహర్నిశలు పోరాడుతున్నామని స్పష్టం చేశారు. వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతుల విషయంలో మెరుగైన రేషియో పొందే విధంగా కృషిచేస్తామని వెల్లడించారు.

బలిమెల నీటిపై ఆంధ్ర, ఒడిశా ఒప్పందం



నీటి నిల్వలపై సమావేశమైన అధికారులు

సీలేరు(అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్ర, ఒడిశా సరిహద్దు బలిమెల రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వలను వేసవిలో విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో వాడుకునేలా ఇరు రాష్ట్రాల అధికారులు ఒప్పందానికి వచ్చారు. బలిమెల నీటి నిల్వలపై శనివారం మూడు గంటల పాటు చర్చించారు. బలిమెలలో ప్రస్తుతం 39.9820 టీఎంసీల నీరు ఉంది. అందులో ఒడిశాకు 21.4867 టీఎంసీలు కేటాయించగా, ఏపీకి 18.4953 టీఎంసీలు కేటాయించారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయ అవసరాల కోసం బలిమెలలో ఉన్న నీటిని ఏపీ రోజుకు 1200 క్యూసెక్కులు, ఒడిశా 4000 క్యూసెక్కులు వాడుకునేందుకు అంగీకరించారు. 2022 జూలై నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఒడిశా 34.1771 టీఎంసీలు వాడుకోగా, ఏపీ అధికంగా 37.1684 టీఎంసీలు వాడుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఒడిశా రాష్ట్రం పొట్టేరు ఇరిగేషన్ అధికారులు, ఏపీ జెన్‌కో తరఫున సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పప్పు ధాన్యాల కొనుగోళ్లకు పచ్చజెండా

ఆర్బీకేల ద్వారా శనగల్ని కొనుగోలు చేస్తున్న మార్క్‌ఫెడ్
- ఇప్పటివరకు 12,506 టన్నుల సేకరణ
- ఏప్రిల్ నుంచి మినుము, పెసలు, వేరుశనగ కొనుగోళ్లు



సాక్షి, అమరావతి: మార్కెట్‌లో కనీస మద్దతు ధర దక్కని పప్పు ధాన్యాల కొనుగోలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుత రబీ సీజన్‌లో శనగలు, మినుములు, పెసల కొనుగోలుకు చర్యలు చేపట్టింది. ఆర్బీకేల ద్వారా ఇప్పటికే శనగలు కొనుగోలు చేస్తుండగా.. ఏప్రిల్ మొదటి వారం నుంచి పెసలు, మినుముల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ ఏర్పాట్లు చేసింది. శనగలు పండించిన 30,776 మంది రైతులు ఆర్‌బీకేలలో తమ పేర్లను నమోదు చేయించుకోగా.. ఇప్పటివరకు 12,506 టన్నుల శనగల్ని కొనుగోలు చేశారు. మొత్తంగా 1,22,933 టన్నుల శనగలు, 99,278 టన్నుల మినుములు, 45,864 టన్నుల వేరుశనగ, 19,403 టన్నుల పెసలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలఖారు వరకు శనగల కొనుగోళ్లు కొనసాగుతాయి.

మొదటి వారం నుంచి మిగతా కొనుగోళ్లు

ఏప్రిల్ మొదటి వారం నుంచి మినుము, పెసలు, వేరుశనగ కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ శ్రీకారం చుట్టనుంది. పంట నమోదు (ఈ-క్రాప్) ఆధారంగానే అపరాల కొనుగోళ్లు చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులకే తొలుత ప్రాధాన్యత ఇస్తారు. పంట కోతల తేదీ ఆధారంగా కొనుగోలు తేదీని నిర్ధారించి.. కొనుగోలు తేదీ, కొనుగోలు కేంద్రం సమాచారాన్ని ఎస్‌ఎంఎస్ ద్వారా రైతులకు పంపిస్తారు. దళారుల బెడద లేకుండా బయోమెట్రిక్ తప్పనిసరి చేశారు. కొనుగోలు వేళ రైతులకు ఈ-రశీదు ఇస్తారు. సేకరించిన ఉత్పత్తులను సులభంగా ట్రాక్ చేయడానికి వీలుగా సంచులకు క్యూఆర్ కోడ్/ఆర్‌ఎఫ్ ఐడీ ట్యాగ్ వేస్తున్నారు. చెల్లింపుల కోసం ప్రత్యేకంగా ఈ-సైన్ అమలు చేస్తున్నారు.

పారదర్శకంగా కొనుగోళ్లు



ఈ ఏడాది శనగ, వేరుశనగ, మినుము, పెసల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్బీకేల్లో నమోదు చేసుకున్న రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నాం. చిన్న, సన్నకారు రైతులకు తొలుత ప్రాధాన్యత ఇస్తాం. పంట ఉత్పత్తుల కొనుగోలు పారదర్శకంగా జరుగుతుంది.
– రాహుల్‌పాండే, ఎండీ, ఏపీ మార్క్‌ఫెడ్

మార్కెట్‌లో ధరలు.. ప్రభుత్వం మద్దతు ధరలు ఇలా.. (క్వింటాల్‌కు రూపాయల్లో)

రకం	మార్కెట్‌లో ధర	ప్రభుత్వం కొనుగోలు చేసే ధర
శనగలు	4,300-4,800	5,335
పెసలు	6,000-7,000	7,755
మినుములు	6,500-7,000	6,600
వేరుశనగ	4,800-5,000	5,850

కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందిలా..

శనగలు	1,22,933 టన్నులు..
మినుములు	99,278 టన్నులు
వేరుశనగ	45,864 టన్నులు..
పెసలు	19,403 టన్నులు..

రేపటి నుంచి ఆర్బీకేల్లో ఈ-క్రాప్ జాబితా ప్రదర్శన

రైతుల నుంచి 17వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

సాక్షి, అమరావతి: రబీ(2022-23) సీజన్‌కు సంబంధించిన పంటల నమోదు(ఈ-క్రాప్) వివరాలను సామాజిక తనిఖీలో భాగంగా ఈ నెల 13 నుంచి 17 వరకు ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నట్టు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 48,04,708 ఎకరాల్లో పంటలు సాగవ్వగా.. ఈ నెల 4తో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ ముగిసిందన్నారు. 100 శాతం పంటల నమోదు పూర్తికాగా.. రైతుల ఈ-కేవైసీ 97 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఖరీఫ్-2022లో 1.10 కోట్ల ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు కాగా, రైతుల ఈ కేవైసీ 93 శాతం పూర్తయ్యిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్ కంటే ఈసారి 4 శాతం అధికంగా రైతుల ఈ-కేవైసీ నమోదు చేయగలిగామన్నారు. ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలను 13వ తేదీ నుంచి 17 వరకు సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామని.. ఈ సందర్భంగా నిర్వహించే గ్రామసభల్లో ఈ-క్రాప్ జాబితాలో ఉన్న రైతుల వివరాలను సిబ్బంది చదివి వినిపిస్తారని తెలిపారు. రైతులందరూ తమ ఆర్బీకేకు వెళ్లి ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలుంటే సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఏమైనా మార్పులుంటే క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సవరిస్తారని తెలిపారు. వైఎస్సార్ పంటల బీమాతో సహా మిగిలిన సంక్షేమ పథకాల అమలుకు ఈ-క్రాప్ జాబితానే ప్రామాణికమని, అందువల్ల రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రబీ సీజన్ పంటల నమోదు జాబితా సవరణకు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేశారు.

22న తిరుమలలో ఉగాది ఆస్థానం

21, 22 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 21న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 22న శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరుగనుంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 22వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలైన కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలను, అలాగే 21, 22 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. కాగా, తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది.









మూఢత్వము చేత బుద్ధి మాటలకిక చెవియొగ్గలేని మునలి రాజుకంటె బీదవాడైన జ్ఞానవంతుడగు చిన్న వాడే శ్రేష్ఠుడు.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ. పంచమి రా.7.38 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** స్వాతి ఉ.6.23 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** ప.11.55 నుండి 1.29 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.16 వరకు, **అమృతఘడియలు:** రా.9.22 నుండి 10.57 వరకు.

సూర్యోదయం : 6.15
సూర్యాస్తమయం : 6.05
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

తిరుగులేని తీర్పు

ఎన్నికల కమిషన్(ఈసీ) ఎంపిక ప్రక్రియపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు మరింతగా స్వతంత్ర ఎన్నికల కమిషన్‌కి హామీనిస్తుంది. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన స్వతంత్ర ఎంపిక కమిటీ ఏర్పాటు వల్ల ఈసీ ప్రస్తుత ఎంపిక పద్ధతిని సరిచేయడమే కాకుండా ఎంపిక ప్రక్రియకు పవిత్రతను జోడిస్తుంది.

సందర్భం



కాళేశ్వరం రాజ్

దీనిని ఇప్పుడు మనం తప్పుపట్టలేని విధంగా ప్రకటిద్దాం: దాదాపు ప్రతి రాజకీయ సమస్య కూడా న్యాయస్థానం పరిధిలోకి వస్తున్న సమయంలో దేశంలో రాజకీయ అధికారానికి సంబంధించి అత్యంత శక్తిమంతమైన కేంద్రంగా భారత సర్వోన్నత న్యాయస్థానం కొనసాగుతోంది. ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి, ఇతర కమిషనర్ల ఎంపిక కోసం తటస్థ విభాగం ఏర్పాటు అనేది అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో వచ్చిన ప్రధాన ఉపశమనం. న్యాయవ్యవస్థ క్రియాశీలతా యుగాన్ని ఈ తీర్పు పునరుద్ధరించింది. గతంలో జరిగిన విధంగా కేంద్ర ప్రభుత్వంలో బలహీన సంకీర్ణంలోని తప్పులకు వ్యతిరేకంగా కాకుండా, బలవంతుడైన కార్యనిర్వాహకుడికి వ్యతిరేకంగా ఈసారి సుప్రీం కోర్టు వ్యవహరించింది.

పిటిషనర్ల వాదంలోని ప్రధానాంశం ఏమిటంటే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(2) ప్రకారం సీఈసీ (ప్రధాన ఎన్నికల కమిషనర్), ఈసీ (ఎన్నికల కమిషనర్)ల ఎంపిక రాష్ట్రపతి ద్వారా జరుగుతున్నప్పటికీ, దానికి నిర్దిష్టంగా ప్రకటించిన చట్టం ప్రాతిపదికగా ఉండాలన్నదే. అయినప్పటికీ దీనికి సంబంధించి పార్లమెంటులో ఎలాంటి చట్టాన్నీ తీసుకురాలేదు. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకుని, సీఈసీ, ఈసీల ఎంపిక విషయంలో కేంద్రం మినహాయింపు పొందుతోంది. అధికారంలో ఉన్నవారికి, తమను ఎంపిక చేసుకున్న వారి అభిమతానికి అనుకూలంగా వ్యవహరించడం సీఈసీకి, ఈసీ సభ్యులకు పరిపాటిగా మారింది. అందువల్లే ప్యానెల్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని హామీ ఇచ్చేందుకు సీఈసీ, ఈసీల నియామకం విషయంలో స్వతంత్ర సంస్థను ఏర్పర్చాలని పిటిషనర్లు ఉన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

రాజ్యాంగ నియమంతో మరొక సమస్య కూడా ఉంది. ఆర్టికల్ 324(5) నియమం ప్రకారం, సీఈసీ తొలగింపునకు వ్యతిరేకంగా ప్రత్యేక రక్షణ కూడా ఉంటుంది. ఇతర ఈసీ సభ్యులకు ఇలాంటి రక్షణను కల్పించలేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలో మినహా, ఎన్నికల ప్రధాన కమిషనర్ తొలగించకూడదని ఈ నియమం పేర్కొంది. వాస్తవంగా దీని అర్థం ఏమిటంటే సీఈసీని పార్లమెంట్ అభిశంసించే మార్గం ద్వారా మాత్రమే తొలగించవచ్చు. ఇది కష్టమే కావచ్చు కానీ అసాధ్యమని చెప్పలేము. సీఈసీ నియామకం తర్వాత ఆయన సర్వీస్ నియమాలు తనకు అననుకూలతను తీసుకురాకూడదని ఈ నియమమే చెబుతోంది. పక్షపాతం లేదా, ఆశ్రిత పక్షపాతం ద్వారా సీఈసీ ఎంపికలో ఉల్లంఘన జరిగినప్పుడు సీఈసీకి మంజూరు చేసిన ఈ రక్షణ ఛత్రాన్ని నష్టపోవలసి ఉంటుంది. పైగా, సీఈసీ పదవీకాలంలో ఉండగా రక్షణ లేదా భద్రతను కోరుతున్నట్లయితే, సీఈసీపై ఇతర ఈసీ సభ్యులు మరింతగా అనుమానించవచ్చు. ఈ భయాందోళనలనే పిటిషనర్లు సుప్రీం కోర్టు ముందు వెలిబుచ్చారు.

సీఈసీని ఎంపిక చేయడానికి ప్రధాన మంత్రి, లోక్‌సభలో అతిపెద్దపార్టీకి చెందిన ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌తో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పర్చడం అంటే నిలకడైన ప్రజాస్వామ్యం వైపు పెద్ద ముందంజగా భావించాలి. ఆర్టికల్ 342లోని ఖాళీ అనేది ప్రజాస్వామిక వాతావరణానికి చాలా అవసరం. అందుకే దానిపై ఎలాంటి ఉత్తరువు, సూచన ద్వారా ఆ ఖాళీని ఆక్రమించాలని రాజ్యాంగ సభ భావించలేదు. ఆ ఖాళీని భవిష్యత్ పార్లమెంటుకే వదిలేశారు. ప్రజాస్వామిక చట్టబద్ధతకి చెందిన గొప్ప లక్షణంతో ఈ సమస్యను ఎన్నికయ్యే పార్లమెంట్ చట్టబద్ధం చేస్తుందని భావించారు. అది రాజ్యాంగ ఆకాంక్షగానే తప్ప ఖాళీగా ఎప్పుడూ ఉండలేదు. ఏమైనప్పటికీ దాన్ని ఎవరూ పూరించలేదు. ఫలితంగా, సీఈసీలను ఈసీలను ఎంపిక చేసి నియమించే అధికారాన్ని కార్యనిర్వాహక వర్గమే ఆస్వాదిస్తూ వచ్చింది. దీనివల్ల ఏర్పడిన ముఖ్యమైన భయాల్లో ఒకటి... పాలకపార్టీకి అనుకూలంగా కమిషన్‌ని పాక్షిక పునాదులపై నిర్వహించడమే. రాజ్యాంగ మౌనం ప్రయోజనకరమైనది, భావనాత్మకమైనది, ప్రజాస్వామికమైనదిగా ఉండేది. అదే పార్లమెంటు విషయానికి వస్తే మార్మికంగా, దుస్సాహసికంగా, అప్రజాస్వామికంగా ఉండేది. అయితే మార్చి 2న వెలువరించిన తీర్పు ద్వారా ఉన్నత న్యాయస్థానం దీన్ని సరిచేసింది.

సీఈసీ, ఈసీ క్రియాత్మక స్వయంప్రతిపత్తి వారు ఎంపికైన ప్రక్రియతో ప్రత్యక్ష అనుసంధానం కలిగి ఉంటుంది. ఎన్నికల రూపంలోని నిరంకుశత్వంలో అనేక విధాలుగా పోల్ ప్యానెల్‌పై కార్యనిర్వాహకవర్గానిదే పైచేయిగా ఉంటుంది. సుప్రీంకోర్టు చెప్పినట్లుగా దాడికి గురయ్యే స్థితిలోని ఎన్నికల కమిషన్ ఒక కృత్రిమ పరిస్థితిలో కూరుకుపోయి, దాని సమర్థమైన పనితీరు నుంచి పక్కకు వెళుతుంది. సుప్రీంకోర్టు తీర్పు, ఎంపిక ప్రక్రియలో న్యాయబద్ధతకు హామీనివ్వడమే కాకుండా, భారత్ కల్లోల కాలాల్లో రాజ్యాంగ పాఠంగా వ్యవహరిస్తుంది. దేశంలో ఎన్నికల



ప్రక్రియను ఘోరంగా దుర్వినియోగపరుస్తున్నట్లు తీర్పు గుర్తించింది. ఈసీ ఎంపిక ప్రక్రియపై సుప్రీంకోర్టు తాజా తీర్పు సాంప్రదాయిక ప్రజాస్వామ్యానికీ, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికీ మధ్య ఉన్న చక్కటి వ్యత్యాసాన్ని గుర్తిస్తోంది. మొదటి రకం ప్రజాస్వామ్యంలో మెజారిటీకి మాత్రమే విలువ ఉంటుంది. రెండో రకం ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది.

ఈ తీర్పు ద్వారా చాలాకాలం తర్వాత క్రియాశీల న్యాయ వ్యవస్థను దేశం చూసింది. న్యాయవ్యవస్థ క్రియాశీలత పునరుద్ధరణ న్యాయపరమైన హేతువుకు కట్టుబడటమే కాకుండా, పూర్వ ప్రమాణాల మద్దతును కూడా కలిగి ఉంటుంది. గొప్పగా కనబడుతున్న కార్యనిర్వాహకవర్గంతో మెజారిటీతత్వపు అంధకార దశ సాగుతున్న కాలంలో ఈ తీర్పు వెలుగులోకి వచ్చింది. ఇది ఈ తీర్పుకు ఒక అంతర్గత విలువను జోడించింది. న్యాయవ్యవస్థ అతి చర్యపై ఆరోపణలు అనేవి మాంటెస్క్యూర్(ఫ్రెంచ్ తత్వవేత్త) ప్రతిపాదించిన అధికారాల విభజన సూత్రాలపై ఆధార పడిన కేంద్రప్రభుత్వ సాంప్రదాయిక వైఖరినే ప్రతిబింబిస్తున్నాయి. స్టీవెన్ లెవిట్‌స్కీ, డేనియల్ జిబ్లాట్ రాసిన 'హౌ డెమోక్రసీస్ డై'లోనూ, ఫిలిప్ కోగన్ రాసిన 'ద లాస్ట్ ఓట్'లోనూ వివరించినట్లుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక వ్యవస్థలు అనేక కారణాల వల్ల ప్రమాదంలో పడుతున్నాయి.

మన ఎన్నికల ప్రజాస్వామ్యంలో ప్రతి సమస్యకూ సుప్రీం కోర్టు తీర్పు ఒక మందుబిళ్లలాగా పనిచేసి నయం చేస్తుందని మనం పొంగిపోవద్దు. కానీ కమిషన్ ఎంపికకు సంబంధించి తిరుగులేని విధానాన్ని సవరించడం ద్వారా న్యాయస్థానం ఈ ప్రక్రియకు పవిత్రతను ఆపాదించింది.

వ్యాసకర్త పిటిషనర్లకు మద్దతుగా ఈ కేసులో సుప్రీంకోర్టులో వాదించిన న్యాయవాది

సుప్రీం జోక్యమేల?

ఎన్నికల కమిషన్ ఎంపిక ప్యానెల్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉండాలని చెప్పడం సరైంది కాదు. దీన్ని ప్రభుత్వ, ప్రతిపక్ష భాగస్వామ్యం ఉన్న ఎన్నిక ప్రక్రియకు వదిలివేయడమే ఉత్తమం. అలాంటి నియామకాలు, ఎన్నికల పిటిషన్లపై వివాదాలు మళ్లీ చీఫ్ జస్టిస్ ముందుకే వెళతాయి. ఆయనే వాటిపై ధర్మాసనాల్ని ఏర్పాటుచేయాలి గనక ఈసీ ఎంపిక ప్యానెల్‌లో చీఫ్ జస్టిస్ ఉండడం సరి కాదు.

మంచి ప్రభుత్వానికి హామీ ఇవ్వని పక్షంలో ప్రజాస్వామ్యం ప్రయోజనాలు ప్రతికూలంగా ఉంటాయని తత్త్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్ పేర్కొన్నారు. నిజానికి ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదు. అది కొన్ని రాజ్యాంగ విలువలను తప్పకుండా ఇముడ్చుకోవాలి, కాపాడాలి, భద్రపర్చాలి. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతపై ప్రజలు సందేహిస్తున్నప్పుడు, ప్రజాస్వామిక ఆచరణ పూర్తిగా అస్తవ్యస్తం అవుతుంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకంపై అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైంది. ప్రజాస్వామ్యం తప్పక ప్రోత్సహించవలసిన రాజ్యాంగ విలువలను ఈ తీర్పు ఎత్తి పట్టింది. అయితే, అలాంటి నియామకాలు, ఎన్నికల పిటిషన్లపై వివాదాలు మళ్లీ చీఫ్ జస్టిస్ ముందుకే వెళతాయి. ఆయనే వాటిపై ధర్మాసనాల్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అందుకే, ఈసీ ఎంపిక ప్యానెల్‌లో చీఫ్ జస్టిస్ ఉండడం సరైనది కాదు.

ఎన్నికల కమిషన్ నియామకాలకు సంబంధించి ఒక స్వాభావిక సమస్య ఉంది. ఎన్నుకోబడని రాజ్యాంగ అధికారులకు సంబంధించిన ఇతర కేటగిరీల్లాగా కాకుండా... ఈసీ, షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ నియామకం కోసం; విద్యార్హతలు, ఇతర అర్హతలు కానీ రాజ్యాంగం కానీ లేదా, ఏదైనా సంబంధిత శాసనం కానీ పేర్కొనలేదు. అర్హతలను, అనుభవాన్ని రాజ్యాంగంలో రాసి ఉంచకపోవడం వల్ల కేంద్ర ఎన్నికల కమిషన్‌లో ఎవరినైనా నియమించే విషయంలో రాష్ట్రపతికి సంపూర్ణ అధికారం దఖలు పడింది.

చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర కమిషనర్ల (సేవా షరతులు) చట్టం, 1991ని పార్లమెంటు ఆమోదించింది. ఈ చట్టం రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5)కి సంబంధించింది. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల సర్వీస్ నిబంధనలను క్రమబద్ధీకరిస్తూ ఒక చట్టం రూపొందించడం గురించి పార్లమెంటు యోచించింది. ఇప్పుడు సుప్రీంకోర్టు దీనిపై వ్యాఖ్యానిస్తూ, పార్లమెంటు ఒక చట్టం రూపొందించేంతవరకు ప్రధాన మంత్రి, భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన ఒక కమిటీ సిఫార్సుల మేరకు ఈ అధికారులను నియమించాలని పేర్కొంది.

పలు దేశాల్లో ఈసీ నియామకాల ప్రక్రియను న్యాయస్థానం పేర్కొంది కానీ అది ఈ విషయంపై మరీ అంత లోతుగా అధ్యయనం చేసినట్లు కనిపించదు. ఆస్ట్రేలియాలో ఫెడరల్ కోర్టులో సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జి నాయకత్వంలో ఎన్నికల కమిషన్ పనిచేస్తుంది. అతడిని ప్రతి ఏడేళ్లకోసారి గవర్నర్ జనరల్ నియమిస్తారు. కెనడాలో హౌస్ ఆఫ్ కామన్స్ తీర్మానం ద్వారా పదేళ్లపాటు చీఫ్ ఎలక్షన్ అధికారిని నియమిస్తారు. అమెరికాలో అధ్యక్షుడు నియ మిస్తారు కానీ సెనేట్ ఆరేళ్ల కాలానికి ఎన్నికల కమిషనర్లను నిర్ధారిస్తుంది. మనకు పొరుగునే ఉన్న పాకిస్తాన్‌లో సైతం సీఈసీ ఏడేళ్ల పదవిలో ఉంటారు.

సందర్భం



ఫైజాన్ ముస్తఫా

ప్రపంచవ్యాప్త వివేచన వెలుగులో, ముగ్గురు సభ్యులతో కూడిన ఎంపిక కమిటీని సిఫార్సు చేయడం సరైందే. అయితే అత్యున్నత స్థానాల కోసం అదేవిధమైన ఎంపిక కమిటీలను నియమించినప్పటికీ అవి పెద్దగా ఫలితాలను అందివ్వలేదు. పైగా రాజ్యాంగ ధర్మాసనం కోసం ఇలాంటి నియామకాలు, ఎన్నికల పిటిషన్ల గురించిన నిర్ణయాలు తీసుకోవడంలో చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకోవడం ఏమంత మెరుగైన ఐచ్ఛికం కాకపోవచ్చు. కాబట్టి కేంద్రప్రభుత్వం, ప్రతిపక్షం భాగ స్వామ్యం ఉన్న సెలక్షన్ ప్రక్రియకే అలాంటి నిర్ణయాలను వదిలిపెట్టడం ఉత్తమం.

మన సీఈసీలలో చాలామందికి ఆరేళ్ల పదవీకాలాన్ని ఇవ్వడాన్ని కూడా మనం పెద్దగా పట్టించుకోలేదు. 1950లో భారత ప్రప్రథమ చీఫ్ ఎలెక్షన్ కమిషనర్‌గా సుకుమార్ సేన్‌ని నెహ్రూ ప్రభుత్వం నియమించింది. ఆయన ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘ కాలం పదవిలో ఉన్నారు. ఆ తర్వాత సీఈసీల పదవీకాలం తగ్గిపోతూ వచ్చింది. వీఎస్ రమాదేవి 16 రోజులు మాత్రమే సీఈసీగా పనిచేశారు. ఆమె వారసుడు టీఎన్ శేషన్ మాత్రం ఆరేళ్ల పూర్తి కాలం సీఈసీగా గడిపారు.

మన రిపబ్లిక్ చరిత్రలో నాలుగు దశాబ్దాల పాటు సీఈసీలు మాత్రమే ఉండేవారు. టిఎన్ శేషన్ కేసులో తీర్పు తర్వాత భారత ఎన్నికల కమిషన్... చీఫ్ ఎలెక్షన్ కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లతో కూడిన టీమ్‌గా మారింది. 1996 డిసెంబర్ చివరలో శేషన్ పదవీకాలం ముగిసిపోవడంతో, ఎలెక్షన్ కమిషనర్లనే సీఈసీలుగా నియమించడం ప్రారంభమైంది.

ఆరేళ్ల పదవీకాలాన్ని కొనసాగించలేని వ్యక్తులను సీఈసీలుగా నియమించే పద్ధతి 1991 చట్టంలోని సెక్షన్ 4ను ఉల్లంఘించడమేనని జస్టిస్ జోసెఫ్ సరిగ్గానే చెప్పారు. ప్రభుత్వం గుర్తించిన నలుగురు వ్యక్తుల్లో ముగ్గురు అప్పటికే రిటైర్ అయ్యారు. ఇక 24 గంటలలోపే ఎలక్షన్ కమిషనర్‌గా ఎంపికైన అరుణ్ గోయెల్ నెల రోజులలోగా రిటైర్ కానున్నారు. అందుచేత, వీరిలో ఎవరూ ఆరేళ్ల కాలం ఈసీ బాధ్యతల్లో ఉండలేకపోయారు.

సీఈసీ పదవికి నియమితుడైన వ్యక్తికి ఆ పదవి బాధ్యతలు నిర్వహణకు సన్నద్ధమవడానికి తగిన సమయం తప్పక ఉండాలి, పైగా తన స్వాతంత్ర్యాన్ని తాను ప్రకటించుకోగలరు. నిర్దిష్ట పదవీకాలం అనేది నియమితుడైన వ్యక్తిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేయడమే కాకుండా సంస్కరణలను ప్రారంభించడానికి ప్రేరణ పొందుతాడనీ, మార్పులు తీసుకొస్తూ తనలోని అత్యుత్తమ సామర్థ్యాన్ని వెలికి తీయగలడనీ జస్టిస్ జోసెఫ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. స్వల్పకాలానికి పదవిలో ఉండే వ్యక్తిలో కమిషన్ లక్ష్యాలను పూర్తి చేయడానికి అవసరమైన ఆకాంక్షలు అడుగంటి పోతాయి.

తనకున్న స్వాతంత్ర్యాన్ని నిర్ధారించుకోవడానికే సంబంధిత అధికారిలో ఉండే శక్తి, ఇచ్ఛ కరిగిపోతాయి. సీఈసీకి, ఎలక్షన్ కమిషనర్లకు విడివిడిగా ఆరేళ్ల పదవీకాలం అనేది నియమంగా ఉండాలనీ, 65 సంవత్సరాలకు వారి పదవీ విరమణ అనేది ఒక మినహాయింపు మాత్రమేననీ న్యాయస్థానం పేర్కొంది. ఆరేళ్ల పూర్తి కాలం పనిచేయలేని వ్యక్తులను నియమించడం న్యాయవిధానాన్ని ఓడిస్తుందని జస్టిస్ జోసెఫ్ చెప్పారు.

ఆరేళ్ల పూర్తికాలం ఎన్నికల కమిషన్ అధికారులుగా వ్యవహరించే వ్యక్తులను మాత్రమే ప్రభుత్వం భవిష్యత్తులో నియమిస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త లా ప్రొఫెసర్, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ

కరణ్ సింగ్ (సీనియర్ మోస్ట్ లీడర్)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

లోకం మనల్ని పూర్తిగా పట్టించుకోవడం మానేసినప్పుడు లోకానికి మనం ఏదైనా కొత్తగా చేసి చూపించాలన్న తపన మన లోలోపల ఎందుకని అంత అర్థరహితంగా రేయింబవళ్లూ జ్వలిస్తూ ఉంటుంది?!

"ఇదిగో.. చాణక్యపురిలోని న్యాయ్‌మార్గ్‌లో ఉన్న 'మానస సరోవర్‌–3' లో నేనింకా జీవించే ఉన్నాను.." అని లోకానికి గుర్తు చేయడానికా? లేదంటే, లోకం మనల్ని నిర్దయగా పట్టించుకోవడం మానేయడం వల్ల కాలం మనకు సమకూర్చిన అమూల్యమైన సమయాన్ని అంతకంతా సద్వినియోగం చేసి, ఆ సద్వినియోగ ఫలాన్ని లోకానికంతటికీ ప్రదర్శనకు పెట్టాలన్న ప్రతీకార భావన మనల్ని కొద్దిపాటిగానైనా స్థిమితంగా ఉండనివ్వక పోవడం వల్లనా? కారణం ఏదైనా నేనొక పొరపాటైతే చేశాను!

తొంభై రెండేళ్ల వయసులో ఒక మనిషి పొరపాటు పని చేస్తే ఏమనుకోవాలి? ఏమైనా అనుకోవచ్చు. చూపు సన్నగిల్లిందని, మాట మెత్తబడిందని, వినికిడి మందగించిందనీ, ఆలోచన పలచనయ్యిందనీ.. ఏదైనా



అనుకోవచ్చు. కానీ ఇవన్నీ కూడా నాలో చక్కగా పనిచేస్తూ ఉన్నప్పటికీ నేనెందుకు పొరపాటు చేసినట్లు?!

తొంభై ఏళ్లు దాటిన వయసంటే.. నిరక్షరాస్యుడిని సైతం వేదవ్యాసుడిగా మార్చేసేటంతటి జీవితం! మరి ఇతిహాసాలను, ఉపనిషత్తులను అధ్యయనం చేసిన మనిషి ఇంకెంతలా మారి ఉండాలి! అసలు పొరపాటన్నదే చేయలేనంతగా కదా. కానీ నేను చేశాను. తొంభై రెండేళ్ల వయసుండీ; ఇతిహాసాలను, ఉపనిషత్తులను చదివి ఉండీ, పుస్తకం రాయడం అనే ఒక పెద్ద పొరపాటు చేశాను! పుస్తకం రాస్తున్నప్పుడు అనిపించ లేదు. పుస్తక ఆవిష్కరణప్పుడు అనిపించింది.. రాసి పొరపాటు చేశానని. ముండకోపనిషత్తుపై నేను రాసిన ఆ పుస్తకాన్ని ఆవిష్కరించింది గౌరవ భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్.

"ధన్‌ఖడ్‌జీ.. నేనొక పుస్తకాన్ని రాశాను. ఆ పుస్తకాన్ని మీరే ఆవిష్కరించాలి.." అని మొదట నేను ఫోన్ చేసి చెప్పినప్పుడు ధన్‌ఖడ్.. పుస్తకం పేరేమిటని అడగలేదు!

"ధన్‌ఖడ్‌జీ.. మీరు అనుమతిస్తే కనుక నా పుస్తకం పేరేమిటో కూడా మీకు ఇప్పుడే తెలియజేయాలని నేను ఆశపడుతున్నాను.." అన్నాను. అప్పుడైనా ఆయన "సరే, చెప్పండి.." అనలేదు!

ఉపరాష్ట్రపతి నివాస్‌లో పుస్తకావిష్కరణ జరిగింది. "పుస్తకం బాగుంది కరణ్‌జీ.. 'ముండకోపనిషత్తు' పైన కదా రాశారు.." అన్నారు ధన్‌ఖడ్.. పేజీలను తిరగేస్తూ.

ముండకోపనిషత్తులో కాంగ్రెస్ పార్టీ గురించి ఉండదు. రాహుల్‌గాంధీ అసలే ఉండరు. 'సత్యమేవ జయతే' అని మాత్రమే చెబుతుంది ముండకోపనిషత్తు.

కానీ ధన్‌ఖడ్ రాహుల్‌గాంధీ గురించి మాట్లాడారు! రాహుల్ లండన్ వెళ్లి ఇండియా పార్లమెంటును విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. "ఇప్పుడు కూడా నేను మౌనంగా ఉంటే రాజ్యాంగ విలువల్ని ఎవరు కాపాడతారు?" అని అడిగారు! "పార్లమెంటుకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ దుష్ప్రచారాన్ని ఎలా విస్మరించగలను?" అని అన్నారు.

నా పుస్తకావిష్కరణకు నేను ధన్‌ఖడ్‌ను ఎంచుకుంటే, రాహుల్‌పై మండిపడేందుకు ధన్‌ఖడ్ నా పుస్తకావిష్కరణను ఎంచుకున్నారా?! ఐనా పుస్తకం రాయడం అనే పొరపాటును నేనెందుకు చేసినట్లు!!

1967లో నేను కాంగ్రెస్‌లో చేరాను. ఇప్పుడూ కాంగ్రెస్‌లోనే ఉన్నాను. కానీ కాంగ్రెస్‌కు నేనేమీ కాను. వర్కింగ్ కమిటీలోనూ లేను. నన్నెవరూ ఏదీ అడగరు. ఏదీ నాకు చెప్పరు. పార్టీలో నేనిప్పుడు ఒక జీరో.

పార్టీ నన్ను పూర్తిగా పట్టించుకోవడం మానేసిందని చెప్పి పార్టీకి నేనేదైనా కొత్తగా చేసి చూపించాలని తపించడం వల్లనే పుస్తకం రాయడం అనే ఇంత పెద్ద పొరపాటు నా వల్ల జరిగి ఉంటుందా?!

కాలగర్భంలోకి మా ఇర్రంమంజిల్ కాలనీ

జ్ఞాపకం



హైమవతీ భీమన్న

అది 1966. నాకు ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం వచ్చిన రోజులు. 1956లో మా నాన్న కొత్తూరి సుబ్బయ్య దీక్షితులు మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చిన తరువాత మేం చాలా రోజులు కాచిగుడా లోనూ, మా నాన్న పోయాక మా అన్నకు కేటాయించబడిన మలక్‌పేట్ కాలనీలోని ప్రభుత్వ క్వార్టరులోనూ ఉన్నాం. నాకు ప్రభుత్వోద్యోగం వచ్చాక, ఇర్రం మంజిల్ కాలనీలో ప్రభుత్వ క్వార్టరు కోసం దరఖాస్తు చేసుకొంటే, ఇర్రం మంజిల్ ప్యాలస్ కొండల కింది ఒక క్వార్టర్ కేటాయించారు నాకు. కాలనీ గ్రౌండ్ కెదురుగా, వీధి కార్నర్‌లో ఉండి, వెనక ఆవరణలో ఒక కొండ ఉన్న అందమైన క్వార్టర్ అది. ఆ క్వార్టర్ నెంబర్ ఐ.సి. 85.

ఆ క్వార్టర్ మీద కన్ను పడిన కొందరు ఇతర ఉద్యోగులు, 'ఆ క్వార్టర్ తీసుకోకండి. అందులో కొండ మీద దయ్యం ఉంది' అని భయపెట్ట చూశారు. 'మరేం ఫర్వాలేదు లెండి. నేనే ఒక పెద్ద దయ్యాన్ని' అని దానిలో చేరిపోయాను.

మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న 1956లో ఆంధ్ర రాష్ట్రం అవతరించినప్పుడు మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు ప్రభుత్వ అనువాదశాఖ మొదటి డైరెక్టర్‌గా వచ్చారు. 1966లో నా పెళ్ళి బోయి భీమన్నతో జరిగాక, ఆయన నాతో పాటూ ఐ.సి.85 క్వార్టర్‌కు మకాం మార్చారు. అప్పటి నుంచి ఆయన 2005లో మరణించే వరకు, దాదాపు నలభై సంవత్సరాలు మా ఐ.సి.85 క్వార్టర్‌ది ఒక ఘన చరిత్ర.

ప్రభుత్వ క్వార్టర్ల కాలనీలన్నిటిలోనూ తలమానికం లాంటిది ఇర్రం మంజిల్ కాలనీ. హైదరాబాద్ నగరం నడిబొడ్డులో ఉండి, అన్ని వసతులతో సౌకర్యవంతంగా ఉన్న కాలనీ. క్వార్టర్లే కాకుండా, ఒక పెద్ద గ్రౌండ్, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఒక కమ్యూనిటీ హాలు, లైబ్రరీ, క్లబ్– ఇలా ఎన్నో వసతులు. ఒక పక్క పంజగుట్ట మార్కెట్ ఐతే, మరోపక్క చింతల్ బస్తీ, ఖైరతాబాదు. పక్కనే నిజామ్స్ ఆర్థోపెడిక్ హాస్పిటల్, అంటే ప్రస్తుత నిమ్స్. ఏ గేటెడ్ కమ్యూనిటీకీ తీసిపోని కాలనీ ఇది.

తర్వాత, కాలనీ స్థలంలో, స్కూల్ దగ్గర శాసన సభ్యుల క్వార్టర్లు కట్టారు. ఎందరో ప్రముఖులు ఈ క్వార్టర్లలో నివసించారు – తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు గారితో సహా! బోయి భీమన్న 1966 నుంచి 2005లో ఆయన మరణించే వరకు నలభై సంవత్సరాలు ఈ ఇంటిలోనే నివసించారు. ఈ ఇంటితో ఆయనకున్న అనుబంధం మాటలలో చెప్పలేనిది. ఇంటి ఆవరణలో ఆయన చాలా రకాల మొక్కలు నాటి, స్వయంగా సంరక్షించేవారు. ఇంటి వెనకాల పెద్ద కొండకు ఆనుకుని ఉన్న రావి చెట్టు, దాని పక్కనే మామిడి చెట్టు, కాంపౌండ్ వాల్ పొడుగునా ఆయన ఊరి నుంచి తెచ్చి నాటిన నాలుగు కొబ్బరి చెట్లు – వీటన్నిటినీ ఆయన పిల్లలతో సమానంగా సంరక్షించారు.

ఇవే కాకుండా ఎన్నో పళ్ళచెట్లు – జామ, బొప్పాయి, దానిమ్మ, సీతాఫలం, బాదం వంటి వాటితో పాటుగా



కొన్నిసార్లు, వెనక ఆవరణలో ద్రాక్ష, మొక్కజొన్న, చెరుకు కూడా వేశారు. ఇక, పూల చెట్ల సంగతి సరే సరి. బెంగళూరు నుంచి తెచ్చుకున్న మల్లె చెట్లు, చెంబేలీలు, గులాబీలు, కనకాంబరాలు, బంతులు, చేమంతులు, ఆస్టర్లు, డాలియాలు, ఎగ్జోరాలు, రకరకాల క్రోటన్లు– ఎన్నో. వీటన్నిటితో మా క్వార్టర్ ఒక సుందర ఉద్యానంలో పర్ణశాల లాగ ఉండేది. ఇక్కడ చాలా సినిమా షూటింగులు కూడా జరిగేవి.

ప్రతి రోజూ ఆయన మల్లెలు, చెంబేలీలు శివార్పణం, సరస్వత్యార్పణం అంటూ కోసి, శివుడికీ, సరస్వతికీ జంట మొగ్గలు అలంకరించి, మిగిలిన పూలను స్వయంగా మాల కట్టి మాకూ, ఇంటికి వచ్చిన మహిళామణులకూ ఇవ్వడం ఆ రోజుల్లో అక్కడి వారందరికీ సుపరిచితమైన నిత్యకృత్యం. ఇక వేసవి కాలంలో ఆయన మకాం మామిడి చెట్టు కిందే. నాకు ఆవకాయ కోసం మామిడికాయలు కొయ్యడంతో పాటూ, పండిన పళ్ళు చెట్టు నుంచి రాలిన వెంటనే తినేయడం ఇంకొక నిత్యకృత్యం. ప్రతిరోజూ సాయంత్రం ఆయన ఒక కర్ర పట్టుకుని, గేటు ముందు నుంచుంటే, ఆ దారిలో వచ్చి పోయే ప్రతి వాళ్ళూ ఆయనను పలకరిస్తూ పోవడం కాలనీ వారందరికీ ఒక సుపరిచిత దృశ్యం. వీటన్నిటి వర్ణన ఆయన 'కుక్క మొరుగుతూనే ఉంది' అనే కావ్యంలో కనిపిస్తుంది.

కాలనీలో అన్ని ఇళ్ళ వారికీ మధ్య మంచి మంచి స్నేహ సంబంధాలుండేవి. అక్క, అత్త, మామ లాంటి పిలుపులుండేవి. వంటకాలు ఇచ్చి పుచ్చుకోవడం, కలిసి షాపింగులూ, పండగల్లో కలిసి ముగ్గులూ వంటివన్నీ ఉండేవి. మా ఇంటి ముందు గ్రౌండ్‌లో అన్ని జాతీయ పండుగలతో పాటు, ప్రతి పండుగకూ ప్రత్యేక కార్యక్రమాలు కూడా చాలా వైభవంగా జరిగేవి. నేను ఇర్రం మంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా అధ్యాపకురాలిగా కొంతకాలం పని చేశాను. అక్కడ చదివిన ఎంతో మంది విద్యార్థులూ, విద్యార్థినులూ తర్వాత చాలా ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారు.

ఐ.సి. 85లోనే నలభై ఏళ్ల భీమన్న రచనా వ్యాసంగం కొనసాగింది. ఆయనకు చాలా అవార్డులు, సత్కారాలు, పద్మశ్రీ – పద్మభూషణ్ వంటి గౌరవాలు ఇక్కడే లభించాయి. ఈ నలభై సంవత్సరాల కాలంలో ఎంతో మంది సాహిత్య, కళ, రాజకీయ రంగాల ప్రముఖులు (గుర్రం జాషువా, మర్రి చెన్నారెడ్డి, సి. నారాయణ రెడ్డి, కాళోజీ నారాయణ రావు, ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రశేఖర రావు, ఇంకా ఎంతోమంది ప్రముఖులు) ఈ ఇంటిని సందర్శించారు. ఆయన వీలునామాలో కూడా తనకు ఎంతో ఇష్టమైన ఇర్రంమంజిల్ కాలనీ ఐ.సి. 85 క్వార్టర్‌ను తనకు కేటాయించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మరణం తరువాత 2017 వరకు కూడా మా కుటుంబం ఈ క్వార్టర్‌లోనే నివసించాం.


1970ల నుంచి 2000 దశకాల వరకూ పుట్టిన పిల్లలందరికీ ఒక మధురమైన జ్ఞాపకమైన మా ఇర్రం మంజిల్ కాలనీలోని క్వార్టర్లు క్రమేపీ శిథిలమవుతూ, నివాస యోగ్యంగా లేక పోవడం కారణంగా, ప్రస్తుతం ఈ కాలనీ నిమ్స్‌కు కేటాయించబడింది. సుదీర్ఘమైన, సుసంపన్నమైన భీమన్న రచనా వ్యాసాంగానికి గుర్తుగా నిలిచిన ఈ ఐ.సి. 85 క్వార్టర్ ఇప్పుడు కూల్చివేతలో ఉంది. భీమన్న స్వయంగా పాతి పోషించుకున్న, కొండకు ఆనుకొని యాభై యేళ్ళ పైబడి ఉన్న రావి చెట్టు, మామిడి చెట్టు, నాలుగు కొబ్బరి చెట్లు నిమ్స్ నిర్మాణంలో కనుమరుగు కాకుండా కాపాడుకోవడం సాధ్యమైతే ఎంత బాగుంటుంది!

వ్యాసకర్త కవయిత్రి, బోయి భీమన్న భార్య

నియంత్రణే మార్గం

ఒక వ్యక్తి తాను పొందిన విజ్ఞానంలో ఒక్క శాతం కూడా తనది కాదు. మొత్తం సమాజాన్నుండి నేర్చుకున్నదే! వేల వేల సంవత్సరాల అనుభవాలే ఆధునిక విజ్ఞానంగా మనకి కనిపిస్తుంది. అనిపిస్తుంది. పశువులు, పక్షులూ, క్రిములు, కీటకాలూ వాటి వాటి సమాజాల నుండి పొందేది ఏమీ ఉండదు. తమ తమ సహజాతయుతమైన జీవన విధానాలతోనే జీవిస్తాయి. అవి ఇతర జీవుల నుండి ప్రత్యేకంగా అంది పుచ్చుకునేదీ, తన అనుభవాన్ని జ్ఞానంగా మార్చుకునేదీ దాదాపు శూన్యం.

కానీ మనిషి అలా కాదు. అంది పుచ్చుకుంటాడు. దాన్ని సమన్వయం చేసుకుంటాడు. విజ్ఞానాన్ని పంచుతాడు. అంటే ఏక కాలంలో అటు పొందుతూ, ఇటు పంచుతూ ఉంటాడు. కానీ...



జ్యోతిర్మయం

మనిషి మనస్సు ఇక్కడే మాయ చేస్తుంది. మాయ పొరను కప్పేస్తుంది. ఈ పొర కప్పుకోగానే దానిలోంచి అహం అనేది పుట్టుకొస్తుంది. ఈ పొర కప్పుకోగానే 'నేను ఇతరుల నుండే పొందాను' అనే విషయం మరచిపోయి... 'నేను ఇతరులకు పంచుతున్నాను' అనేది మాత్రమే గమనంలో ఉండిపోతుంది. ఇదే 'అహం' అంటే! ఈ అహం వల్లే 'నేను', 'నాది', 'నాదే', 'నేనే' అనే భావం పెరిగిపోతుంది. ఈ అహాన్ని బ్రతికించడానికి 'కోరికల్ని ఆహారంగా వేయాలి. ఈ ఆకలి తీరనిది. తెగనిది.

అహం ముదిరిన వ్యక్తిని మనం 'తల ఎగరేస్తున్నాడు' అంటాం. ఈ తల ఎగరేయడాన్ని బుద్ధుడు ఎగరేసిన జెండాతో పోల్చాడు. 'అస్మిమానాన్ని' అంటే నేను అనే భావాన్ని వదులు కోవడం జెండాను దించడంతో సమానంగా చెప్పాడు.

'అస్మిమానం' పోవాలంటే కోర్కెల్ని నియంత్రించుకోవాలి. మనస్సుల్లోంచి కోరికల్ని తుంచేసుకోవాలి. ఎలా? చెట్టు కొమ్మల్ని నరికినట్లు నరికితే మరలా అవి చిగురిస్తాయి. చిలువలు పలువలు వేస్తాయి. ఇంకా ఎక్కువ శాఖలు వేస్తాయి. కోర్కెల్ని అణచుకున్నా అంతే! అణచుకున్న కోర్కెలు ఒక్కసారి అమాంతం విరుచుకు పడతాయి. వెర్రితలలు వేస్తాయి. వేయిస్తాయి. అందుకే బుద్ధుడు కోర్కెల్ని అణచుకోమని చెప్పలేదు. నిరోధించమన్నాడు. అంటే తిరిగి చిలువలు పలువలు వేయకుండా ఉండాలన్నాడు.

ఇతర చెట్ల కొమ్మల్ని కొట్టినా, తలల్ని కొట్టినా తిరిగి విస్తరిస్తాయి. కానీ... తాడి చెట్టు తల కొట్టివేస్తే తిరిగి కొమ్మలు వేయదు. బ్రతకదు. మనలోంచి కోర్కెల్ని కూడా అలాగే తెగతెంచుకోవాలి. అలాంటి వానికే ప్రజ్ఞ ఉదయిస్తుంది. దుఃఖం దూరమ వుతుంది!

– బొర్రా గోవర్ధన్

పాణిగ్రహణం.. దేశానికో సంప్రదాయం

వధువు మంగళసూత్రం ధరించడం భారతీయ సంప్రదాయం



భారతదేశంలో వివాహం అనేది ఓ పవిత్ర కార్యం. రెండు హృదయాలను ఆలుమగలుగా మలిచే మనోహర ఘట్టం. వధూవరులు జీవితాంతం కలిసికట్టుగా ముందుకు సాగుతామని ఒకరికొకరు హామీ ఇచ్చుకునే వివాహ సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా బలంగా ఉన్నాయి. వీటిలో కొన్ని పురాతనమైనవి కాగా.. మరికొన్ని ఆధునికమైనవి. కొన్ని తెగల్లో ఇప్పటికీ బహుభార్యత్వం కొనసాగుతోంది. కొన్ని తెగల్లో బహుభర్తృత్వం కూడా ఉంది. కొన్నిచోట్ల వివాహానికి ముందే కాపురం చేసి పిల్లల్ని కూడా కనడం.. ఆ తరువాత నచ్చితే పెళ్లి లేదంటే మరొకరితో సహజీవనం వంటి పద్ధతులూ ఉన్నాయి. కాగా.. విదేశాల్లో అమలులో ఉన్న కొన్ని వింత సంప్రదాయాలివీ...

- ఫ్రెంచ్ వివాహంలో వధూవరులకు 'బౌల్'లో పడేసిన ఆహారం
- స్కాట్లాండ్‌లో వధువులను కట్టేసి సాస్, చేపలు, గుడ్లు, పిండి పోసే ఆచారం
- చైనాలో వరుడు వధువును బాణంతో కొట్టడం తప్పనిసరి
- మారిషస్‌లో పెళ్లి కుదిరాక వధువు ఎంత బరువు పెరిగితే అంత ధనవంతులవుతారని నమ్మకం
- కెన్యాలో పెళ్లి రోజున వధువుకు గుండు చేసి గొర్రె కొవ్వుతో రుద్దే పద్ధతి
- స్వీడన్‌లో వరుడిని, వధువుని అబ్బాయిలు, అమ్మాయిలు ముద్దాడే అవకాశం
- ఆచారం ఏదైనా.. సంప్రదాయం ఎలా ఉన్నా బంధాన్ని దృఢంగా మార్చడమే వివాహాల లక్ష్యం

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు భారతీయ వివాహ సంప్రదాయాన్నీ, వివాహ వ్యవస్థను గౌరవిస్తుంటారు. అంత గొప్పది మన సంస్కృతి. అయితే జాతకాలను విశ్వసించే మన దేశంలో వధూవరులు పుట్టిన జాతకం (చార్ట్ మ్యాచింగ్) ఆధారంగా వివాహాలను నిశ్చయిస్తారు. వధువుకు కుజ దోషం ఉంటే.. భర్త చనిపోతాడనే నమ్మకం భారతదేశంలో ఉంది. దీనికి పరిహారంగా అమ్మాయికి చెట్టుతో పెళ్లి చేసి.. ఆ తరువాతే వరుడితో ముడిపెట్టడం ఆచారం. ఈ ప్రకారమే మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యారాయ్ అభిషేక్ బచ్చన్‌ను వివాహం చేసుకునే ముందు ఆమె మొదట ఒక చెట్టును వివాహం చేసుకుంది. ఒకవేళ వధువు 'మంగ్లిక్' అయితే శపించబడుతుందని నమ్ముతారు. కాగా.. వరుడి పాదరక్షల్ని దొంగిలించే (షూ గేమ్) విధానం భారతీయ వివాహ వేడుకల్లో ఒక సరదా. వధువు తరఫున యువతులు వరుడి పాదరక్షల్ని దొంగిలించడానికి ప్రయత్నిస్తారు. వరుడి సహచరులు వాటిని కాపాడతారు. ఒకవేళ వధువు సోదరీమణులు పాదరక్షల్ని దొంగిలించడంలో విజయం సాధిస్తే.. వాటిని తిరిగి పొందడానికి వరుడు డబ్బులివ్వాలి. భారతీయ వివాహాల్లో హెన్నాకు ప్రత్యేక స్థానం ఉంటుంది. వధువు చేతికి ఎర్రగా పండే హెన్నా ఆమె భర్త ప్రేమను, ఆప్యాయతను ప్రతిబింబిస్తుంది. భారతీయ పెళ్లి తంతులో జీలకర్ర, బెల్లం ఒకరి తలపై ఒకరు ఉంచుకోవడం.. వధువు మెడలో వరుడు తాళి కట్టడం అనే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.

తెల్లటి డ్రెస్‌తో..

జపాన్‌లో అయితే.. పెళ్లి రోజున పైనుంచి కింది వరకు వధువు తెల్లటి డ్రెస్ ధరిస్తుంది. మహిళలు తెల్లని కిమోనోస్ ధరించి.. మేకప్ వేసుకుని.. వైట్ హుడ్ ధరిస్తారు.



బరువు పెరిగితేనే..

పెళ్లికి ముందు అమ్మాయిలు స్లిమ్‌గా, ట్రిమ్‌గా కనిపించాలని రకరకాల ప్రయత్నాలు చేయడం సాధారణం. కానీ.. మారిషస్‌లో మాత్రం కొందరు బరువు తగ్గడానికి బదులుగా.. లావు పెరగాలి. వధువు ఎంత లావుగా కనిపిస్తే అంత ధనవంతులుగా కనిపిస్తారని నమ్ముతారు. అలాంటి వారినే వరుడు వరిస్తాడు.

ఫ్రెంచ్ పద్ధతి ఇలా..



ఫ్రెంచ్ దేశస్తుల్లో కొందరు వివాహ విందులో టాయిలెట్ బౌల్ నమూనా ఏర్పాటు చేస్తారు. బంధుమిత్రులు తాము తినగా మిగిలిన ఆహారాన్ని అందులో పడేస్తే.. వధూవరులు ఆ ఆహారాన్నే ఆల్కహాల్ కలుపుకుని విందు భోజనంగా తినాలి.

గుండుగీసి..

కెన్యా దేశస్తుల్లో కాబోయే భార్యను వరుడు ఎంచుకోవడానికి కొందరి కుటుంబ సభ్యులు అంగీకరించరు. అతని కుటుంబమే అన్ని నిర్ణయాలూ తీసుకుంటుంది. పెళ్లి రోజున వధువు జుట్టు పూర్తిగా తీసేసి గుండుగీసి, తలపై గొర్రె కొవ్వుతో రుద్దుతారు.

స్కాట్లాండ్‌లో ఇదీ పద్ధతి



కొత్తగా వివాహం చేసుకున్న స్కాటిష్ వధువులను బంధువులు కట్టేసే సంప్రదాయం కొందరు పాటిస్తారు. సాస్, చేపలు, గుడ్లు, పిండి మొదలైన వాటిని వారికి పూసి స్నానం చేయిస్తారు.

శుభ్రం చేయాలి మరి..

జర్మనీలో అయితే.. కొన్ని పెళ్లిళ్లలో స్నేహితులకు బ్యాచిలర్ పార్టీ ఏర్పాటు చేస్తారు. దీనికి హాజరైన వారు నేలపై పింగాణీ పాత్రల్లో ఉన్న వంటకాలను నాశనం చేసి ప్లేట్లు పగులగొడతారు. వధూవరులిద్దరూ కలిసి దానిని శుభ్రం చేయాలి.

నెలపాటు ఏడవాలి మరి



వధువును బాణంతో కొట్టడం చైనా వివాహ సంప్రదాయంలో ఒకటి. పెళ్లి కూతుర్ని కొట్టడానికి పెళ్లికొడుకు మూడుసార్లు బాణాలను ప్రయోగిస్తాడు. పెళ్లిలో కాకున్నా వరుడు జీవితకాలంలో ఒకసారి వధువును ఇలా కొట్టవచ్చు. మరో ఆచారం ఇక్కడ ఉంది. పెళ్లి కుదిరిన తరువాత వధువు ఒక నెల పాటు క్రమం తప్పకుండా రోజూ ఓ గంటపాటు ఏడవాలి. మూడు వారాల ముందు ఆమె తల్లి, వారం గ్యాప్‌లో సోదరి, అమ్మమ్మ ఏడుపు మొదలు పెడతారు.

వధువును విడిపించాలి

రొమేనియాలో కొన్ని వివాహాల్లో వధువును స్నేహితులు, కుటుంబ సభ్యులు దాచడానికి ప్లాన్ చేస్తారు. భర్తను బెదిరించడానికి.. వధువును విడిపించడానికి డబ్బు డిమాండ్ చేస్తారు. వరుడు ఆ మొత్తం చెల్లిస్తాడు.

'టై' ముక్కల వేలం

స్పానిష్ వివాహ రిసెప్షన్ పార్టీలో వరుడి టైని ముక్కలుగా కోయడం కొందరు సంప్రదాయంగా పాటిస్తారు. ఆ ముక్కలను వేలం వేస్తారు. వాటిని పాడుకున్న వ్యక్తి ఆ క్షణం నుంచి అదృష్టవంతుడవుతాడని భావిస్తారు.

ముద్దాడాలి మరి

స్వీడన్‌లో కొన్ని పెళ్లిళ్లలో వధువు గది నుంచి బయటకు వచ్చిన వెంటనే వరుడిని ముద్దాడటానికి ఒంటరి మహిళలు క్యూలో ఉంటారు. వరుడు గదిని వధువు విడిచిపెట్టినప్పుడు యువకులు ముద్దాడుతారు.

స్నేహితురాలిని అలా చూస్తూ..!

- 80 ఏళ్ల వృద్ధురాలి మృతి



మునెమ్మ (ఫైల్)



పాపమ్మ(ఫైల్)

తిరుపతి రూరల్: కుటుంబ బంధాలతోపాటు వారి మధ్య స్నేహం పెరిగింది. అలా 64 ఏళ్లపాటు తమ స్నేహబంధాన్ని కొనసాగించారు. అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితురాలిని కడచూపు చూసేందుకు వచ్చింది. నిర్జీవంగా మారిన స్నేహితురాలిని తదేకంగా చూస్తూ.. తానూ తుది శ్వాస విడిచింది. 'స్నేహం కోసం..' సినిమాలో క్లైమాక్స్ సన్నివేశాన్ని తలపించిన ఈ ఘటన తిరుపతి మండలం మల్లంగుంటలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... మల్లంగుంటకు చెందిన దివంగత కంబాల గంగయ్య భార్య కంబాల మునెమ్మ(80), అదే గ్రామానికి చెందిన అంజూరి పాపమ్మ (80) వరుసకు అక్కచెల్లెళ్లు. అంతకుమించి 64 ఏళ్లుగా మంచి స్నేహితులు. పిల్లల చదువుల నుంచి వారి పెళ్లిళ్లు, మనవళ్ల యోగక్షేమాల వరకు ఇరువురూ మాట్లాడుకునేవారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కంబాల మునెమ్మ ఈ నెల 9న రాత్రి మృతి చెందింది. ఆమె కుమారుడు అమెరికాలో ఉండటంతో శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్న అంజూరి పాపమ్మకు మునెమ్మ చనిపోయిన విషయం చెప్పకుండా కుటుంబ సభ్యులు దాచారు. చివరి నిమిషంలో తెలుసుకున్న పాపమ్మ అనారోగ్యంతో ఉన్నప్పటికీ స్నేహితురాలు మునెమ్మను కడచూపు చూసేందుకు శనివారం సాయంత్రం వచ్చింది. స్నేహితురాలిని ఫ్రీజర్ బాక్స్‌లో అచేతన స్థితిలో చూస్తూ పాపమ్మ కుప్పకూలి అక్కడే ప్రాణాలు వదిలింది. మునెమ్మ అంత్యక్రియలను శనివారమే ముగించగా.. పాపమ్మకు ఆదివారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచిన మునెమ్మ, పాపమ్మ స్నేహంపై గ్రామంలో అందరూ చర్చించుకుంటున్నారు.

చంద్రబాబును సీబీఐ, ఈడీ విచారించాలి

895వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: దేశంలో అవినీతి, అక్రమాల పేరుతో ప్రముఖులను విచారిస్తున్న సీబీఐ, ఈడీ.. అవినీతి మరకలతో 29 కేసుల్లో స్టేలు తెచ్చుకుని తిరుగుతున్న టీడీపీ అధినేత చంద్రబాబును కూడా తక్షణమే విచారించాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 895వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. రాజధాని పేరుతో రూ. 3.50 లక్షల కోట్లు దోపిడీ చేసిన బాబు.. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ రాష్ట్రంలో కులవాద రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి బహుజనులను అణగదొక్కుతున్నాడని మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రెండెకరాల భూమితో రాజకీయాల్లోకి వచ్చి రూ.లక్షల కోట్లు దోచిన బాబును అరెస్టు చేసి జైల్లో పెట్టినప్పుడే ప్రజలు సీబీఐ ఈడీలను నమ్ముతారన్నారు.

అమెరికా వెళ్లిన ఏడు నెలలకే..

- తెలుగు విద్యార్థి అనుమానాస్పద మృతి
- స్వగ్రామమైన బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాళి చేరిన మృతదేహం



అరుణ్‌కుమార్(ఫైల్)

మార్టూరు: ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన ఓ తెలుగు విద్యార్థి ఏడు నెలలకే అనుమానాస్పదస్థితిలో అర్ధంతరంగా తనువు చాలించాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా మార్టూరు మండలం జొన్నతాళి గ్రామానికి చెందిన గోవాడ రమేష్ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు గోవాడ నాగసాయిగోపి అరుణ్ కుమార్ (22) ఇంజినీరింగ్ పూర్తి చేసి ఎంఎస్ చదవడం కోసం గతేడాది ఆగస్టులో అమెరికా వెళ్లాడు. లాంనార్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతూ టెక్స్‌పోర్టన్ ఏరియాలో ఐదుగురు స్నేహితులతో కలిసి నివాసం ఉంటుండగా, వారితో ఒక యువతి కూడా ఉంటోంది. ఈ క్రమంలో మార్చి 1న అరుణ్ కుమార్ స్నేహితులకు కనిపించకుండా పోవడంతో గదిలోని స్నేహితురాలి ఫిర్యాదు మేరకు అమెరికా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు మార్చి 3వ తేదీన అరుణ్‌కుమార్ మృతదేహాన్ని వారి నివాసానికి సమీపంలో ఓ నీటి సరస్సులో గుర్తించి స్నేహితులకు, ఇండియాలోని తండ్రి రమేష్‌కు సమాచారం అందించారు. శవపరీక్ష అనంతరం అరుణ్‌కుమార్ మృతదేహాన్ని అతని స్నేహితులు స్వంత ఖర్చులతో ఇండియా పంపగా.. శనివారం మధ్యాహ్నం స్వగ్రామం జొన్నతాళి చేరింది. పోస్టుమార్టం నివేదిక వస్తేనే కానీ అరుణ్‌కుమార్ మృతికి కారణం తెలియదని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి తమ కుటుంబాన్ని ఆదుకుంటాడని ఆశించి అమెరికా పంపిస్తే శవమై తిరిగి వస్తాడని ఊహించలేదంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు వర్ణనాతీతం. సాయంత్రం గ్రామంలో అరుణ్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు.


మహానది– గోదావరి అనుసంధానానికి చిక్కులు

- మహానది జలాలపై ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల మధ్య వివాదం
- దాని పరిష్కారానికి 2018లో ట్రిబ్యునల్ ఏర్పాటు
- ఇప్పటికీ కేంద్రానికి తుది నివేదిక ఇవ్వని ట్రిబ్యునల్
- ఈ నేపథ్యంలో అనుసంధానం చేపడితే న్యాయపరమైన ఇబ్బందులు
- న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ నిర్ణయం

సాక్షి, అమరావతి: మహానది–గోదావరి అనుసంధానానికి ప్రతిపాదన దశలోనే న్యాయపరమైన చిక్కులు ఉత్పన్నమయ్యాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల మధ్య మహానది జలాల వినియోగంలో వివాదాన్ని పరిష్కరించడానికి కేంద్రం ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ ఇప్పటిదాకా తుది నివేదిక ఇవ్వలేదు. మహానది జలాల వినియోగం వివాదంపై ట్రిబ్యునల్ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకున్నాకే మహానది–గోదావరి అనుసంధానంపై ముందుకెళ్లాలని సోమవారం నిర్వహించిన 17వ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ నిర్ణయం తీసుకుంది.

ఇదీ ప్రతిపాదన

ఒడిశాలో బర్ముర్ నుంచి 408 టీఎంసీల మహానది జలాలను గోదావరికి మళ్లించేలా జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ప్రతిపాదించింది. ఇందులో 178 టీఎంసీలను ఒడిశా చేపట్టిన ఐదు ప్రాజెక్టులకు కేటాయించింది. మిగతా 230 టీఎంసీలను ధవళేశ్వరం బ్యారేజీకి ఎగువన గోదావరిలోకి తరలించి, వాటిని



గోదావరి–కావేరి అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు సరఫరా చేయాలని పేర్కొంది.

తెగని మహానది జలాల వివాదం

ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల మధ్య మహానది జలాలపై తలెత్తిన వివాదం పరిష్కారానికి 2018లో కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. విచారణ జరిపి, నివేదిక ఇవ్వడానికి మూడేళ్ల గడువిచ్చింది. గడువులోగా విచారణ పూర్తి చేయలేదు. దాంతో 2021 మార్చి 11న గడువును మరో రెండేళ్లు పెంచింది. ఈ గడువు కూడా శుక్రవారంతో ముగిసింది. ఇప్పటికీ ట్రిబ్యునల్ కేంద్రానికి తుది నివేదిక ఇవ్వలేదు.

మహానది టు కావేరి వయా గోదావరి

జూన్ నుంచి అక్టోబర్ మధ్య 143 రోజుల్లో ఇచ్చంపల్లి నుంచి 247 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా(నాగార్జునసాగర్), పెన్నా (సోమశిల), కావేరి (గ్రాండ్ ఆనకట్ట)కు తరలించడం ద్వారా గోదావరి–కావేరిలను అనుసంధానించేలా ఎన్‌డబ్ల్యూడీఏ 2021 ఏప్రిల్‌లో డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) తయారు చేసింది. గోదావరి నికర జలాల్లో మిగులు లేదని, శాస్త్రీయంగా అధ్యయనం చేసి, మిగులు తేల్చాకే గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలని ఏపీ, తెలంగాణ ఆదిలోనే స్పష్టం చేశాయి. దాంతో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీలను గోదావరి–కావేరి అనుసంధానంలో తరలించేలా డీపీఆర్‌ను ఎన్‌డబ్ల్యూడీఏ మార్పులు చేసింది. ఇటీవల జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో దీనిపై చర్చించారు. ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని గోదావరి జలాలకు.. 230 టీఎంసీల మహానది జలాలను జత చేయడం ద్వారా మహానది – గోదావరి – కావేరిలను అనుసంధానిస్తే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలలో దుర్భిక్ష ప్రాంతాల్లో సాగు, తాగు నీటి ఇబ్బందులను అధిగమించవచ్చునని ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదిస్తోంది.

ఏపీలో సోలార్ ప్రాజెక్టు పెడతాం

'సాక్షి'తో నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ ప్రసన్నకుమార్

సాక్షి ప్రతినిధి: ఇంధన రంగంలో రాష్ట్ర ప్రభుత్వ పాలసీ.. పరిశ్రమలను ప్రోత్సహించడంలో ఇక్కడి పాలకులు అనుసరిస్తున్న విధానాలు పారిశ్రామిక దిగ్గజాలను రాష్ట్రానికి రప్పిస్తున్నాయి. ఇప్పటికే ఈ రంగంలో రూ. 9,57,139 కోట్ల పెట్టుబడులతో 42 ప్రాజెక్టుల ద్వారా 1,80,918 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక సంస్థలు గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ వేదికగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ జాబితాలోకి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా (ఎన్ఎల్‌సీఐ) లిమిటెడ్ కూడా చేరింది. రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను స్థాపించడానికి ఈ సంస్థ ఆసక్తి కనబరుస్తోంది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఎన్ఎల్‌సీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) ప్రసన్నకుమార్ మోటుపల్లి విజయవాడ వచ్చారు. ఈ సందర్భంగా 'సాక్షి ప్రతినిధి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పునరుత్పాదక విద్యుత్‌కు ఏపీలో అవకాశాలు..

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి 'నైవేలీ' సిద్ధంగా ఉంది. పునరుత్పాదక శక్తి (రెన్యూవబుల్ ఎనర్జీ) విభాగంలో.. ముఖ్యంగా సౌర, పవన విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల స్థాపనకు ఏపీలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రానున్న నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా 6 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడమే మా కార్పొరేషన్ లక్ష్యం. ఇందుకు అనుకూలమైన



రాష్ట్రాలేమిటని చూసినప్పుడు మాకు మొదట ఏపీ కనిపించింది. దీంతో వెంటనే ప్రభుత్వానికి మేం ప్రతిపాదించాలని నిర్ణయించాం. అందులో భాగంగానే ఏపీ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌తో భేటీ అయ్యాం. రాష్ట్రంలో ఎన్ఎల్‌సీ విస్తరణ, పవర్ ప్రాజెక్టులు నెలకొల్పడానికి ఉన్న అవకాశాలపై చర్చించాం. ప్రభుత్వం వైపు నుంచి మాకు అత్యంత సానుకూల వాతావరణం కనిపించింది.

లిగ్నైట్ ద్వారా విద్యుదుత్పత్తి..

లిగ్నైట్ (గోధుమ బొగ్గు) ద్వారా విద్యుదుత్పత్తి చేయడం మా కార్పొరేషన్ ప్రత్యేకత. తమిళనాడు, రాజస్థాన్, గుజరాత్‌లలో మాత్రమే ఈ బ్రౌన్ కోల్ అందుబాటులో ఉంది. ఎన్ఎల్‌సీఐ ద్వారా లిగ్నైట్ మైనింగ్ చేసి నైవేలీలోనే విద్యుదుత్పత్తి చేస్తాం. అలా ఉత్పత్తి అయిన విద్యుత్ 8 వేల మెగావాట్లు కాగా అందులో థర్మల్ పవర్ 6 వేల మెగావాట్లు ఉంటుంది. ఇక దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలకి కార్పొరేషన్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌కి దాదాపు 310 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

ఏపీలో రూ.3 వేల కోట్ల పెట్టుబడితో..

దేశంలోనే తొలిసారిగా నైవేలీలో రూ.12 వేల కోట్లతో 1,320 మెగావాట్ల లిగ్నైట్ అల్ట్రా సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్‌ని ఏర్పాటుచేయబోతున్నాం. దీనికి సంబంధించి ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఒడిశా రాష్ట్రం తాలబిరలో రూ.22 వేల కోట్ల వ్యయంతో 3,200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ని నిర్మించబోతున్నాం. అన్నీ అనుకూలిస్తే ఏపీలో రూ.3 వేల కోట్లతో 500–1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నెలకొల్పడానికి సిద్ధంగా ఉన్నాం. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు నచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నాం. 2025 లోగా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించగలిగితే ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) చార్జీల నుంచి కూడా కేంద్రం ద్వారా మినహాయింపు లభిస్తుంది. ఈ ప్రాజెక్టువల్ల ప్రత్యక్షంగా 200 మందికి పరోక్షంగా 1000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. విద్యుత్ కూడా తక్కువ ధరకే దొరుకుతుంది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) లిమిటెడ్‌తో ఏపీ ఇప్పటికే 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ పొందడానికి ఒప్పందం చేసుకుంది. వారి ధర యూనిట్ రూ.2.49గా నిర్ణయించారు. మేం కూడా ఇంచుమించు అదే ధరకు సౌర విద్యుత్‌ను అందిస్తాం.

క్లుప్తంగా...

ఐదేళ్లప్పుడు నాన్నే నాపై లైంగిక దాడి చేశాడు

డీసీడబ్ల్యూ చీఫ్ స్వాతి మలివాల్



న్యూఢిల్లీ: చిన్నతనంలో తనపై కన్నతండ్రే లైంగిక దాడికి పాల్పడినట్లు ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ వెల్లడించారు. నాలుగో తరగతి వచ్చే వరకు ఇలా వేధింపులు కొనసాగాయని చెప్పారు. ఆ గాయమే మహిళా హక్కుల కోసం పోరాడేలా తనను మార్చి వేసిందని చెప్పారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'చిన్నతనంలో మా నాన్న నాపై లైంగిక దాడి చేశాడు. నన్ను విపరీతంగా కొట్టేవాడు. జుట్టుపట్టుకుని రక్తం వచ్చేలా గోడకేసి బాదేవాడు. నాలుగో తరగతికి వచ్చే వరకు ఈ వేధింపులు కొనసాగాయి. భయపడి మంచం కింద దాక్కునే దాన్ని. పెద్దయ్యాక మహిళలు, చిన్నారులను వేధించే ఇలాంటి వారికి ఎలా బుద్ధి చెప్పాలి, మహిళల హక్కుల సాధనకు ఎలా సాయపడాలి అని ఆలోచించేదాన్ని'అని అప్పటి అనుభవాలను స్వాతి మలివాల్ గుర్తుకు తెచ్చుకున్నారు. నటి, జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) సభ్యురాలు సుందర్ ఖుష్బూ కూడా చిన్న తనంలో తండ్రి లైంగికంగా వేధించినట్లు ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

ఇద్దరు అమెరికన్ ఇండియన్లకు... కీలక పదవులు

వాషింగ్టన్: మరో ఇద్దరు భారతీయ అమెరికన్లకు అధ్యక్షుడు జో బైడెన్ యంత్రాంగంలో కీలక పదవులు లభించాయి. ఫ్లెక్స్ సీఈఓ రేవతీ అద్వైతి, నేచురల్ రిసోర్సెస్ డిఫెన్స్ కౌన్సిల్ సీఈఓ మనీశ్ బప్నాలకు వర్తక విధానం, సంప్రదింపుల సలహా కమిటీలో చోటు కల్పించారు. అమెరికా వర్తక విధానాలు, పాలన, అమలు తదితరాలపై ఇది సలహాలు సూచనలు అందిస్తుంది. ''అద్వైతి పలు కంపెనీల్లో కీలక బాధ్యతలను అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వచ్చారు. వరుసగా నాలుగేళ్ల ఫార్చ్యూన్ అత్యంత శక్తిమంతులైన మహిళా వ్యాపారవేత్తల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆర్థికవేత్త అయిన బప్నాకు పలు సంస్థల్లో కీలక హోదాల్లో పని చేసిన విశేషానుభవముంది'' అని వైట్‌హౌస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

జకార్తా టూ నుసంతర

ఇండోనేసియా రాజధాని జకార్తా నుంచి తరలిపోతోంది. బోర్నియో ద్వీపంలో నుసంతర పేరిట కొత్త రాజధాని నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. దీన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని రేయింబవళ్లు పనులు కొనసాగిస్తోంది. ఈ కొత్త రాజధాని జకార్తాకు ఈశాన్యంగా 2 వేల కిలోమీటర్ల దూరంలో బోర్నియో ద్వీపంలో పచ్చని అటవీ ప్రాంతమైన కాలిమాంటన్‌లో కొలువుదీరనుంది. దీన్ని కాలుష్యరహిత, సతత హరిత నగరంగా రూపొందిస్తున్నారు. అయితే దీనిపై పర్యావరణవేత్తల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్త రాజధాని నిర్మాణంతో ఆ ప్రాంతంలో అటవీ సంపద తరిగిపోయి వన్యప్రాణులకు నిలువ నీడ లేకుండా పోతుందని, పర్యావరణంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని వారంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇండోనేసియాకు కొత్త రాజధాని
- యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు
- ఫారెస్ట్ సిటీ కాన్సెప్ట్‌తో కొత్త రాజధాని
- పర్యావరణప్రియుల ఆందోళన

జకార్తా ఇసుకవేస్తే రాలనంత జనాభాతో కిటకిటలాడుతోంది. రాజధానిలో కోటి మందికి పైగా జనాభా నివసిస్తారు. మెట్రోపాలిటన్ ప్రాంతాన్నీ కలిపితే 3 కోట్ల దాకా ఉంటారు. భరించలేని కాలుష్యం రాజధాని వాసుల్ని ఊపిరి పీల్చుకోనివ్వడం లేదు. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో జకార్తా అగ్ర భాగంలో ఉంటోంది. ఇక అత్యంత వేగంగా కుంగిపోతున్న నగరాల్లో ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. ప్రస్తుత అంచనాల ప్రకారం 2050 నాటికి జకార్తాలో మూడింట ఒక వంతు సముద్రంలో మునిగిపోతుంది. దీనికి తోడు ఇండోనేసియాకు భూకంపాల ముప్పు ఉండనే ఉంది. అన్నింటి కంటే రాజధాని మార్పుకు మరో ముఖ్య కారణం అడ్డూ అదుపు లేకుండా భూగర్భ జలాల వెలికితీయడం. దీనివల్ల వాతావరణంలో మార్పులు ఏర్పడి వరదలు ముంచెత్తుతున్నాయి. వరదల కారణంగా ఏటా 450 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లుతోంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని జకార్తా నుంచి బోర్నియోకు రాజధానిని మార్చేయాలని అధ్యక్షుడు జోకో విడొడొ గతేడాది ప్రకటించారు. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించారు.



జోరుగా సాగుతున్న రాజధాని నిర్మాణ పనులు

కొత్త రాజధాని ఎలా ఉంటుంది?


కొత్త రాజధాని నిర్మాణాన్ని అధ్యక్షుడు విడొడొ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఒక సుస్థిర నగరంలో అందరూ కొత్త జీవితాల్ని ప్రారంభించాలని ఆయన ఆశపడుతున్నారు. ఫారెస్ట్ సిటీ కాన్సెప్ట్‌తో హరిత నగరాన్ని నిర్మించనున్నారు. నగరంలో 65% ప్రాంతంలో ఉద్యానవనాలే ఉంటాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని స్మార్ట్ నగరంగా కూడా తీర్చిదిద్దనున్నారు. సౌర విద్యుత్, జల సంరక్షణ విధానాలు, వ్యర్థాల నిర్వహణ వంటివన్నీ కొత్త సాంకేతిక హంగులతో ఉంటాయి. ప్రస్తుతానికి ఐదు గిరిజన గ్రామాలను ఖాళీ చేయించి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఈ ఏడాది 184 ప్రభుత్వ భవనాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



పర్యావరణవేత్తలు ఏమంటున్నారు?

కొత్త నగర నిర్మాణ ప్రాంతం అరుదైన వృక్షజాలం, జంతుజాలానికి ఆలవాలం. ఇప్పుడు వాటి ఉనికి ప్రమాదంలో పడనుంది. నగర నిర్మాణానికి చెట్లను కూడా భారీగా కొట్టేస్తున్నారు. రాజధాని కోసం ఏకంగా 2,56,142 హెక్టార్ల అటవీ భూమిని సేకరిస్తున్నారు. ఇవన్నీ పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపేవే. పైగా ఈ అడవుల్లో దాదాపుగా 100 గిరిజన తెగలు నివాసం ఉంటున్నాయి. వారందరికీ పునరావాసం, నష్టపరిహారం ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అన్నీ సరిగ్గా అమలయ్యే అవకాశం లేదన్న ఆందోళనలున్నాయి.

> కొత్త రాజధాని నుసంతరను అటవీ నగరం కాన్సెప్ట్‌తో ప్రణాళికాబద్ధంగా కడుతున్నాం. 65% ప్రాంతం పచ్చదనానికే కేటాయిస్తున్నాం. 2024 ఆగస్టు 17 స్వాతంత్ర్య దిన వేడుకలను కొత్త రాజధానిలో జరిపేలా సన్నాహాలు చేస్తున్నాం.
>
> – బాంబాంగ్ సుసాంటొనొ, నుసంతర నేషనల్ కేపిటల్ అథారిటీ చీఫ్



అధ్యక్ష భవనం నమూనా

కొత్త రాజధాని నిర్మాణ అంచనా వ్యయం:	3,200 కోట్ల డాలర్లు
రాజధాని నిర్మాణంలో ప్రైవేటు పెట్టుబడులు:	80%
ఈ ఏడాది నిర్మాణం జరుపుకునే భవనాలు:	184
ప్రస్తుతం నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికులు:	7 వేలు
తొలి దశలో తరలివెళ్లే ప్రజలు సంఖ్య:	15 లక్షలు
అధ్యక్ష భవనం నిర్మాణం పూర్తయ్యేది:	2024 ఆగస్టు 17 (దేశ స్వాతంత్ర్య దినోత్సవం)
రాజధాని నుసంతర నిర్మాణం పూర్తయ్యేది:	2045 ఆగస్టు 17 (దేశ వందో స్వాతంత్ర్య దినం)

గతంలో ఎన్నో దేశాలు పలు కారణాలతో రాజధానుల్ని మార్చాయి...

రాజధానిని మార్చిన దేశాలివే..!
- రాజధాని దేశానికి నడిబొడ్డున ఉండాలన్న కారణంతో బ్రెజిల్ 1960లో రియో డిజనిరో నుంచి బ్రెసీలియాకు మార్చింది.
- 1991లో నైజీరియా లాగోస్ నుంచి అబూజాకు రాజధానిని మార్చుకుంది.
- 1997లో కజకిస్తాన్ కూడా అల్మటి నుంచి నూర్–సుల్తాన్‌కు రాజధానిని మార్చింది. కానీ ఇప్పటికీ అల్మటీయే వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది.
- మయన్మార్ రంగూన్ నుంచి రాజధానిని నేపిడాకు మార్చింది.

80 ఏళ్లు పైబడ్డ వారికి 'ఇంటి నుంచే ఓటు'

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో అమలు: ఈసీ



బెంగళూరు: 80 ఏళ్ల పై బడ్డ వారికి ఇంటినుంచే ఓటేసే అవకాశం కల్పిస్తున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో దీన్ని అమలు చేస్తున్నట్టు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ''80 ఏళ్లు దాటిన వారు కూడా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేయడాన్నే మేమూ ప్రోత్సహిస్తాం. అలా వెళ్లలేని వారికోసం తొలిసారిగా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తున్నాం'' అని తెలిపారు. ''ఇందుకోసం 'సక్షమ్' పేరిట మొబైల్‌యాప్ రూపొందించాం. అందులోకి వెళ్లి ఇంటి నుంచి ఓటేసే ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు. ఎన్నికల సిబ్బంది వారింటికి వెళ్తారు. వారిచ్చే ఫామ్ 12డి ద్వారా ఓటేయవచ్చు. మొత్తం ప్రక్రియను వీడియో తీస్తాం. గోప్యతకు ఎలాంటి భంగం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాం'' అని వివరించారు. అలాగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు, అఫిడవిట్లు ఆన్‌లైన్‌లోనే దాఖలు చేసేందుకు వీలుగా సువిధ పేరిట మరో మొబైల్ యాప్ రూపొందించినట్టు సీఈసీ వెల్లడించారు. సమావేశాలు, ర్యాలీలకు కూడా దీని ద్వారానే అనుమతి కోరవచ్చన్నారు. అభ్యర్థి గురించి ఓటర్లకు అవగాహన కోసం నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ) ఉద్యమం కూడా చేపట్టినట్టు చెప్పారు. ''నేరచరిత్ర ఉన్న వారిని అభ్యర్థిగా ఎంచుకునే పార్టీలు అందుకు కారణాలను తమ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా ఓటర్లకు తెలియజేయాల్సి ఉంటుంది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఇ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు'' అన్నారు. కర్నాటకలో ఎన్నికల తేదీని త్వరలో నిర్ణయిస్తామన్నారు.

3 గంటల ముందే లైట్లార్పితే...

గర్భిణుల్లో మధుమేహానికి చెక్



న్యూఢిల్లీ: గర్భిణులు పడుకోవడానికి కొద్ది గంటల ముందే ఇంట్లో లైట్లను పూర్తిగా ఆర్పేయడమో, బాగా తగ్గించడమో చేస్తే మధుమేహం ముప్పును నివారించవచ్చట. కంప్యూటర్, మొబైల్ స్క్రీన్ల వెలుతురు కూడా ఈ ఆర్పేయాల్సిన లైట్ల జాబితాలోకే వస్తుంది! అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ వర్సిటీ తాజా అధ్యయనం ఈ మేరకు తేల్చింది. నిద్రకు ముందు చాలాసేపు లైట్ల వెలుగులో గడిపితే గ్లూకోజ్ నియంత్రణపై ప్రభావం పడుతుందని అధ్యయనానికి సారథ్యం వహించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మింజీ కిమ్ తెలిపారు. ''741 మంది గర్భిణులపై చేసిన ప్రయోగంలో ఇది నిర్ధారణ అయింది. అందుకే వీలైతే గర్భధారణ సమయంలో కంప్యూటర్లు, మొబైల్, టీవీ వాడకానికి పూర్తిగా దూరంగా ఉండటం చాలా మంచిది. కుదరని పక్షంలో కనీసం వాటిని వీలైనంత డిమ్‌గా మార్చుకోవాలి'' అని సూచించారు. నిద్రకు ముందు లైట్ల వెలుగులో బాగా గడిపితే పొత్తికడుపు పెరగడం, అధిక రక్తపోటు వంటి సమస్యలకూ దారి తీస్తుందని కూడా హెచ్చరించారు!

వ్యాపారవేత్తలుగా వృత్తి పనివాళ్లు

అదే ప్రభుత్వ లక్ష్యం: మోదీ



న్యూఢిల్లీ: వృత్తి పనివాళ్లకు, చిన్న వ్యాపారాలకు మరింత తోడ్పాటు అందించాల్సిన అవసరముందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. బడ్జెట్ వెబినార్లలో చివరిదైన 'పీఎం విశ్వకర్మ కౌశల్ సమ్మాన్' పథకంపై ఆయన శనివారం మాట్లాడారు. గ్రామ స్థాయిలో ప్రతి వృత్తినీ విభాగాన్నీ బలోపేతం చేయడం దేశ ప్రగతి ప్రయాణానికి చాలా కీలకమన్నారు. ఇందుకోసం డెడ్‌లైన్లు పెట్టుకుని ఉద్యమ స్ఫూర్తితో పని చేయాల్సిన అవసరముందన్నారు. గొప్పవైన మన పురాతన సంప్రదాయాలను కాపాడటంతో పాటు చిన్న వ్యాపారాలను వాటిలో భాగస్వాములుగా ఉండే వృత్తి పనివాళ్లకు ఇతోధికంగా సాయం అందించడమే పీఎం విశ్వకర్మ సమ్మాన్ పథకం లక్ష్యమని చెప్పారు. సులభ రుణాలు, నైపుణ్య వృద్ధికి అవకాశాలు, సాంకేతిక, డిజిటల్ సాయం, బ్రాండ్ ప్రమోషన్, మార్కెటింగ్, ముడి సరుకు లభ్యత తదితరాల్లో వారికి ఈ పథకం అండగా నిలుస్తుందన్నారు. వృత్తి పనివాళ్లకు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు అన్ని అవకాశాలూ కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మార్చి 13 నుంచి పార్లమెంటు మలి దశ బడ్జెట్ సమావేశాలు మొదలవుతున్న నేపథ్యంలో మోదీ శనివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు.

మోదీ తల్లి స్మృతులపై మైక్రోసైట్

మోదీ మాతృమూర్తి హీరాబెన్ స్మృతుల సమాహారంగా 'మా' పేరిట మైక్రోసైట్ ఆయన అధికార వెబ్‌సైట్‌లో ప్రారంభమైంది. ఇటీవల మరణించిన ఆమెకు నివాళిగా దీన్ని తీర్చిదిద్దినట్టు అధికారులు తెలిపారు. ''బిడ్డలకు హీరాబెన్ నేర్పిన విలువలు తదితరాల విశేషాలు సైట్‌లో ఉంటాయి. హీరాబా జీవితం, ఫొటోలు, వీడియోలు, ఆమె వందో పుట్టినరోజు సందర్భంగా మోదీ రాసిన బ్లాగ్, ఆమె మృతిపై పలు దేశాధినేతల స్పందన, నివాళులు కూడా ఉంటాయి'' అని వివరించారు.

రూ.600 కోట్ల కుంభకోణం!

'లాండ్ ఫర్ జాబ్స్'పై ఈడీ
- లాలూ కుటుంబీకుల ఇళ్లలో నగలు, నగదు
- ఆధారాలు దొరికాయని వెల్లడి
- దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఆర్జేడీ చీఫ్, బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ కుటుంబసభ్యుల నివాసాల్లో శుక్రవారం జరిపిన సోదాల్లో దొరికిన నగలు, నగదు, వెల్లడైన పత్రాలను బట్టి నేర విస్తృతి రూ.600 కోట్లకు పైగానే ఉంటుందని ఈడీ తెలిపింది. లాలూ కుటుంబసభ్యుల ఇళ్లలో లెక్కల్లో చూపని రూ.కోటి నగదు, రూ.1.25 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ, బంగారం, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొంది. వీటితో పాటు, లాలూ కుటుంబసభ్యుల పేరిట ఉన్న సేల్ డీడ్స్, ఆస్తి పత్రాలు దితరాలను స్వాధీనం చేసుకున్నామని, వీటిని బట్టి నేర విస్తృతి రూ.600 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు శనివారం వెల్లడించింది. వీటిల్లో రూ.350 కోట్లు స్థిరాస్తులు కాగా, రూ.250 కోట్ల మేర బినామీదార్ల పేరిట లావాదేవీలు ఉన్నాయంది. తేజస్వీ యాదవ్ ఆస్తుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ఈడీ.. ఢిల్లీలోని న్యూఫ్రెండ్స్ కాలనీలోని ఏబీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న డి–1088 నాలుగంతస్తుల భవనం తేజస్వీదేనని తెలిపింది. ఈ కేసులో ఈ కంపెనీని 'లబ్ధిపొందిన సంస్థ'గా గుర్తించినట్లు వెల్లడించింది. మార్కెట్ విలువ ప్రకారం రూ.150 కోట్లకుపైగా విలువైన ఈ భవనాన్ని తేజస్వీ, ఆయన కుటుంబం కేవలం రూ.4 లక్షలకే పొందినట్లు ఈడీ ఆరోపించింది. ఇలాంటివే మరో నాలుగు ఆస్తులను గుర్తించామని తెలిపింది. రైల్వే జాబ్స్ ఫర్ లాండ్ కుంభకోణంపై తమ దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొంది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణల్లో భాగంగా లాలూ కుటుంబీకులు, వారి సంబంధీకులు రియల్ ఎస్టేట్ వంటి వివిధ రంగాల్లో వేర్వేరు ప్రాంతాల్లో పెట్టిన మరిన్ని పెట్టుబడులను కూడా వెలికితీస్తామని తెలిపింది. లాలూ ముగ్గురు కుమార్తెలు, కుమారుడు బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీయాదవ్‌కు చెందిన వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం ఈడీ అధికారులు సోదాలు జరిపిన విషయం తెలిసిందే.

సీబీఐ విచారణకు తేజస్వీ గైర్హాజరు

ఇదే కేసులో తేజస్వీ యాదవ్ శనివారం సీబీఐ విచారణకు హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాలు చూపుతూ విచారణకు మరో తేదీని నిర్ణయించాలని ఆయన కోరినట్లు అధికారులు తెలిపారు. సీబీఐ సమన్ల ప్రకారం ఈ నెల 4వ తేదీన జరగాల్సిన విచారణకూ తేజస్వీ డుమ్మా కొట్టారు. తేజస్వీ కోరిన విధంగా విచారణకు మరో తేదీని నిర్ణయించే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ ఆర్జేడీ చీఫ్, మాజీ సీఎం లాలూ యాదవ్, ఆయన భార్య మాజీ సీఎం రబ్రీదేవిని సీబీఐ ప్రశ్నించిన విషయం తెలిసిందే. లాలూ రైల్వే శాఖ మంత్రిగా ఉండగా కొందరు అభ్యర్థులకు ఉద్యోగాలిచ్చినందుకు ప్రతిఫలంగా ఉచితంగా లేక తక్కువ ధరకు భూములను పొందినట్లు సీబీఐ ఆరోపణలు చేస్తోంది. లాలూ కుటుంబం ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తోంది. జేడీయూ అగ్రనేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా తేజస్వీ వాదనను సమర్థించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ప్రయత్నమే సీబీఐ విచారణ అంటూ విమర్శించారు. అయితే, 2017లో నితీశ్..లాలూపై దర్యాప్తు సంస్థలు చేసిన అవినీతి ఆరోపణలను సమర్థిస్తూ మాట్లాడటం విశేషం.

పన్ను వసూళ్లు రూ.13..73 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.13.73 లక్షల కోట్లకు చేరాయి. ఇది పూర్తి ఆర్థిక సంవత్సరానికి సవరించిన లక్ష్యంలో 83.19 శాతానికి సమానమని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) శనివారం వెల్లడించింది. అలాగే అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 16.78 శాతం అధికంగా నమోదు కావడం విశేషం. సీబీడీటీ ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 10 నాటికి స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 22.58 శాతం అధికమై రూ.16.68 లక్షల కోట్లకు ఎగశాయి. ఇందులో రిఫండ్స్ వాటా రూ.2.95 లక్షల కోట్లుగా ఉంది. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రిఫండ్స్ 59.44 శాతం ఎక్కువగా ఉండడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వసూలైన నికర ప్రత్యక్ష పన్నులు మొత్తం బడ్జెట్ అంచనాల్లో 96.67 శాతానికి సమానం. వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లే వృద్ధిని నడిపించాయని సీబీడీటీ తెలిపింది. రిఫండ్స్ పోను నికరంగా కార్పొరేట్ ఇన్‌కం ట్యాక్స్ వసూళ్లు 13.62%, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌తో కలిపి పర్సనల్ ఇన్‌కం ట్యాక్స్ వసూళ్లు 20.06% వృద్ధి చెందాయి.

అడవిలోకి రెండు చీతాలు విడుదల

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో ఉన్న చీతాల్లో రెండింటిని అటవీ ప్రాంతంలోకి వదిలినట్లు అధికారులు వెల్లడించారు. 2022 సెప్టెంబర్‌లో ఇక్కడికి చేరుకున్న 8 చీతాలను మొదటగా ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్లలోకి, అనంతరం హంటింగ్ ఎన్‌క్లోజర్లలోకి తరలించారు. శనివారం మొదట మగ చీతా ఒబన్‌ను, కొన్ని గంటల తర్వాత ఆషా అనే ఆడ చీతాను అడవిలోకి వదిలామని ఫారెస్ట్స్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ జేఎస్ చౌహాన్ చెప్పారు. మిగిలిన వాటిని కూడా నిర్ణీత సమయాల్లో అడవిలోకి విడిచిపెడతామన్నారు. మొన్న ఫిబ్రవరిలో మరో 12 చీతాలను దక్షిణాఫ్రికా నుంచి ఇక్కడికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

సిక్కింలో మంచులో చిక్కిన 900 మంది యాత్రికులు

గ్యాంగ్‌టక్: సిక్కింలో పర్యాటకులు తీవ్రమైన మంచులో చిక్కుకున్నారు. నాథులా, టొంగో లేక్ నుంచి రాజధాని గ్యాంగ్‌టక్ వైపు శనివారం సాయంత్రం బయలుదేరిన 89 వాహనాలు దట్టమైన మంచులో చిక్కినట్టు అధికారులు చెప్పారు. వీటిలో సుమారు 900 మంది పర్యాటకులు ప్రయాణిస్తున్నారన్నారు. ఆర్మీ సాయంతో వీరిని సురక్షితంగా తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నారు. అడ్డంకులను తొలగిస్తుండటంతో ఇప్పటికే 15 వాహనాలు గ్యాంగ్‌టక్ వైపు బయలుదేరాయని చెప్పారు. కొందరు ప్రయాణికులను దగ్గరల్లోని క్యాంపులకు తీసుకెళ్తామని వెల్లడించారు.



కొత్త ఎయిర్‌ఫోర్స్‌వన్ నమూనా

నయా ఎయిర్‌ఫోర్స్‌వన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానం సరికొత్తగా, సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోనుంది. ఎయిర్‌ఫోర్స్‌వన్‌గా ప్రస్తుతం 747–200 రకం బోయింగ్‌లను వాడుతున్నారు. ఇవి 1989–1993 మధ్య అధ్యక్షునిగా చేసిన జార్జి హెచ్.డబ్ల్యూ.బుష్ హయాంవి. వీటి స్థానంలో ఆధునీకరించిన రెండు 747–800 రకం విమానాలను ఎయిర్‌ఫోర్స్‌వన్ కోసం బోయింగ్ సంస్థ సిద్ధం చేయనుంది. సరికొత్త హంగులతో తొలి విమానం 2027లో, రెండోది 2028కల్లా అందుతాయి. విమానం వెలుపలి భాగం రంగులను అలాగే ఉంచాలని తాజాగా నిర్ణయించారు. అయితే అధ్యక్షుడు బైడెన్ సూచన మేరకు ప్రస్తుత రాబిన్ ఎగ్ బ్లూ బదులుగా బ్లూ, వైట్ రంగులు వాడతారు. సకల సౌకర్యాలు, ప్రపంచంలోనే అత్యంత హెచ్చు భద్రతతో కూడిన ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానాలను బోయింగ్ సంస్థే తయారు చేస్తూ వస్తోంది. ప్రస్తుత విమానాలను మార్చి కొత్తవి తీసుకోవాలని ట్రంప్ హయాంలోనే నిర్ణయించారు. వాటికి రెడ్-వైట్-బ్లూ- రంగులు వేయాలని అప్పట్లో ట్రంప్ ఆదేశించారు. ఇది ఆయన వ్యక్తిగత విమానం డిజైనే! ఈ ముదురు రంగుల వాడకంతో ఖర్చు పెరగడంతోపాటు డెలివరీ ఆలస్యమవుతుందని బోయింగ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో రంగు మార్పు వద్దని బైడెన్ నిర్ణయించారు.

చైనా ప్రధానిగా కియాంగ్

నమ్మకస్తునికే బాధ్యతలిచ్చిన జిన్‌పింగ్



బీజింగ్: చైనా ప్రధానిగా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అత్యంత నమ్మకస్తుడైన లీ కియాంగ్ (63) నియమితులయ్యారు. పాలక చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) తీసుకున్న ఈ నిర్ణయానికి నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సు ఈ మేరకు లాంఛనంగా ఆమోదముద్ర వేసింది. లీ పేరును జిన్‌పింగ్ స్వయంగా ప్రతిపాదించారు. అయితే ఆయన ఎన్నిక ఏకగ్రీవం కాకపోవడం విశేషం! మొత్తం 2,936 మంది ఎన్‌పీసీ సభ్యుల్లో ముగ్గురు లీకి వ్యతిరేకంగా ఓటేయగా మరో 8 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. అనంతరం లీ నియామక ఉత్తర్వులపై జిన్‌పింగ్ సంతకం చేశారు. ఆ వెంటనే ప్రస్తుత ప్రధాని లీ కీ కియాంగ్ నుంచి లీ బాధ్యతలను స్వీకరించారు. ఒడిదుడుకులమయంగా ఉన్న చైనా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే గురుతర బాధ్యత ఆయన భుజస్కందాలపై ఉంది. అందుకు చేపట్టబోయే చర్యలను మార్చి 13న మీడియా సమావేశంలో వెల్లడిస్తారని భావిస్తున్నారు. లీకి వ్యాపారవేత్తల పక్షాన నిలుస్తారని పేరుంది. తాజా మాజీ ప్రధాని లీ కి కియాంగ్‌కు కొన్నేళ్లుగా జిన్‌పింగ్‌తో దూరం పెరుగుతూ వచ్చింది. ఒకప్పుడు అధ్యక్ష పీఠానికి పోటీదారుగా నిలిచిన ఆయన ప్రధానిగా తన అధికారాలకు జిన్‌పింగ్ పూర్తిగా కోత పెట్టడంపై అసంతృప్తిగా ఉన్నారు. పదవి నుంచి వైదొలగిన ఆయన రాజకీయాల నుంచి పూర్తిగా రిటైరవుతున్నారు.

24 కోట్ల ముస్లింలను చైనాకు పంపిస్తారా?

ఫరూక్ అబ్దుల్లా వివాదాస్పద వ్యాఖ్యలు

జమ్మూ: దేశాన్ని మత ప్రాతిపదికన విడదీయవద్దని నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా మోదీ ప్రభుత్వాన్ని కోరారు. ''దేశంలోని 24 కోట్ల ముస్లింలను ఏం చేయాలనుకుంటున్నారు? సముద్రంలోకి విసిరేస్తారా? లేక చైనాకు పంపిస్తారా?'' అని కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ సమానావకాశాలను పొందగలిగే రామరాజ్యం కావాలన్నారు. జమ్మూ కశ్మీర్‌లో తొందరగా ఎన్నికలు జరపాలని, రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ఈసీని కలిసి కోరాలని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు.

భారత్‌పై బిలావల్ ఆక్రోశం

ఐక్యరాజ్యసమితి: కశ్మీర్‌ను పాలస్తీనాతో పోలుస్తూ పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో మరోసారి నోరుపారేసుకున్నారు. ''రెండుచోట్లా పరిస్థితులు ఒక్కటే. రెండు సమస్యలనూ ఐరాస ఇప్పటికీ పరిష్కరించలేదు. కశ్మీర్‌ను ఐరాస ప్రధాన ఎజెండాలోకి తీసుకురాకుండా భారత్ పదేపదే అడ్డుపడుతోంది'' అంటూ వాపోయారు. భారత్‌ను గురించి మాట్లాడే క్రమంలో ఒకసారి మిత్రదేశం, మరోసారి పొరుగుదేశం అంటూ ఆయన తడబాటుకు గురయ్యారు.



ఇండోనేసియాలోని జావా సమీప ద్వీపంలో శనివారం మెరపీ అగ్నిపర్వతం బద్దలవడంతో బయటికొచ్చిన లావా, దుమ్ము, ధూళి

సాక్షి

విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం ׀ 12 ׀ మార్చి ׀ 2023



గవర్నర్‌తో 'హక్కుల' కమిషన్

పెదకాకాని: గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను మానవ హక్కుల కమిషన్ చైర్మన్ సీతారామ మూర్తి, సభ్యులు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రీనివాస రావు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.



ముగిసిన బ్రహ్మోత్సవాలు

గంపలగూడెం: మండలంలోని నెమలి గ్రామంలో వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా ముగిశాయి. ఈ ఉత్సవాలు ఆరు రోజులు కొనసాగాయి.

వటపత్రశాయి అలంకారంలో శ్రీవారు



మంగళగిరి: శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు వటపత్రశాయి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన మేళ్ల చెరువు సీతామహాలక్ష్మి వ్యవహరించారు.

న్యూస్‌రీల్

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యతోపాటు అన్ని రంగాల్లో బాలికలు రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సూచించారు. జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు పాఠశాల స్థాయిలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం కోరమండల్ బాలికల ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథి హారిక మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏటా అమ్మ ఒడి కింద రూ.15 వేలు విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసి చదువులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. కోరమండల్ సంస్థ 18 ఏళ్లుగా పలు జిల్లాల్లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3,500 ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం గతేడాది తొమ్మిదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 237 విద్యార్థినులకు రూ.15 లక్షల విలువైన నగదు పురస్కారాలను అందజేశారు. ఉత్తమ మహిళ రైతు అవార్డును తోట్లవల్లూరు మండలం పాముల్లంకకు చెందిన పాముల రాణికి అందజేసి సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయభారతి, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు జి.వి.సుబ్బారెడ్డి, హెచ్‌ఆర్ ఇన్‌చార్జి కొండిపర్తి సుధాకర్, రీజినల్ బిజినెస్ హెడ్ చక్రవర్తి, డీజీఎం సచ్చిదానంద రెడ్డి పాల్గొన్నారు.

రామాలయానికి ఎమ్మెల్యే రూ.4 లక్షల విరాళం



గన్నవరం: బాపులపాడు మండలం బొమ్ములూరులో శ్రీసీతారామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.4 లక్షలు నగదు విరాళం ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్ష, కన్వీనర్లు నక్కా గాంధీ, అవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ చేతుల మీదుగా విరాళాన్ని శనివారం ఆలయ కమిటీకి అందజేశారు. గన్నవరం ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, సర్పంచి కాటూరి విజయభాస్కర్, పీఏసీఎస్ అధ్యక్షుడు యర్రంశెట్టి రామాంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ గండేపూడి రాణి, ఎంపీటీసీ సభ్యులు శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. కానూరులోని గౌరీశంకర్ నగర్‌కు చెందిన సీహెచ్.అప్పారావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. గుడివాడ గౌరీశంకరపురానికి చెందిన వి.నాగేంద్ర సత్యసాయి లీల కుటుంబం వి.సత్య నాగ బ్రహ్మ శివ శంకరరావు పేరిట నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం సమర్పించింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. పాలక మండలి సభ్యుడు బుద్దా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తతే మందు

- నెల రోజులుగా నమోదవుతున్న హెచ్3ఎన్2 కేసులు
- ఐదు నుంచి వారం రోజుల్లో నయమవుతున్న వ్యాధి
- కొందరిలో పది రోజుల వరకూ జలుబు, దగ్గు లక్షణాలు
- తగు జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యులు
- చేతుల పరిశుభ్రత, మాస్కు ధరించడం ముఖ్యమని సూచన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వరం, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఒంటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి వారిలో కొందరికి పరీక్ష చేయగా హెచ్3 ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ సోకిందని నిర్ధారణ అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తంగా చేసింది. జ్వరం తగ్గకుండా మూడు రోజుల పాటు ఉన్న వారిని గుర్తించి హెచ్3ఎన్2 వైరస్ పరీక్ష చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాక వారం నుంచి పది రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరబాధితులను గుర్తించాలని ఆదేశాలు ఇచ్చింది. కొత్త ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ప్రాణాంతకం కాకపోయినా, ఎక్కువ రోజుల పాటు దాని దుష్ఫలితాలు ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

లక్షణాలు ఇవీ..

- ఎక్కువ మందికి గొంతునొప్పితో ప్రారంభమై జలుబు, జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.
- కొంత మందిలో చలి, వాంతులు, ముక్కు కారడం, అధిక తుమ్ములు వంటి లక్షణాలు ఉంటున్నాయి.
- జ్వరం మూడు నుంచి ఐదు రోజుల్లో తగ్గిపోతున్నా, దగ్గు మాత్రం రెండు నుంచి మూడు వారాల పాటు ఉంటుంది.
- చాలా అరుదుగా ఆయాసం వచ్చే అవకావం ఉంది.
- పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో దీని ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెపుతున్నారు.
- ఈ లక్షణాలతో ప్రభుత్వాస్పత్రి జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్ విభాగాలతో పాటు, ప్రైవేటు ఆస్పత్రులకు కూడా రోగులు వస్తున్నారు.

హెచ్3 ఎన్2పై ఆందోళన వద్దు

- హెచ్3 ఎన్2 వైరస్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు.
- ముక్కు నుంచి గొంతు మధ్యలోనే ఈ ఫ్లూ వైరస్ ప్రభావం చూపుతుంది.
- కరోనా వైరస్ లాగా ఊపిరితిత్తుల్లో చొచ్చుకు పోయే స్వభావం దీనికి లేదు.
- వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న అతి కొద్ది మందిలో ఊపిరితిత్తుల్లోకి వెళ్లి నిమోనియాకు దారి తీయొచ్చు.
- ఇప్పటి వరకూ నమోదైన కేసుల్లో రోగులను ఆస్పత్రిలో చేర్చాల్సిన అవసరం రాలేదు.
- వైద్యుల సిఫార్సు లేకుండా యాంటీబయోటిక్ మందులు వాడరాదు.

ముందు జాగ్రత్తలతో మేలు

- తరచూ చేతులను సబ్బుతో శుభ్రంచేసుకోవాలి.
- బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా మాస్కు ధరించాలి.
- జనం రద్దీగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేయి అడ్డం పెట్టుకోవాలి.
- తరచూ శుభ్రమైన నీటిని తాగాలి.
- జ్వరం, ఒంటి నొప్పులు ఉంటే పారాసెటమాల్ మాత్ర వేసుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయరాదు.

అప్రమత్తంగా ఉండాలి



ఏటా సీజన్ మారే సమయంలో జ్వరాలు వస్తుంటాయి. ఈ ఏడాది ఫ్లూ జ్వరాలు వస్తున్నాయి. కొందరికి రెండు వారాల పాటు దగ్గు ఉంటోంది. జలుబు, జ్వరం, గొంతునొప్పి వంటి లక్షణాలు ఉన్న వారు ఆందోళన చెందకుండా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే పరీక్ష చేసి మందులు ఇస్తారు. ఇప్పటి వరకూ సీరియస్ అయిన వారు ఎవరూ లేరు. ఓపీ సేవలతోనే హెచ్3ఎన్2 తగ్గిపోతోంది.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, ఎన్టీఆర్ జిల్లా

పిల్లల్లో లక్షణాలు



జలుబు, జ్వరం, దగ్గు వంటి లక్షణాలతో పిల్లలు ఎక్కువ మంది ఆస్పత్రులకు వస్తున్నారు. వారిలో కొందరికి పదిహేను రోజుల పాటు దగ్గు తగ్గడం లేదని చెపుతున్నారు. అంతే కాదు జ్వరం కూడా కొందరిలో ఐదు నుంచి ఆరు రోజులు ఉంటోంది. అయితే ఎవరికీ సీరియస్ అవడం, ప్రాణాపాయం లేదు. హెచ్3 ఎన్2 వైరస్ ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతున్నందున అప్రమత్తంగా ఉండాలి. ఆ లక్షణాలు ఉన్న పిల్లలను స్కూలుకు పంపకుండా ఉండటం మంచిది.

– డాక్టర్ ఎస్.ఎస్.విఠల్‌రావు, పిల్లల వైద్య నిపుణుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్, సిద్ధార్థ వైద్య కళాశాల

గ్రామాల్లో యోగా కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామాల్లో యోగా కేంద్రాలు, వాకింగ్ ట్రాక్‌లు, లాఫింగ్ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో ఆయన శనివారం గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు కల్పించిందన్నారు. పేదలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందించాలని లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజిషియన్ విధానాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.34 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 25,500 మంది రక్తపోటు, 24,500 మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. 6,200 మంది గర్భిణులు, 3,430 మంది బాలింతలను వైద్య పరీక్షలు చేసి 450 మందికి రక్తహీనత ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారని పేర్కొన్నారు. వ్యాయామం, యోగా చేయడం ద్వారా మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో యోగా కేంద్రాలు, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు మండల అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయవాడ కార్పొరేషన్‌లో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండటంతో ఎన్‌సీడీ సర్వే ఆలస్యమవుతోందని కలెక్టర్‌కు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. ఎన్‌సీడీ సర్వేను మునిసిపల్ అధికారులు, ఎంపీడీఓలు పర్యవేక్షించి ఎప్పటికప్పుడు నివేదికలను అందజేయాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాధవి, వైద్యాధికారులు నరసింహనాయక్, నవీన్, పద్మావతి, మోతీబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన తిరుపతమ్మ తిరునాళ్ల



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): గ్రామంలోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన్నతిరునాళ్ల మహోత్సవం శనివారం ఘనంగా ముగిసింది. భక్తులు స్థానిక మునేరులో స్నానాలు చేసి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకొని బోనాలు, మొక్కులు చెల్లించారు. ఐదు రోజుల పాటు కొనసాగిన ఈ తిరునాళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పర్యవేక్షణలో గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించారు. నందిగామ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీఐ నాగ మురళి పర్యవేక్షణలో ఎస్‌ఐ హరిప్రసాద్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

దిగుబడులు అధరహో



కంకిపాడు మండలం ప్రొద్దుటూరులో మినుము నూర్పిడి పనుల్లో కూలీలు



మినుములను జల్లెడ పడుతున్న కూలీలు

- రైతులకు లాభసాటిగా అపరాల సాగు
- ఏటేటా మద్దతు ధర పెంచుతున్న ప్రభుత్వం
- బహిరంగ మార్కెట్‌లో మద్దతుకు మించి ధర
- హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్న రైతులు

కంకిపాడు(పెనమలూరు): ఉమ్మడి కృష్ణా జిల్లాలో రబీలో సాగుచేసిన అపరాల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. మార్కెట్లు అ'ధర'హో అంటున్నాయి. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఏటా మద్దతు ధరను పెంచుతూ బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వ మద్దతు ధరకు మించి మార్కెట్‌లో రేటు పలుకుతోంది. అధిక దిగుబడులు, లాభసాటి ధరలతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సాగు ఇలా..

ఈ ఏడాది రబీ సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయంగా రైతులు అపరాల సాగు వైపు మొగ్గుచూపారు. పంట మార్పిడి ద్వారా కలిగే ప్రయోజనాలను వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయిలో ప్రచారం చేసింది. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌లో వరికి ప్రత్యామ్నాయంగా రైతులు మినుము, పెసర వంటి అపరాల పంటలను ప్రధానంగా సాగు చేశారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1.10 లక్షల హెక్టార్లలో మినుము, 4,018 హెక్టార్లలో పెసర సాగయింది. ఎన్టీఆర్ జిల్లాలో మినుము 157 హెక్టార్లు, పెసర 120 హెక్టార్లలో సాగు చేశారు. పంట కాలం పూర్తి కావటంతో రైతులు మినుము, పెసర తీత పనుల్లో నిమగ్నమయ్యారు. దాదాపు అన్ని గ్రామాల్లోనూ తీత పనులు తుదిదశకు చేరుకోగా, కుప్ప నూర్పిడి పనులు ఊపందుకుంటున్నాయి. అపరాల తీత పనులు, గాలి గూళ్లు వేయటం, కుప్పల ఏర్పాటు పనుల్లో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు.

ఆశాజనకంగా పంట దిగుబడులు

ఈ సీజన్‌లో అపరాల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో పంట దిగుబడులు గణనీయంగా పెరిగాయి. ఎకరాకు మినుము, పెసర సాగు, తీత, నూర్పిడి పనులు పూర్తయ్యే నాటికి రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకూ పెట్టుబడులు పెడుతున్నారు. ఏడు నుంచి తొమ్మిది క్వింటాళ్లకు పైగా దిగుబడులు లభిస్తున్నాయి. ఈ దఫా మినుములో ఎల్‌బీజీ 045, ఎల్‌బీజీ 09 విత్తన రకాలను రైతులు వ్యవసాయశాఖ నుంచి అందిన కిట్లను వినియోగించి సాగు చేశారు. ఈ విత్తనం సాగు చేసిన పొలాల్లో పది క్వింటాళ్ల వరకూ దిగుబడులు లభించాయి.

ఏటా పెరుగుతున్న మద్దతు ధర

రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏటా మద్దతు ధరలను పెంచుతోంది. 2020–21లో మినుము క్వింటా రూ.6 వేలు, పెసర రూ.7,196, 2021–22 సీజన్‌లో మినుము రూ.6300, పెసర రూ.7,275, 2022–23 సీజన్‌లో మినుము రూ.6,600, పెసర రూ.7,755 చొప్పున మద్దతు ధర ప్రకటించింది. గత సీజన్‌లో జిల్లాలోని ఉయ్యూరు తదితర మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి అపరాలను కొనుగోలు చేసి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవటంతో రైతులకు ఊరట లభించింది. ప్రస్తుతం పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. అంతేకాకుండా మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో మినుముకు హెచ్చు ధర లభిస్తోంది. ప్రస్తుతం క్వింటా ధర రూ.7 వేలు పలుకుతోంది. పెసర రూ.7,600 వరకు పలుకుతోంది. తమిళనాడు రాష్ట్రానికి అపరాలు ఎగుమతి అధికంగా జరుగుతోంది. అక్కడి వ్యాపారులతో స్థానిక వ్యాపారులు మధ్యవర్తిత్వం నడిపి అపరాలను ఎగుమతి చేస్తున్నారు. దీంతో మినుము ధర పెరుగుదలకు కారణమైంది. పంటకు డిమాండ్ పెరుగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధర బాగుంది



వాతావరణం అనుకూలించింది. తెగుళ్లు కూడా అంతంత మాత్రమే. మినుము పంట దిగుబడులు బాగున్నాయి. మార్కెట్‌లో మంచి ధరే పలుకుతోంది. వ్యవసాయశాఖ ఇచ్చిన కిట్లు ఎల్‌బీజీ 045, ఎల్‌బీజీ 09 రకాలను సాగు చేశాను. ఎకరాకు 8 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది.

– పటాకుల శ్రీనివాసరావు, రైతు, మంతెన, కంకిపాడు మండలం

ప్రత్యామ్నాయంతో లాభం



ఎప్పుడూ ఒకే విధమైన పంటలను సాగు చేయటం వల్ల దిగుబడులు ఆశించిన మేరకు రావు. పంట మార్పిడి విధానం అవలంబించాలి. రబీలో వరికి ప్రత్యామ్నాయంగా రైతులు అపరాలు, ఇతర పంటలను సాగు చేశారు. అపరాల దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. రైతులకు సాగు లాభదాయకంగా ఉంది.

– ఎస్.వై.వి.ఎస్.మనోహరరావు, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

విద్యార్థుల ఇష్టం మేరకే చదివించాలి



విజేతలతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ తదితరులు

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థుల ఇష్టాన్ని తల్లిదండ్రులు గుర్తించి వారికి ఇష్టమైన చదువులు చదివించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ సూచించారు. అప్పుడే విద్యార్థులు చదువుల్లో రాణిస్తారని పేర్కొన్నారు. ఎడ్యుకేషనల్ ఎపిఫని ఆధ్వర్యంలో జనవరి 31న నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ మెరిట్ టెస్ట్‌లో విజేతలైన విద్యార్థుల అభినందన సభ గవర్నర్‌పేట ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. శ్రద్ధతో చదివి నిజాయితీగా పరీక్షలను ఎలా రాయాలో ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్–2023 విద్యార్థులకు నేర్పిందన్నారు. పదో తరగతి విద్యార్థుల బాగా చదివి ఏప్రిల్‌లో జరిగే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు తమ విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ప్రభుత్వం ఒకవైపు నాణ్యమైన విద్యను అందిస్తూ, మరో వైపు పాఠశాలలను ఆధునికీకరించడం వల్లే ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ మెరిట్ టెస్ట్‌లో విద్యార్థులు రాణించారని పేర్కొన్నారు. ఎడ్యుకేషనల్ ఎపిఫని అధ్యక్షుడు డాక్టర్ తవనం వెంకట్రావు మాట్లాడుతూ.. తమ సంస్థ పదేళ్ల ప్రయాణం, లక్ష్యాల గురించి వివరించారు. ఆర్‌జేడీ వి.ఎస్.సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తే అన్ని విషయాల్లో ముందుంటారని, ఆత్మవిశ్వాసంతో విజయబావుటాలు ఎగురవేస్తారని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చేతుల మీదుగా విజేతలైన 49 మంది విద్యార్థులకు రూ.9 లక్షల నగదు బహుమతులు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, సంస్థ సభ్యుడు హేమచంద్, కోడ్ తంత్ర సంస్థ అధినేత టి.ఎస్.వి.రమణ, సీహెచ్.సుబ్రహ్మణ్యం, శివప్రసాద్, శ్రీకృష్ణ, నాగసురేష్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాలో నలుగురు ఎస్‌ఐల బదిలీ

కోనేరుసెంటర్ (మచిలీపట్నం): జిల్లాలో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ పి.జాషువా శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరవల్లి స్టేషన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న యు.ఎల్.సుబ్రహ్మణ్యంను హనుమాన్‌జంక్షన్ స్టేషన్‌కు, నందివాడ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం. చిరంజీవిని వీరవల్లి స్టేషన్‌కు, కృష్ణా జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న పి.శిరీషను నందివాడ స్టేషన్‌కు, అవనిగడ్డ స్టేషన్‌లో (అటాచ్‌మెంట్) పనిచేస్తున్న కె. శ్రీనివాసరావును మచిలీపట్నం స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీ అయిన వారంతా వెంటనే విధులకు హాజరుకావాలని ఆదేశించారు.

బావపై చాకుతో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భార్యను కాపురానికి పంపమని అడిగినందుకు బావపై బామమరిది చాకుతో దాడి చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గుణదల వెటర్నరీ కాలనీకి చెందిన వై.నాగేంద్రకు చిట్టినగర్‌కు చెందిన యువతితో వివాహం అయింది. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చాయి. తన భార్యను కాపురానికి పంపించాలని శనివారం నాగేంద్ర అత్తారింటికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో అత్త దుర్గ, మరిది వంశీదర్‌లు కలిసి నాగేంద్రపై దాడిచేయడంతో ఎడమ చేతికి గాయమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

రూ.5లక్షల విలువైన 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడుతున్న నిందితుడు కుంచనపల్లి గంగాధరరావును కృష్ణలంక పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు నుంచి రూ.5లక్షల విలువైన 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పీఎన్‌బీఎస్ సమీపంలో ఎక్కువగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సీపీ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ విశాల్ గున్ని సూచనలతో తన పర్యవేక్షణలో కృష్ణలంక పీఎస్ సీఐ ఎం.వి.దుర్గారావు, క్రైమ్ ఎస్‌ఐ కృష్ణబాబు సిబ్బందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున సమాచారం మేరకు స్క్యూబ్రిడ్జి వద్ద ఒక ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించి చోరీ కేసులో అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన సీఐ దుర్గారావు, ఎస్‌ఐ కృష్ణబాబు, సిబ్బందిని అభినందించారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న ఏసీపీ రవికిరణ్, పక్కన నిందితుడు గంగాధరరావు

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

6 కిలోల గంజాయి స్వాధీనం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను భవానీపురం పోలీసులు అరెస్ట్ చేశారు. భవానీపురం పోలీసు స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ హనుమంతరావు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన వల్లూరి నాగమణి, గొల్లపూడి మగ్గం పనులకు వచ్చిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన షేక్ అమిసూర్, కరిబుల్లా లష్కర్, అబ్బాసు మొండల్ అరెస్టు అయిన వారిలో ఉన్నారు. వారి వద్ద నుంచి 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అధికంగా డబ్బులు సంపాదించాలని తాడేపల్లికి చెందిన వల్లూరి నాగమణి గంజాయి వ్యాపారం చేస్తున్న తన పెద్ద కుమార్తె భర్త మహేష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి మగ్గం పనుల నిమిత్తం గొల్లపూడికి వచ్చిన బెంగాల్ యువకులకు విక్రయిస్తోంది. కొద్ది కాలానికి ఆ యువకులు ఆమెతో కలిసి గంజాయి విక్రయించడం ప్రారంభించారు. బయట నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న పొట్లాలు కట్టి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని ఎట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు నుంచి ఊర్మిళా నగర్ వెళ్లే దారిలోని ఖాళీ స్థలంలో నలుగురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు శనివారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. లా– ఆర్డర్ డెప్యూటీ కమిషనర్–2, వెస్ట్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో భవానీపురం ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి తనిఖీ చేశారు. అక్కడ గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇన్ స్పెక్టర్ ఎండి ఒమర్, ఎస్‌ఐలు రవీంద్ర, లాలం ప్రసాద్ పాల్గొన్నారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ హనుమంతరావు

పౌష్టికాహారం అందించాలి

● కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు చక్కటి పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. మాతా, శిశు సంక్షేమ అధికారులతో శనివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్, మునగ చెట్ల పెంపకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 1,475 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 93 వేల మంది చిన్నారులకు, 8,700 మంది గర్భిణులు, 10,300 మంది బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని పేర్కొన్నారు. చిన్నారులు, కిశోర బాలికలు, మహిళలలో రక్త హీనతను నివారించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్, న్యూట్రీ గార్డెన్, మునగ చెట్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 50 శాతం అంగన్‌వాడీలలో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, సీడీపీఓలు మంగమ్మ, టి.నాగమణి, భాగ్యరేఖ, లక్ష్మి భార్గవి, లలిత, కె. పుష్పలత, సత్యవతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు

● తండ్రికి తలకొరివి పెట్టిన తనయ
● అధికార లాంఛనాలతో అంత్యక్రియలు


మృతుడు చింతా రమేష్‌బాబు

ఉయ్యూరు: సీఐఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఉయ్యూరుకు చెందిన చింతా రమేష్‌బాబు (53) విశాఖపట్నం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో సీఐఎస్ఎఫ్ జవానుగా పనిచేస్తున్నారు. గుండెపోటుతో గురువారం కన్నుమూశారు. భౌతికకాయాన్ని శుక్రవారం రాత్రి స్వగ్రామమైన ఉయ్యూరుకు తరలించారు. శనివారం రమేష్‌బాబు భౌతికకాయానికి అధికార లాంఛనాలతో సీఐఎస్ఎఫ్ జవానులు అంత్యక్రియలు జరిపించారు. జవాను రమేష్‌బాబుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె శ్వేత, చిన్న కుమార్తె కీర్తి తండ్రికి అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి పర్యంతం అయ్యారు. హిందూ శ్మశానవాటికలో పెద్ద కుమార్తె శ్వేత తండ్రి భౌతికకాయానికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.


తండ్రికి కొరివి పెడుతున్న పెద్ద కుమార్తె శ్వేత

ఎడ్లపూటీ లాగుడు పోటీల విజేత అమృతలూరు

నెమలి(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రముఖ ఆలయంగా విరాజిల్లుతున్న గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన జూనియర్స్ విభాగం ఎడ్లపూటీ లాగుడు పోటీల శుక్రవారం రాత్రి కోలాహలంగా ముగిసింది. హోరాహోరీగా సాగిన పోటీలో మొత్తం 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి. 8 నిమిషాల వ్యవధిలో క్వింటాన్నర బరువుతో పూటీ లాగుడు పోటీల నిర్వహించారు. విజేతల వివరాలు కమిటీ సభ్యులు తెలిపారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడికి చెందిన ఆలా హరికృష్ణ యాదవ్ ఎడ్లు 2.176.3 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం, బాపట్ల మండలం పోతురాజువారిపాలెంకు చెందిన రైతు కావూరి వెంకటేశ్వరరెడ్డి ఎడ్లు 2.081.1 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, చల్లపల్లి మండలం కొత్త మాజేరుకు చెందిన రైతు తుమ్మల ఝాన్సీ ఎడ్లు 2.058.3 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, చీరాలకు చెందిన గుంజి హేమంత్ ఎడ్లు 2.044.4 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, పురిటిగడ్డకు చెందిన బీబీఆర్ ఎడ్లు 1.871.6 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. దాతల సహకారంతో విజేత ఎడ్ల యజమానులకు వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ. 12వేలు, రూ. 8వేలు, రూ. 5వేలను వైఎస్సార్ సీపీ నాయకులు కె.వినయ్‌కుమార్, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు వెంకటకృష్ణ కమిటీ సభ్యులు వెంకటకృష్ణ, వీరప్రసాద్ పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాగునీటి కష్టాలకు చెక్

- సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన వీఎంసీ
- రూ.2.21 కోట్ల కేటాయింపు
- శివారుప్రాంతాలు, కొండప్రాంతాలపై ప్రత్యేక దృష్టి


ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్న విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో వేసవిలో తలెత్తబోయే తాగునీటి సమస్యలకు చెక్‌పెడుతూ వీఎంసీ ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంది. నగరంలో తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే శివారుప్రాంతాలు, కొండప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గత వారం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. లీకేజీ సమస్యలు అధిగమించడం, వృథానీటిని అరికట్టేందుకు ఈ వేసవిలో అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించనున్నారు. నగరంలోని ప్రధాన నీటివనరులైన కృష్ణానది, భూగర్భ జలాల నుంచి ఎప్పటికప్పుడు భవానీపురంలోని హెడ్‌వాటర్‌వర్క్స్ నుంచి నీటి శుద్ధి అనంతరం కుళాయిలకు సరఫరా అవుతుంది. ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో గంటపాటు నీటిసరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం నగరంలో సగటున రోజుకు ఒక వ్యక్తికి 187.73 లీటర్లు అవసరం కాగా వీఎంసీ 151.25 లీటర్లు సరఫరా చేస్తోంది.

నగరంలోని మొత్తం రిజర్వాయర్లు

నగరంలోని మూడు సర్కిళ్లపరిధిలో 75వేల కిలోలీటర్ల కెపాసిటీ ఉన్న రిజర్వాయర్లు 70 ఉండగా, అందులో 47 ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లు(ఈఎల్ఎస్ఆర్) ఉన్నాయి. ఇంకా 23 గ్రౌండ్‌లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు(జీఎల్ఎస్ఆర్)లు ఉన్నాయి. ఆయా రిజయర్వాయర్ల ద్వారా 1,28,219 తాగునీటి కనెక్షన్లకు నీటి సరఫరా జరుగుతోంది.

వేసవి ప్రణాళిక

ట్యాంకర్లు సరఫరా చేసే ప్రాంతాలు

సర్కిల్-1 : మహంకాళమ్మగుడిరోడ్డులోని పాత ఆర్ఆర్‌పేట, మహంతిపురం, అంబేడ్కర్‌నగర్ పార్కు, జక్కంపూడి, భవానీపురం, కబేళా ఏరియాలు

సర్కిల్-2 ఏరియా : సుందరయ్యనగర్, రాధానగర్ కట్ట, వాంబేకాలనీ, ఆర్ఆర్‌పేట, సింగ్‌నగర్, కండ్రిక, గుణదలలో కొంతభాగం, మధురానగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, హనుమాన్‌పేట, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్ ఏరియా.

సర్కిల్-3 ఏరియా : ఆటోనగర జేడీనగర్, గమేశా పాకలు, మొగల్రాజపురం, క్రీస్తురాజపురం, కస్తూరిబాయిపేట, ఏరియాల్లో ఉదయం, సాయంత్రం గంటపాటు ట్యాంకర్లతో నీటి సరఫరా జరుగుతుంది.

కేటాయింపులు

నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని కొండప్రాంతాల్లో బూస్టర్ల మరమ్మతులు, తాగునీటి రవాణా, కొత్త చేతి బోరు బావులు, కొత్త పవర్ బోర్ వెల్స్ - కొత్త పంపు సెట్లు ఏర్పాట్లు, పంపు సెట్‌లకు మరమ్మతులు అందించడం, పంపిణీ పైపుల కోసం స్లూయిస్ వాల్వ్‌లు, జాయింట్లు, లీక్ ప్రూఫ్ మెటీరియల్స్ వంటి నిర్వహణ సామగ్రిని కొనుగోలు చేయడం కోసం వేసవి యాక్షన్ ప్లాన్ తయారు చేశారు.

చేతిపంపుల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీని అరికట్టేందుకు మొత్తం 35 పనులకు రూ.2.21 కోట్లు వెచ్చిస్తుండగా అందులో సర్కిల్-1 ఏరియాలో 11 పనులకు రూ.80లక్షలు, సర్కిల్-2 ఏరియలో 14 పనులకు రూ.64.39 లక్షలు, సర్కిల్-3 ఏరియాలో 10 పనులకు రూ.74.64 లక్షలు ఈ వేసవిలో ఖర్చు చేయనున్నారు.

తాగునీటి సరఫరాలో పకడ్బందీ చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ ఈ వేసవిలో తాగునీటి సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకుంది. ఇందుకు రూ.2.21 కోట్లు వేసవి ప్రణాళికకు వివిధ పనులకు ఖర్చు చేయనున్నాం. ప్రధానంగా సమస్యలు తలెత్తే శివారు ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నాం. నగరంలో ప్రస్తుతం 998 చేతిబోర్లు ఉన్నాయి. వాటిలో రిపేర్లకు గురైన వాటిని మరమ్మతులు చేపట్టాం.

– ఎం. ప్రభాకర్, సీఈ వీఎంసీ

నవరత్నాలతో పేదలకు ఆర్థిక లబ్ధి

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్


సమస్యలు తెలుసుకుంటున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలతో పేదలకు ఆర్థి లబ్ధి చేకూరిందని 18వ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. రాణిగారితోట, 18వ డివిజన్ 82 వార్డు సచివాలయాల పరిధిలోని తిమ్మన పోతురాజు వీధి, తారకరామనగర్‌లో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి 600 గడపలను సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పసుపురెడ్డి నీలకంఠం, బి.తిరుపతయ్య మాట్లాడుతూ తన కుటుంబానికి వైఎస్సార్ ఆసరా ద్వారా ఆర్థిక సాయం అందిందని పేర్కొన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అవినాష్ మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకు పాలనను చేరువ చేశారన్నారు. గతంలో మాదిరి లంచాలకు తావులేకుండా పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి రూ.వందల కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రామలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రానికి తలమానికంగా అంబేడ్కర్ స్మృతివనం పూర్తి చేస్తామన్నారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్‌గా నియమితులైన సుభానీ ఏర్పాటు చేసిన అభినందన సభలో అవినాష్ పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్



డ్రాప్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ కోరారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్, కియా మోటారు కంపెనీ, ఇండియా పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డెవలప్ రెస్పాన్సిబుల్ అవుట్‌లుక్ ఫర్ ప్లాస్టిక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కమిషనర్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ప్లాస్టిక్ వృథాను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. నగరంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్ కె. వెంకట సత్యవతి మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధి కౌషికా శరవణన్ మాట్లాడుతూ వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై వచ్చే 11 నెలల్లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లకు 200 వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రచారం ద్వారా ప్రజలలో అవగాహన పెంపొందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ జీ నాగార్జున, డాక్టర్ కె.రమేష్, ఎం. జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనులపండువగా స్వామి కల్యాణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు కోదండ రామాలయం సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం కోదండ రామాలయ కళావేదికపై స్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ఉదయం 9 గంటలకు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీ సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రామచంద్రస్వామి, శ్రీ భూనీళా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీ రుక్మిణి గోదా సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డీవీఎస్ రాజు, దాట్ల శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు పర్యవేక్షించారు.

పేద విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పేద విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలకు అవసరమైన ప్యాడ్, పెన్నులు, పెన్సిల్, జామెంట్రీబాక్సు, పౌచ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, ఇబ్రహీమ్ మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రహీమా, మల్లిక పాల్గొన్నారు.

'మతాల పేరుతో బీజేపీ రెచ్చగొడుతోంది'

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో మతాల పేరుతో బీజేపీ ప్రజలను రెచ్చగొడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. ప్రశ్నించే వారిపై దర్యాప్తు సంస్థలను ప్రేరేపిస్తుందని ఆయన ఆరోపించారు. విజయవాడలోని ఓ హోటల్లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని, జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయ పార్టీగా బీఆర్ఎస్ ఎదుగుతుందని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రాజకీయ నిరుద్యోగులు మాత్రమే బీజేపీలో చేరుతున్నారని, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

వ్యాధుల నియంత్రణ ఔషధాలపై సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ఫార్మసీ పరిశోధకుడు చంద్రతేజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మెదడు సంబంధిత వ్యాధుల నియంత్రణకు ఔషధాన్ని మెదడుకు చేరవేయు వివిధ మార్గాలపై అవగాహన కల్పించేందుకు శనివారం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాలలో సదస్సు జరిగింది. ఆ కళాశాల ఫార్మస్యూటిక్స్, బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో మెదడుకు ఔషధ పంపిణీ వ్యూహాలు అనే అంశంపై జరిగిన సదస్సులో పూణేలోని ఫార్మా కంపెనీ ల్యూపిన్‌లో అసోసియేట్ సైంటిస్ట్ డాక్టర్ ఉప్పులూరి చంద్రతేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషధాన్ని మెదడుకు చేరవేసేందుకు వివిధ మార్గాలను వివరిస్తూ, ముక్కు ద్వారా పీల్చే ఔషధాల వలన తక్కువ సైడ్‌ఎఫెక్ట్స్‌తో వ్యాధులను మెరుగ్గా నియంత్రించవచ్చన్నారు. వాటి తయారీ విధానాలను వివరించారు. ఆ కళాశాల ఫార్మస్యూటిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.రమణ మాట్లాడుతూ విద్యార్థులు చంద్రతేజను ఆదర్శంగా తీసుకుని ఫార్మారంగంలో నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇదే కళాశాలలో బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ చదివి ల్యూపిన్ వంటి దిగ్గజ కంపెనీలో పరిశోధకుడిగా ఎదిగిన చంద్రతేజను అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కిలారు నవీన్‌బాబు పాల్గొన్నారు.

మైనార్టీలకు గుర్తింపు ఇచ్చిన సీఎం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా


ఎమ్మెల్సీ రుహుల్లా, గౌస్ మొహిద్దీన్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీలకు గుర్తింపునిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఎంపికైన షేక్ గౌస్ మొహిద్దీన్ సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రుహుల్లాను శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గౌస్‌మొహిద్దీన్‌ను ఎమ్మెల్సీ రుహుల్లా, ముస్లిం మైనార్టీ నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే ఆయన తనయుడు జగనన్న మరో రెండు అడుగులు ముందుకేసి ముస్లింలకు అన్ని రంగాలలో అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. ముస్లిం మైనార్టీలందరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అన్ని వేళలా అండగా నిలుస్తారన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ జగనన్నను నమ్ముకున్న వారందరికీ అండగా నిలుస్తున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిలో 90 శాతం మందికి ఇప్పటికే అనేక పదవులను కేటాయించారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, చింతా శ్రీను, వైఎస్సార్ సేవాదళ్ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ షేక్ అమిత్ పాల్గొన్నారు.

108 కార్యాలయం ప్రారంభం


108 కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారితోట, 18వ డివిజన్‌లో సిమెంట్ గోడౌన్స్ సమీపంలో నూతనంగా నిర్మించిన 108 కార్యాలయాన్ని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తక్షణ వైద్య సాయం కోసం నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 108 సేవలను ప్రారంభించారని గుర్తుచేశారు. నేడు జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ 108 సేవలను మరింత విస్తృత పరచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఆరోగ్య శ్రీ, కొత్తగా విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడంపై ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

జోరుగా రోడ్డు అభివృద్ధి పనులు


పాయకాపురంలో రోడ్డు విస్తరణ పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పాయకాపురం వద్ద ప్రధాన రహదారి అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గత నెల 23వ తేదీన రాష్ట్ర హోమ్‌శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనితా, స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీతో కలిసి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కేవలం 10 రోజుల వ్యవధిలోనే అదే రోడ్డు అభివృద్ధి పనులు ఇంజినీర్ల పర్యవేక్షణలో వేగంగా జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు కోట్ల 90లక్షలతో పైపులరోడ్డు నుంచి కండ్రిక జంక్షన్ వరకు రోడ్డు వెడల్పుతో పాటు ఎండ్ టూ ఎండ్ పెవర్ బ్లాక్సు పనులు చేస్తున్నట్లు వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాస్ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ నేరాలపై అవగాహన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్ఐ మూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మొబైల్‌ఫోన్, కంప్యూటర్, నెట్ వాడకంపై అవగాహన లేమితో చిన్నారులు సైబర్ ప్రమాదాల బారిన పడుతున్నారని, వారిని రక్షించడం సమాజంలో ప్రతిఒక్కరి బాధ్యతని ఎన్టీఆర్ జిల్లా సైబర్ పోలీసు స్టేషన్ ఎస్ఐ ఏ మూర్తి పేర్కొన్నారు. హనుమాన్‌పేటలోని తానా భవన్‌లో చైల్డ్ లైన్-1098, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ వారి సహకారంతో సైబర్ క్రైమ్‌పై అవగాహన, ఆన్‌లైన్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ అనే అంశంపై వర్క్ షాపు జరిగింది. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ చైల్డ్ లైన్-1098 సభ్యులు ఈ సైబర్ నేరాలపై, ఆన్‌లైన్ సేఫ్టీ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. తద్వారా బాలలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. సైబర్ నేరాలు 27 రకాలు ఉన్నాయన్నారు. అపరిచితులతో, అపరిచిత యాప్స్‌తో, ఈ-మెయిల్స్‌తో, ఓటీపీలతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్దలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ సమాజ పటిష్టతకు మూలమన్నారు. చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ అరవ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలతో ప్రమాదంలో ఉన్నామన్నారు. ముఖ్యంగా బాలలు అవగాహన లేక కొన్నిసార్లు ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారని తెలిపారు. ఆన్‌లైన్ సైబర్ మోసాలతో చాలా మంది జీవితాలను కోల్పోతున్నారన్నారు. సైబర్ నేరాలపై చిన్నారులకు సరైన అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అవగాహన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ సెంటర్ కో-ఆర్డినేటర్ నాగరాజు, రైల్వే చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ వర ప్రసాద్, ప్రకాష్ పాల్గొన్నారు.

మూత్రపిండ వ్యాధులపై అవగాహన

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూత్రపిండ వ్యాధులపై అవగాహన అవసరమని కిడ్నీ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ వి.స్పందన అన్నారు. మూత్రపిండాల పనితీరు బాగుండాలంటే జీవనశైలి చక్కగా ఉండాలని ఆమె సూచించారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో శనివారం మూత్రపిండాల వ్యాధులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ స్పందన మాట్లాడుతూ మూత్రపిండాలు దెబ్బతినడంలో వంశపారంపర్యం, వృద్ధాప్యం, ధూమపానం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం, స్థూలకాయం, వైద్యుని సలహా లేకుండా మందులు వాడటం, తగిన నీరు తాగకపోవడం ప్రధాన కారణాలన్నారు. ప్రతి ముగ్గురు మధుమేహుల్లో ఒకరు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నట్లు ఆమె తెలిపారు. రక్తపోటు ఉన్న వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సదస్సుకు డాక్టర్ జి.సమరం అధ్యక్షత వహించగా, డాక్టర్ మూరు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రేమ పేరుతో ఓ యువతిని వేధిస్తున్న యువకుడిపై సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరుజిల్లా, తాడేపల్లికి చెందిన యువతి(20) నగరంలోని ఒక కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. యువతి తండ్రి నగరంలోకి ఒక బేకరి షాపు నిర్వహిస్తుండటంతో రోజూ ఇంటి వద్ద నుంచి యువతిని తీసుకొచ్చి కళాశాలలో దింపి మళ్లీ తనతో పాటు ఇంటికి తీసుకువెళ్తాంటాడు. ఈ క్రమంలో యువతి ఇంటి సమీపంలోనే నివాసముండే దుర్గాప్రసాద్ అనే యువకుడు గత సంవత్సరంన్నర నుంచి తనను ప్రేమించాలంటూ యువతి వెంట పడుతూ వేధింపులకు పాల్పడుతున్నాడు. గత ఏడాది నవంబర్ 25వ తేదీన కూడ యువతి చదువుతున్న కళాశాల వద్దకు వెళ్లి తనను ఎందుకు ప్రేమించవంటూ గొడవపడ్డాడు. దీనిపై ఆమె ఎస్ఎన్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు యువకుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం తన పంథా మార్చుకోకుండా యువతిపై వెంట పడుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం కళాశాలకు సెలవు కావడంతో తండ్రికి సాయంగా ఉండేందుకు గాంధీనగర్‌లోని తండ్రి షాపునకు వెళ్లింది. ఆ సమయంలో యువకుడు షాపు వద్దకు వచ్చి, తనను ప్రేమించాలని, లేనిపోతే ఊరుకునే పనిలేదంటూ గొడవపడి భయభ్రాంతులకు గురిచేశాడు. దీనిపై యువతి ఎస్ఎన్‌పురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు స్వామివార్ల వస్త్రాలకు బహిరంగ వేలం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు స్వామికి, ఇతర దేవాతామూర్తులకు సమర్పించిన చీరలు, జాకెట్ ముక్కలు, దోవతులు పొందేందుకు సంవత్సర కాలానికి టెండర్ కం బహిరంగ వేలం ఈ నెల 13న నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వై.సీతారామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతవ్సర కాలానికి అనగా 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు స్వామికి, అమ్మవారికి, ఇతర దేవతామూర్తులకు సమర్పించిన వస్త్రాలను దక్కించుకునేందుకు జరిగే టెండర్ కం బహిరంగ వేలంలో పాల్గొనే వారు ఈ నెల 12న సాయంత్రం ఆరు గంటల లోపు దేవాలయ కార్యాలయంలో రూ.100 చెల్లించి టెండర్ షెడ్యూల్ ఫారం పొందాలన్నారు. 13వ తేదీన ఉదయం 11 గంటలకు దేవస్థానంలోని కార్యాలయానికి హాజరై సీల్డ్ టెండర్లను టెండర్ బాక్స్‌లో వేయాలని సూచించారు.

నీలకంఠేశ్వరస్వామికి రుద్రాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా ధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యంలో నీలకంఠేశ్వరస్వామికి గురువారం రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలను శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.







క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీతోనే బ్రాహ్మణులకు గుర్తింపు

- ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుకు మద్దతివ్వాలి



మాట్లాడుతున్న ద్రోణంరాజు రవికుమార్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో బ్రాహ్మణులకు గుర్తింపు వచ్చిందని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ చెప్పారు. ఆయన శనివారం విశాఖలో విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బ్రాహ్మణులకు మూడు ఎమ్మెల్యే సీట్లు కేటాయించడంతో పాటు ఇప్పుడు ఎమ్మెల్సీ సీటు కూడా బ్రాహ్మణులకే కేటాయించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు బ్రాహ్మణులు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఆయనకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వారసత్వ అర్చకత్వం కోసం 32 ఏళ్లుగా బ్రాహ్మణులు పోరాడుతున్నా ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే దానిని అమలు చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ శర్మ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చాలీ చాలని జీతాలతో బతుకుతున్న అర్చకుల వేతనాలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ.10 వేలు నుంచి రూ.16 వేలకు పెంచారని చెప్పారు. ఈ ప్రభుత్వంలో నవశకం ద్వారా ఇప్పటివరకు 1.90 లక్షల మంది బ్రాహ్మణులు లబ్ధి పొందారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి హెచ్.కె.మనోహర్ రావు, గౌరీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్ని ప్రహసనంగా మార్చారు

- పట్టభద్రుల స్థానాల్లో టీడీపీని, టీచర్ స్థానాల్లో పీడీఎఫ్‌ను గెలిపించాలి
- ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలను సీఎం జగన్ ఒక ప్రహసనంగా మార్చారని ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు చైతన్యంతో ఓటు వేసి అధికార పార్టీని ఓడించాలని కోరారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి శనివారం ఆయన రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. అడ్డదారులతో పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. బోగస్ ఓట్ల బాగోతంపై ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, అందుకే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పీడీఎఫ్‌తో అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు మొదటి ప్రాధాన్య ఓటు వేసిన తర్వాత రెండో ప్రాధాన్య ఓటు పీడీఎఫ్ అభ్యర్థులకు వేయాలని కోరారు. ఉపాధ్యాయ ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరులు ఉత్తరాంధ్ర, పశ్చిమ రాయలసీమ టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌కు ఓటు వేయాలని కోరుతున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు వేపాడ చిరంజీవిరావు, కె.శ్రీకాంత్, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

డాక్టర్ ఆదర్శ రైతు!

- ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న రైతుకు భారత్ వర్చ్యువల్ యూనివర్సిటీ డాక్టరేట్



భారత్ వర్చ్యువల్ యూనివర్సిటీ వీసీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న రైతు మోహన్‌రెడ్డి

చౌడేపల్లె(చిత్తూరు జిల్లా): ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచిన రైతు మేకల మోహన్‌రెడ్డికి భారత్ వర్చ్యువల్ యూనివర్సిటీ శనివారం డాక్టరేట్ ప్రదానం చేసింది. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం తెల్లనీళ్లపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి డిగ్రీ, అగ్రికల్చర్ డిప్లొమా చదివారు. 20 ఏళ్లగా నర్సరీ నిర్వహణ, మల్చింగ్ ద్వారా సాగు, ఎల్ఈడీ లైట్ల వెలుతురు ద్వారా చామంతి పంటను సాగుచేస్తూ ఆదర్శంగా నిలిచారు. ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ.. వ్యవసాయ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బెంగళూరులోని భారత్ వర్చ్యువల్ యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా శనివారం మోహన్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ అందించింది. వీసీ టీఎస్ స్వామి మాట్లాడుతూ ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారని మోహన్‌రెడ్డిని ప్రశంసించారు. మోహన్‌రెడ్డిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి తదితరులు అభినందించారు.



జీవనశైలి మారకపోతే ముప్పే

దేశంలో పెరుగుతున్న నాన్ కమ్యునికబుల్ జబ్బులు

63 శాతం మరణాలకు ఇవే కారణం

మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లే ఇందుకు మూలం

- గుండె పోటు, క్యాన్సర్, బీపీ, సుగర్‌కు ఇవే కారణం
- పొగాకు వల్ల 32.8 శాతం, మద్యం వల్ల 15.9 శాతం ప్రమాదం
- శారీరక శ్రమ లేకపోవడంతో 41.3 శాతం ప్రమాదం
- పండ్లు, కూరగాయలు తీసుకోకపోతే 98.4 శాతం ప్రమాదం
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడి
- మద్యం, పొగాకుకు దూరంగా ఉండాలని సూచన
- పండ్లు, కూరగాయలు ఎక్కువ తీసుకోవాలి
- శారీరక శ్రమ పెంచాలని వినతి

సాక్షి, అమరావతి: ఏం చేస్తున్నారు.. ఏం తింటున్నారు.. ఉదయం లేచిన దగ్గర్నుంచి పడుకొనే వరక మీ దినచర్య, ఆహారాన్ని జాగ్రత్తగా గమనించండి. అవసరమైన మార్పులు చేసుకోండి... మీ జీవిత కాలాన్ని పెంచుకోండి.. అంటోంది కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ. జీవన శైలి, ఆహార అలవాట్ల వల్లే దేశంలో నాన్ కమ్యునికబుల్ వ్యాధులు పెరుగుతున్నాయని, 63 శాతం మరణాలు వీటి వల్లే కలుగుతున్నాయని హెచ్చరిస్తోంది. ముఖ్యంగా గుండె పోటుతో పాటు బీపీ, సుగర్, క్యాన్సర్ వ్యాధులకు ప్రధాన కారణం ప్రజల జీవన శైలేనని ఈ మంత్రిత్వ శాఖ 2021–22 వార్షిక నివేదికలో పేర్కొంది. నాన్ కమ్యునికబుల్ జబ్బులతో పాటు గుండెపోటుతో ఆకస్మిక మరణాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలకు తోడు ప్రజలు కూడా జీవనశైలితో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించింది. ఈ వ్యాధుల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం స్క్రీనింగ్ చేస్తున్నాయి. అయినా ప్రతి సంవత్సరం బీపీ, సుగర్, గుండె జబ్బులు, క్యాన్సర్ జబ్బుల రోగుల సంఖ్య పెరుగుతోందని తెలిపింది. ప్రజలు కూడా ఈ జబ్బులకు కారకాలైన వాటికి దూరంగా ఉండాలని, దిన చర్యలో మార్పులు చేసుకొని, శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. నాన్ కమ్యునికబుల్ వ్యాధులు 21వ శతాబ్దంలో కొత్త సవాళ్లను విసురుతున్నాయని పేర్కొంది. పట్టణీకరణతో పాటు జీవనశైలిలో మార్పులకు దారి తీసిందని, కొత్త కొత్త ఆహారపు మార్కెట్‌లు రావడం, వాటికి ప్రజలు ఆకర్షితులు కావడం, వాటికి తోడు పొగాకు, మద్యం సేవించడం, శారీరక శ్రమ లేకపోవడం వంటివి నాన్ కమ్యునికబుల్ వ్యాధులతో పాటు, గుండెపోటుతో అకాల మరణాలకు దారితీస్తున్నాయని నివేదిక తెలిపింది.

రాష్ట్రంలో 3.53 కోట్ల మందికి స్క్రీనింగ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 సంవత్సరాలకు పైబడిన జనాభాలో 92 శాతం మందికి నాన్ కమ్యునికబుల్ వ్యాధుల స్క్రీనింగ్‌ను పూర్తి చేశారు. ఇప్పటివరకు 3,53,44,041 మంది జనాభాకు పరీక్షలు చేశారు. గుండె జబ్బులు, రక్తపోటు, సుగర్, శ్వాస సంబంధ వ్యాధులు, క్యాన్సర్ వంటి జబ్బు లున్నట్లు పరీక్షల్లో తేలిన వారికి అవసరమైన చికిత్స అందిస్తున్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు

మూలకం	2025కి లక్ష్యం
నాన్ కమ్యునికబుల్ మరణాలు తగ్గింపు	25%
మద్యం సేవించడం తగ్గింపు	10%
శారీరక శ్రమను పెంచడం	10%
పొగాకు వినియోగం తగ్గింపు	30%
ఉప్పు అత్యధిక వినియోగం తగ్గింపు	30%



దేశంలో 2020–21లో నాన్ కమ్యునికబుల్ వ్యాధులు స్క్రీనింగ్, చికిత్స వివరాలు


స్క్రీనింగ్ చేసిన వారి సంఖ్య	సుగర్ వ్యాధిగ్రస్తులు	రక్తపోటు	గుండె వ్యాధులు	కామన్ క్యాన్సర్
4,66,15,704	37,54,055	44,17,013	1,48,873	58,602

వ్యాధుల నివారణోపాయాలు




- జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి
- శారీరక శ్రమను పెంచాలి
- మద్యం, పొగాకుకు దూరంగా ఉండాలి
- పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి
- ఉప్పు వినియోగాన్ని తగ్గించాలి. ఆహారంలో రోజుకు 5 గ్రాములకంటే తక్కువ ఉప్పు తీసుకోవాలి
- ఏరేటెడ్ డ్రింక్స్, వేయించిన ఆహారాన్ని తీసుకోకూడదు
- పెద్దలు వారానికి కనీసం 150 నిమిషాలు శారీరక శ్రమలో పాల్గొనాలి
- 5 ఏళ్ల నుంచి ఏడేళ్ల లోపు పిల్లలకు ప్రతిరోజు కనీసం 60 నిమిషాలు శారీరక శ్రమ అవసరం.

18 నుంచి 69 ఏళ్లలోపు వారికి గుండెపోటు, ఇతర నాన్ కమ్యునికబుల్ వ్యాధులకు కారకాలు శాతం ఇలా



15 నుంచి 17 సంవత్సరాల్లోపు వారికి గుండెపోటు, ఇతర నాన్‌కమ్యునికబుల్ వ్యాధులకు కారకాలు శాతం ఇలా



సీఎం జగన్‌తోనే నా పయనం

- పార్టీ మారుతున్నానన్న ప్రచారం అవాస్తవం
- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



దర్శి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే తన రాజకీయ పయనం ఉంటుందని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ స్పష్టం చేశారు. కొన్ని మీడియా సంస్థలు తనపై దుష్ప్రచారం చేస్తున్నాయని, తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తన కుమారుడి వివాహం, సొంత పనుల కారణంగా రెండు నెలలుగా నియోజకవర్గానికి దూరంగా ఉండాల్సి వచ్చిందన్నారు. ప్రకాశం జిల్లా దర్శిలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్ ఎలా చెబితే అలా నడుచుకుంటానని స్పష్టంచేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో తిరిగి వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్నారు. దర్శి పట్టణం, నియోజకవర్గంలో ఇంటింటికీ మంచినీటి సరఫరా కోసం త్వరలో టెండర్లు పిలుస్తున్నట్టు తెలిపారు. దర్శిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగిశాక గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళతానని చెప్పారు.

లోకేశ్ పాదయాత్రకు బ్రేక్

సాక్షి, అమరావతి/ బి.కొత్తకోట: అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో సాగుతున్న టీడీపీ నేత నారా లోకేశ్ పాదయాత్రను రెండురోజులు నిలిపివేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో 12, 13 తేదీల్లో యాత్రకు విరామం ప్రకటించారు. లోకేశ్ శనివారం మధ్యాహ్నమే పాదయాత్ర ముగించుకుని తన సతీమణి బ్రాహ్మణితో కలిసి హైదరాబాద్ పయనమయ్యారు. పాదయాత్ర ఆపిన చోటనుంచే తిరిగి 14వ తేదీన ప్రారంభమవుతుందని టీడీపీ నాయకులు తెలిపారు.

హోదాకు ప్రత్యామ్నాయంగా ప్యాకేజీ ఇచ్చాం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ పాలనలో రాష్ట్రానికి ప్రత్యేక హోదాకు ప్రత్యామ్నాయంగా రూ.15 వేల కోట్లతో ప్యాకేజీ ఇచ్చామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. చిత్తూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చి మాట్లాడారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలోకి వస్తారనే ప్రచారంపై స్పందిస్తూ... ఆయన రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. చంద్రబాబు పాలనలో రాజధాని నిర్మాణంతో పాటు పలు ప్రాజెక్టులకు నిధులు ఇచ్చామని చెప్పారు. టీడీపీకి భవిష్యత్ లేదని, ఆ పార్టీతో అభివృద్ధి జరగదని వ్యాఖ్యానించారు. జనసేన తమతోనే కలిసి ఉందని స్పష్టం చేశారు. ప్రజలకు ఏం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. బీజేపీ నాయకులు ఆనంద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

నేడు అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలి

ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపు

సాక్షి, అమరావతి: మార్చి 12న (నేడు) వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో పార్టీ జెండాలు ఎగుర వేయాలని, దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు రంగులు వేసి, పూలమాలలతో అలంకరించాలని తెలిపింది. పలు సేవా కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించింది. వైఎస్సార్‌సీపీ 12 వసంతాలు పూర్తి చేసుకుని మార్చి 12వ తేదీన 13వ సంవత్సరంలోకి అడుగు పెట్టనుంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఎన్నో సవాళ్లను అధిగమించి, సంపూర్ణ ప్రజాబలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. అధికారంలోకి వచ్చాక ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దాదాపు అన్ని హామీలు అమలు చేయడమే కాక, చెప్పని వాటితో పాటు, అనేక సంక్షేమ – అభివృద్ధి కార్యక్రమాల అమలు ద్వారా ప్రజారంజక పరిపాలన సాగిస్తోంది.



విద్యుత్ దీపాల వెలుగుల్లో తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం

ఆత్మగౌరవానికి ప్రతీక

రాజకీయంగా వైరిపక్షాలైన కాంగ్రెస్, టీడీపీలు కుమ్మక్కై మొగ్గలోనే వైఎస్సార్‌సీపీని తుంచేసేందుకు కుట్రలు చేశాయి. ప్రపంచ చరిత్రలోనే ఏ రాజకీయ పార్టీ ఎదుర్కోనన్ని సవాళ్లు.. దాడులను ఎదుర్కొంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటినే సోపానాలుగా మలుకుంటూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేశారు. 45 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు.. విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తూ వైఎస్సార్‌సీపీని బలీయమైన శక్తిగా తీర్చిదిద్దారు.



సాక్షి, అమరావతి: కాంగ్రెస్ పార్టీకి రెండుసార్లు ఒంటి చేత్తో అధికారాన్ని అందించిన వైఎస్ రాజశేఖరరెడ్డి 2009 సెప్టెంబరు 2న హెలికాప్టర్ ప్రమాదంలో హఠాన్మరణం చెందారు. ఆ విషాద వార్తను తాళలేక వందలాది మంది మరణించడం.. వైఎస్ జగన్‌ను, ఆయన కుటుంబీకులను కలిచి వేసింది. అలా మరణించిన వారి కుటుంబాలను పరామర్శించడానికి ఓదార్పు యాత్ర చేపడతానని కర్నూలు జిల్లా నల్లకాలువ వద్ద 2009 సెప్టెంబరు 25న నిర్వహించిన వైఎస్సార్ సంస్మరణ సభలో వైఎస్ జగన్ ప్రకటించారు. 2010 ఏప్రిల్ 9న పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఓదార్పు యాత్ర ప్రారంభించారు. ఆ యాత్రను ఆపేయాలని కాంగ్రెస్ అధిష్టానం వైఎస్ జగన్‌ను ఆదేశించింది. ఇది రాజకీయాలకు ఏమాత్రం సంబంధం లేదని.. తల్లి వైఎస్ విజయమ్మ, సోదరి షర్మిలతో కలిసి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి వైఎస్ జగన్ వివరించినా లాభం లేకపోయింది. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి... వైఎస్ జగన్ ఓదార్పు యాత్రను కొనసాగించారు. దీంతో కాంగ్రెస్‌లోని కొన్ని శక్తులు, టీడీపీతో కుమ్మక్కై కుట్రలకు తెరతీశాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు, పులివెందుల శాసనసభ, కడప లోక్‌సభ స్థానాలకు వైఎస్ విజయమ్మ, వైఎస్ జగన్ రాజీనామా చేశారు.

జనం పక్షాన పోరుబాట

ప్రజా సమస్యలపై వైఎస్ జగన్ పోరుబాట పట్టారు. ఈ నేపథ్యంలో జగతి పబ్లికేషన్స్‌కు ఆదాయపు పన్ను శాఖతో నోటీసులు జారీ చేయించడం ద్వారా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ వేధింపుల పర్వాన్ని ప్రారంభించారు. అయినా వాటిని లెక్క చేయని వైఎస్ జగన్.. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనే లక్ష్యంగా, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా 2011 మార్చి 11న వైఎస్సార్‌సీపీ పేరును ప్రకటించారు. ఆ మరుసటి రోజే వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో వైఎస్ సమాధి వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 2011 ఏప్రిల్ 12న కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. కడప లోక్‌సభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ జగన్, పులివెందుల శాసనసభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ విజయమ్మ పోటీ చేసి, రికార్డు మెజార్టీతో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, టీడీపీ కుమ్మక్కు రాజకీయాలతో 2011 ఆగస్టు 10న వైఎస్ జగన్ ఆస్తులపై సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశించింది.

నైతిక విలువలే పునాది

నైతిక విలువలతో రాజకీయాలు చేయాలన్నది వైఎస్ జగన్ సిద్ధాంతం. వైఎస్సార్‌సీపీలో ఎవరైనా చేరాలంటే.. వారు ఆ పార్టీకి, ఆపార్టీ ద్వారా సంక్రమించిన పదవులకు రాజీనామా చేసి రావాలని షరతు విధించారు. దానికి కట్టుబడిన 19 మంది ఎమ్మెల్యేలు, ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ ద్వారా సంక్రమించిన పదవులకు రాజీనామా చేసి, వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిని తిరిగి గెలిపించుకునేందుకు వైఎస్ జగన్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అదే సమయంలో వైఎస్ జగన్‌ను విచారణ పేరుతో పిలిచిన సీబీఐ 2012, మే 27న అరెస్టు చేసింది. దీన్ని ప్రజలు నిరసిస్తూ ఉప ఎన్నికల్లో 17 శాసనసభ, నెల్లూరు లోక్‌సభ స్థానంలో వైఎస్సార్‌సీపీని గెలిపించారు. 2013 సెప్టెంబరు 24న వైఎస్ జగన్‌కు కోర్టు బెయిల్ ఇచ్చింది. 16 నెలలపాటు అక్రమంగా నిర్బంధించడం వల్ల ప్రజల్లో ఆదరణ మరింత పెరిగింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా బరిలోకి దింగింది. టీడీపీ–బీజేపీ–జనసేనతో జట్టుకట్టి బరిలోకి దిగింది. మోదీ ప్రభంజనంలో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారానికి దూరమైంది. 67 శాసనసభ స్థానాలు గెలుచుకుని బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. చంద్రబాబు కుట్రతో వైఎస్ జగన్ రెక్కలకష్టంతో గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలు టీడీపీలోకి ఫిరాయించారు. వారిపై అనర్హత వేటు వేయాలని జగన్ పోరాటం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా రాజకీయాల్లో నైతిక విలువకు నాటి సీఎం చంద్రబాబు సమాధి కట్టారు. దీన్ని నిరసిస్తూ.. ప్రజల్లోనే తేల్చుకుంటానని ప్రకటిస్తూ 2017 అక్టోబర్ 26న శాసనసభ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు వైఎస్ జగన్ ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ ప్రస్థానంలో కీలక ఘట్టాలు

- **02.09.2009:** వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో హఠాన్మరణం
- **09.04.2010:** ఓదార్పు యాత్ర ప్రారంభం
- **27.11.2010:** వైఎస్ జగన్ ఆస్తులపై విచారణ జరపాలని నాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరరావు, టీడీపీ ఎంపీ కె.ఎర్రన్నాయుడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ
- **29.11.2010:** ఎంపీ, ఎమ్మెల్యే పదవులకు, కాంగ్రెస్ పార్టీకి వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మ రాజీనామా
- **21.12.2010:** రైతులు, చేనేత కార్మికులను ఆదుకోవాలని విజయవాడలో కృష్ణా నదీ తీరాన వైఎస్ జగన్ 'లక్ష్య దీక్ష'
- **13.05.2011:** కడప లోక్‌సభ స్థానం ఉప ఎన్నికలో 5,45,672 ఓట్ల రికార్డు మెజార్టీతో వైఎస్ జగన్, పులివెందుల ఎమ్మెల్యేగా వైఎస్ విజయమ్మ 81,373 ఓట్ల రికార్డు మెజార్టీతో విజయభేరి.
- **08.07.2011:** ఇడుపులపాయలో వైఎస్సార్‌సీపీ తొలి ప్లీనరీ
- **21.12.2012:** అక్రమ కేసులు, సీబీఐ పక్షపాత ధోరణిని నిరసిస్తూ 'జగన్ కోసం జనం' పేరుతో కోటి సంతకాల సేకరణ
- **05.10.2013:** రాష్ట్ర విభజనను నిరసిస్తూ లోటస్ పాండ్‌లో వైఎస్ జగన్ ఆమరణ దీక్ష
- **18.12.2013:** రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అవిశ్వాస తీర్మానం
- **20.06.2014:** శాసనసభలో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌కు గుర్తింపు
- **21.02.2015:** అనంతపురం జిల్లాలో రైతు భరోసా యాత్ర
- **10.08.2015:** ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో ధర్నా
- **29.08.2015:** ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా రాష్ట్ర బంద్
- **26.01.2017:** విశాఖ ఎయిర్‌పోర్టులోని రన్ వేపై వైఎస్ జగన్ అరెస్టు
- **01.05.2017:** గుంటూరులో రైతు దీక్ష
- **08.07.2017:** నాగార్జున వర్సిటీ ఎదురుగా రెండో ప్లీనరీ
- **25.10.2018:** విశాఖ ఎయిర్‌పోర్టులో వైఎస్ జగన్‌పై హత్యాయత్నం
- **09.01.2019:** శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం వద్ద ప్రజాసంకల్ప పాదయాత్ర ముగింపు
- **08.07.2022:** నాగార్జున వర్సిటీ ఎదురుగా మూడో ప్లీనరీ నిర్వహణ

చరిత్రాత్మకం.. ప్రజా సంకల్పం

తన తండ్రి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నుంచి 2017 నవంబర్ 6న ప్రజా సంకల్ప పాదయాత్రను వైఎస్ జగన్ ప్రారంభించారు. 14 నెలలుపాటు 3,648 కి.మీ.ల దూరం ఈ యాత్ర సాగింది. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు అఖండ విజయాన్ని అందించారు. దేశ చరిత్రలో 50 శాతానికిపైగా ఓట్లతో 151 శాసనసభ (87 శాతం), 22 లోక్‌సభ (88 శాతం) స్థానాలను వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. 2019 మే 30న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. తొలి మంత్రివర్గంలో 56 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చి.. ఐదు డిప్యూటీ సీఎం పదవుల్లో నాలుగు ఆ వర్గాలకే ఇచ్చి.. హోంశాఖ మంత్రిగా తొలిసారిగా ఎస్సీ మహిళను నియమించి సామాజిక విప్లవానికి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. 2022 ఏప్రిల్ 11న పునర్ వ్యవస్థీకరణ ద్వారా మంత్రివర్గంలో ఏకంగా 70 శాతం పదవులు ఆ వర్గాల వారికి ఇచ్చి, సామాజిక సాధికారత సాధనలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని రీతిలో నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు.. మహిళలకు రిజర్వు చేసేలా చట్టం తెచ్చి మరీ పదవులు ఇచ్చారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ, స్థానిక సంస్థల పదవుల్లోనూ ఆ వర్గాలకే పెద్దపీట వేశారు. అధికారంలోకి వచ్చిన 45 నెలల్లోనే 98 శాతానికిపైగా హామీలను అమలు చేశారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లారు. 13 జిల్లాలను పునర్ వ్యవస్థీకరించి.. 26 జిల్లాలను ఏర్పాటు చేశారు. ఎన్నో పథకాల ద్వారా పేద, దిగువ మధ్యతరగతి వర్గాలకు అండగా నిలిచారు. జనరంజక పాలన అందిస్తుండటంతో ప్రజలు పంచాయతీ, మున్సిపాలిటీ, జిల్లా పరిషత్, ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, అభ్యర్థులను గెలిపించారు.

స్టార్టప్స్‌కు ఊతమిచ్చిన జీఐఎస్

రాష్ట్ర స్టార్టప్స్‌కు 36 జాతీయ, అంతర్జాతీయ సంస్థల దన్ను

- సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక సాయం అందించడానికి సిద్ధం
- ఈ సంస్థలతో ఒప్పందం చేసుకున్న ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ
- పేటీఎం, ఒప్పో వంటి సంస్థల ద్వారా ప్రచారం, సాంకేతిక పరిజ్ఞానం
- ఆర్థిక సాయానికి ఈఈడీసీ, సీటీఈ, ఈస్క్వేర్ ఒప్పందాలు

సాక్షి, అమరావతి: విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) కేవలం భారీ పెట్టుబడులను ఆకర్షించడానికే కాకుండా రాష్ట్ర స్టార్టప్ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి కూడా వేదికగా నిలిచింది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు జీఐఎస్‌లో 36కు పైగా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆలోచన దగ్గర నుంచి దాన్ని వాణిజ్యపరంగా పూర్తిస్థాయి నూతన ఆవిష్కరణగా తీర్చిదిద్దేలా స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను తయారు చేసే విధంగా పరిశ్రమలు, ఇంక్యుబేటర్లు, యాక్సిలేటర్స్, పరిశ్రమలతో రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖకు చెందిన ఆంధ్రప్రదేశ్ ఇన్నొవేషన్ సొసైటీ (ఏపీఐఎస్) పలు ఒప్పందాలను కుదుర్చుకుంది.

ఇందుకోసం జీఐఎస్ ఎగ్జిబిషన్‌లో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేసి, స్టార్టప్స్‌పై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని కూడా నిర్వహించింది. రాష్ట్రంలో ప్రస్తుతం 595 స్టార్టప్స్, 30 ఇంక్యుబేటర్స్ ఉన్నాయి. ఏపీ ఐటీ శాఖ నుంచి నాలుగు ఇంక్యుబేటర్లు, వివిధ కళాశాలల్లో మరో 26 ఇంక్యుబేటర్స్ ఉన్నాయి. ఇవి కాకుండా 1,500 మంది సొంతంగా ఇంటి నుంచే స్టార్టప్స్ కింద పనిచేయడానికి నమోదు చేసుకొన్నారు. రాష్ట్రంలోని స్టార్టప్స్ అంతర్జాతీయంగా ఎదిగేలా ఐటీ శాఖ ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా పలు సంస్థల సహకారాన్ని స్టార్టప్స్‌కి అందిస్తోంది.

స్టార్టప్స్‌కు పరిశ్రమల మద్దతు

రాష్ట్రంలోని స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు సహాయ సహకారాలందించడానికి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయి. బహుళజాతి సంస్థలు పేటీఎం, ఒప్పో, డసాల్ట్, స్మార్ట్‌ఫార్మింగ్ టెక్, గ్లోబల్ యాక్సలేటర్ ఫర్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ వంటి సంస్థలు స్టార్టప్స్‌ను ప్రోత్సహించనున్నాయి. ఈ మేరకు ఏపీ ఇన్నొవేషన్స్ సొసైటీతో ఒప్పందాలు చేసుకున్నాయి. రాష్ట్రంలోని స్టార్టప్స్‌కు జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించేందుకు పేటీఎం ముందుకొచ్చింది. అలాగే ప్రముఖ సెల్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో తన అనుబంధ సంస్థ ఒప్లస్ ఇండియా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ ద్వారా రాష్ట్రంలోని స్టార్టప్స్ ప్రమోట్ చేయనుంది. రాష్ట్రంలోని స్టార్టప్స్ అభివృద్ధి చేసిన ప్రొడక్ట్స్‌ను 100 రోజుల్లో మార్కెటింగ్ చేసేందుకు డసాల్ట్ ఇండియా సిస్టమ్స్ ఆసక్తి కనబరుస్తోంది. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఆవిష్కరించే నూతన టెక్నాలజీలకు ఆర్థిక సాయం అందించేందుకు నెదర్లాండ్స్‌కు చెందిన స్మార్ట్ ఫార్మింగ్ టెక్ బీవీ ముందుకొచ్చింది. బెంగళూరుకు చెందిన యాక్సిలేటర్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ రాష్ట్రంలోని స్టార్టప్స్‌ను దేశ విదేశాల్లోని ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లడానికి ఆర్థిక వనరులను సమకూర్చనుంది.

ఫండింగ్ చేయడానికి మూడు సంస్థలు

అలాగే రాష్ట్రంలోని స్టార్టప్స్ అభివృద్ధి చేసిన నూతన ఆవిష్కరణలకు దేశ విదేశాల్లోని అవకాశాలను అందిపుచ్చుకోవడానికి వెంచర్ క్యాపిటలిస్ట్, ఏంజెల్ ఫండింగ్ రూపంలో ఆర్థికసాయం అందించే విధంగా మూడు సంస్థలతో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ ఒప్పందాలు చేసుకుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన యూరోపియన్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఈఈడీసీ), చెన్నైకి చెందిన కన్సార్టియం ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (సీటీఈ), బ్రిటన్‌కు చెందిన ఈస్క్వేర్ ఇన్నొవేషన్స్ లిమిటెడ్ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అదే విధంగా డీఎల్టీ ల్యాబ్ టెక్నాలజీస్, దుబాయ్‌కు చెందిన క్రియేటర్స్ ఎఫ్‌జెడ్‌కో, మై స్టార్టప్ టీవీ, నెక్ట్స్ వేవ్ వంటి స్టార్టప్ సంస్థలతో కూడా ఒప్పందాలు జరిగాయి. ఇవి కాకుండా రాష్ట్రంలోని 13కుపైగా ఇంక్యుబేటర్ సంస్థలు, ఎస్‌టీపీఐ నెక్ట్స్, నాస్కాంలతో ఏపీఐఎస్ ఒప్పందాలు కుదుర్చుకుంది.

పూర్తిస్థాయి ఎకోసిస్టమ్ అభివృద్ధే లక్ష్యం

నూతన ఆవిష్కరణలు ఆలోచన దగ్గర నుంచి వ్యాపార పరంగా నూతన అప్లికేషన్ ఆవిష్కరించే విధంగా పూర్తిస్థాయి ఎకో సిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నాం. ప్రధానంగా మెటావర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గేమ్ డెవలప్‌మెంట్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, కామిక్స్, డిజిటల్ ఆర్ట్, మార్కెటింగ్, మీడియా డిస్ట్రిబ్యూషన్ రంగాలను ప్రోత్సహించడంపై దృష్టి సారించాం. నాలుగో తరం టెక్నాలజీలో పనిచేస్తున్న వారందరినీ ఆన్‌లైన్‌లో ఒకే వేదికపైకి తేవడం ద్వారా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాం. ఇందుకోసం ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాం. రంగాల వారీగా నెలవారీ, మూడు నెలలకు, ఆరు నెలలకు ఒకసారి సమీక్షలతో పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు, హ్యాక్‌థాన్‌లు, పోటీలు నిర్వహిస్తాం.

– ఏపీ ఇన్నొవేషన్ సొసైటీ సీఈవో అనిల్ తెంటు

2046 ప్రేమికుల రోజు ప్లానింగ్‌లేమీ వద్దు!

ఎందుకంటే.. గ్రహశకలం వచ్చేస్తోంది..

మీరు విన్నది నిజమే.. ఎందుకంటే.. ఆ రోజున ఓ గ్రహ శకలం భూమిని ఢీకొట్టే ప్రమాదం ఉందట. అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' ఈ మేరకు హెచ్చరించింది. మరి ఏమిటా గ్రహ శకలం? ఎక్కడ పడే అవకాశముంది? ఎంత నష్టం జరుగుతుందనే వివరాలు మీకోసం..


– సాక్షి సెంట్రల్ డెస్క్



కొన్ని వారాలుగా పరిశీలించాక..

పీసా టవర్ అంత పెద్దగా..

ఒక భారీ గ్రహశకలం.. దాదాపు ఆరు కోట్ల ఏళ్ల కింద భూమిని ఢీకొడితే డైనోసార్లు సహా 90శాతానికిపైగా జీవరాశి తుడిచిపెట్టుకుపోయింది. తర్వాత మరికొన్ని గ్రహశకలాలు వాటి స్థాయిలో విధ్వంసం సృష్టించాయి. ఇప్పుడూ అలాంటి ప్రమాదం ముంచుకు వస్తోందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా హెచ్చరించింది. 2046 ఫిబ్రవరి 14న సాయంత్రం 4.44 గంటల (ఈస్టర్న్ టైం)కు '2023డీడబ్ల్యూ' గ్రహశకలం భూమిని ఢీకొనవచ్చని పేర్కొంది (భారత కాలమానం ప్రకారం.. ఫిబ్రవరి 15న తెల్లవారుజామున 3.14 గంటలకు). ఇటలీలోని పీసా టవర్(186 అడుగులు)కు కాస్త దగ్గరగా 165 అడుగుల పరిమాణంలో ఈ గ్రహ శకలం ఉందని తెలిపింది.




'2023డీడబ్ల్యూ' గ్రహశకలాన్ని కొన్నివారాల క్రితమే గుర్తించారు. దాని ప్రయాణమార్గం, వేగం, ఇతర అంశాలను పరిశీలించిన ఓ ఇటాలియన్ ఆస్ట్రోనమర్.. భూమిని ఢీకొట్టే అవకాశం ఉందని నాసాను అలర్ట్ చేశారు. తొలుత 1,200 చాన్సుల్లో ఒకసారి అది ఢీకొట్టవచ్చని భావించారు. నిశితంగా పరిశీలించాక.. 710 చాన్సుల్లో ఒకసారికి, తర్వాత 560 చాన్సుల్లో ఒకసారికి మార్చారు. అంటే ప్రమాద అవకాశం మరింత పెరుగుతోందన్న మాట.



'2023డీడబ్ల్యూ' గ్రహశకలం హిందూ మహా సముద్రం నుంచి పసిఫిక్ మహాసముద్రం దాకా ఎక్కడైనా పడొచ్చని నాసా అంచనా వేసింది. అమెరికాలోని హవాయి, లాస్ ఏంజిలిస్, వాషింగ్టన్ వంటి నగరాలూ ఈ మార్గంలో ఉన్నాయని పేర్కొంది.

అమెరికా నుంచి భారత్ దాకా..

నాసా అంచనా వేసిన మ్యాప్ ప్రకారం.. తర్వాతి స్థానాల్లో ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ థాయ్‌లాండ్, ఇండియా, గల్ఫ్ దేశాలు కూడా ఉన్నాయి. అయితే.. వీటికి ప్రమాదం తక్కువ.



భూకంపాలను రిక్టర్ స్కేల్‌తో కొలిచినట్టే.. గ్రహశకలాలు ఢీకొట్టే ప్రమాదాన్ని టొరినో స్కేల్‌తో కొలుస్తారు. దాని పరిమాణం, వేగం, భూమికి ఎంత దగ్గరగా ప్రయాణిస్తుందనే అంశాల ఆధారంగా లెవల్ రేటింగ్ ఇస్తారు. '2023డీడబ్ల్యూ'తో ప్రమాదాన్ని లెవల్–1 వద్ద సూచించారు. మరింత కచ్చితమైన పరిశీలన తర్వాత స్థాయిని పెంచుతారు. లెవల్–3 దాటితే ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తారు.

టొరినో స్కేల్‌పై లెవల్–1 వద్ద..

ఇంతకుముందుతో పోలిస్తే..

1908లో దాదాపు 160 అడుగుల గ్రహశకలం రష్యాలోని సైబీరియా గగనతలంలో ఐదారు కిలోమీటర్ల ఎత్తులో పేలిపోయింది. దీని ధాటికి సుమారు 2వేల చదరపు కిలోమీటర్లలో అడవి, జీవజాలం నాశనమైంది. జనావాసాలకు దూరంగా జరగడంతో మరణాలు నమోదు కాలేదు. కానీ ఆ పేలుడు తీవ్రత జపాన్‌లోని హిరోషిమాపై వేసిన అణుబాంబు కంటే వెయ్యి రెట్లు ఎక్కువని, నేరుగా భూమిని ఢీకొని ఉంటే భారీ విధ్వంసం జరిగేదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

→ ఇప్పుడు '2023డీడబ్ల్యూ' గ్రహశకలం జనావాసాలు ఉన్నచోట ఢీకొంటే.. ఒక పెద్ద నగరమంత వైశాల్యంలో అంతా నామరూపాలు లేకుండా పోతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

కాపులంతా కాపు సంక్షేమ సేనలో లేరు

- జోగయ్యను నమ్మి పాలకొల్లులో చిరంజీవి ఓటమి
- కాపు సంఘాల నాయకులను పవన్ ఎందుకు కలవడంలేదు?
- పవన్ కళ్యాణ్‌కు కాపు ఐక్య వేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: రాజకీయాల నుండి పూర్తిగా వైదొలగి, 80 ఏళ్ల వయస్సులో కాపు సంక్షేమ సేనను స్థాపించిన చేగొండి హరిరామ జోగయ్య భ్రాంతి నుంచి జనసేన బయట పడాలని కాపు ఐక్య వేదిక సూచించింది. కాపులంతా కాపు సంక్షేమ సేనలో లేరని స్పష్టం చేసింది. ఈ మేరకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు కాపు ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, బోడపాటి పెదబాబు తదితరులు శనివారం బహిరంగ లేఖ రాశారు. 'మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో కాపు సంక్షేమ సేన నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలుసుకున్నాం. రాష్ట్రంలోని కాపులంతా కాపు సంక్షేమ సేనలో లేరనే విషయాన్ని మీరు గ్రహించాలి. కేవలం జోగయ్యే మొత్తం కాపులను ప్రభావితం చేయగలరనే భ్రాంతి నుంచి బయటకు రావాలి. జోగయ్యను నమ్మి చిరంజీవి పాలకొల్లులో ఓడిపోయారు. బీసీ, దళిత నాయకులను కలుస్తున్నట్టే కాపు సంఘాల నాయకులను మీరు ఎందుకు కలవడం లేదని సూటిగా ప్రశ్నిస్తున్నాం. కనీసం మీరు పోటీ చేసిన భీమవరం నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా స్థాయి కాపు నాయకులను సైతం మీరు కలవలేదు. ఆ నియోజకవర్గానికి చెందిన వారు మిమ్మల్ని కలిసేందుకు ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. కాపు సంఘాల నాయకులను కలిస్తే కులం కార్డు వచ్చేస్తుందని భావిస్తే.. జోగయ్య నేతృత్వంలోని కాపు సంక్షేమ సేనను కలవడం వల్ల కులం కార్డు రాదా' అని కాపు ఐక్య వేదిక నేతలు ఆ లేఖలో పవన్‌ను ప్రశ్నించారు.

నేను ఒక్క కాపులకే నాయకుణ్ణి కాదు

- బీసీలకు అధికారం రావాలని పంతం పట్టా
- వారితో అధికారం పంచుకోవాలని కాపు నేతలకు చెబుతా
- బ్యాక్‌వర్డ్ క్లాస్‌లు ఓటు అమ్ముకుంటున్నారంటే ఆత్మాభిమానం లేక కాదు
- వెనుకబడిన వర్గాల సమస్యలపై రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తే అండగా ఉంటా
- బీసీ నేతల సమావేశంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి : తాను ఒక్క కాపులకే నాయకుణ్ణి కాదని, ఒక కులం పరిధిలోనే ఆలోచించేలా పెరగలేదని జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పారు. శనివారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన బీసీ నేతల సమావేశంలో ఆయన ప్రసంగించారు. సమావేశంలో కొందరు నాయకులు కాపులకు రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరమేంటని మాట్లాడటంపై ఆయన స్పందిస్తూ.. ఈ అంశాన్ని కాపుల నేతలతో సమావేశమైనప్పుడు వారి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. బీసీలు ఎన్నికలప్పుడు రూ. 2 వేలకు ఓటును అమ్ముకుంటున్నారంటే వారికి ఆత్మాభిమానం లేక కాదని, ఆర్థిక పరిపుష్టి లేక అలా చేస్తున్నారని పవన్ అన్నారు. బీసీలకు ఆర్థిక పరిపుష్టి ఏర్పడాలని, అందుకోసం ఆ కులాలకు అండగా ఉంటానని అన్నారు. 'బీసీలకు అధికారం రావాలని నేను పంతం పట్టా. బీసీలకు సాధికారత రావాలని నా కమ్మ, రెడ్డి స్నేహితులకు కూడా చెబుతా. బీసీలతో కలిసి అధికారం పంచుకోవాలని కాపు నాయకులకూ చెబుతా' అని అన్నారు. ఎన్నికల సమయంలో బీసీలు కులాల వారీగా విడిపోకుండా బీసీ అభ్యర్థిని అందరూ కలిసి ఎందుకు గెలిపించుకోరని ప్రశ్నించారు. బీసీల సమస్యలపై ఒక రోజు రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తే తాను అండగా ఉంటానని, లేదంటే ఒక్క రోజు దీక్ష చేద్దామని చెప్పారు. విభజన సమయంలో ఉత్తరాంధ్రకు చెందిన 26 బీసీ కులాలను తెలంగాణలో బీసీల జాబితా నుంచి తొలగిస్తే మంత్రులెందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. దీనిపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు పోరాడాలని, బీఆర్ఎస్ నాయకులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్లోగన్లు నాయకులని చేయవని, బూత్‌లో ఓట్లు వేయించి గెలిపించాలని పార్టీ నేతలకు సూచించారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్‌బోన్ క్లాస్‌లని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపులు కలిసికట్టుగా ఉంటే రాజ్యాధికారం తథ్యమని చెప్పారు. ఈ దిశగా తెలుగురాష్ట్రాల్లో ఆ ప్రయత్నాలు జరగలేదన్నారు.

జిల్లా వార్తలు

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



నెమలిలో కల్యాణోత్సవం తిలకించేందుకు హాజరైన అశేష భక్త జన సందోహం

- భక్తిశ్రద్ధలతో పవళింపుసేవ
- ఆకట్టుకున్న తెప్పోత్సవం



స్వామి పవళింపు సేవ

నెమలి(గంపలగూడెం): ఉమ్మడి కష్ణా జిల్లాలో ప్రముఖ ఆలయంగా విరాజిల్లుతున్న గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో 66వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి వైభవంగా ముగిశాయి. పవళింపు సేవతో ఈనెల 5వ తేదీ నుంచి ఆరురోజులు పాటు నిర్వహించిన ఉత్సవాలను ఘనంగా ముగించారు. వధూరులైన రుక్మిణీదేవి, సత్యభామ సహిత వేణుగోపాలస్వామి పవళింపు సేవ కార్యక్రమాన్ని ఆలయ అద్దాల మండపంలో సంప్రదాయ బద్ధంగా జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బందం ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి 12వ సేవలు ఘనంగా జరిపారు. ఈఏడాది ప్రత్యేకంగా తాత్కాలిక కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. వచ్చే ఏడాదికి కోనేరు నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, ట్రస్ట్ బోర్డు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను అలరించాయి. ఎడ్లపూటీలాగుడు జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామవర ప్రసాదరావు, ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలక వర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, కుంభగిరి వెంకటకష్ణ, తోటకూర వీరప్రసాద్, కూరాకుల వెంకటకష్ణ, సంకా రాధాకష్ణ, సోలా వెంకట నరసింహారావు, భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

హెచ్‌ఎం, ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.సురేష్, శివకుమారిని సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అంతర్గత కలహాలతో విద్యార్థులను నిర్లక్ష్యం చేయడం, పరీక్షలకు సన్నద్ధం చేయకపోవడం, గత ఏడాది జరిగిన, ఈ సంవత్సరం నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు వెనుకబడి ఉండటం, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో వారిపై చర్యలు తీసుకున్నట్లు కృష్ణా డీఈఓ తాహెరా సుల్తానా తెలిపారు. పాఠశాల విద్యార్థుల విద్యాబోధనకు ఆటంకం లేకుండా వేరే ఉపాధ్యాయులను వర్క్ సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓను ఆదేశించినట్లు చెప్పారు. గత నెల 8వ తేదీన పాఠశాలలో కంప్యూటర్ నుంచి ప్రింట్ తీసుకునే విషయంపై వివాదం తలెత్తి ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా చీలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ వ్యవహారాన్ని విద్యాశాఖ తీవ్రంగా పరిగణించింది. ఆ శాఖ ఏడీ అజీజ్, ఏఎస్‌ఓ అశోక్, కంకిపాడు, గన్నవరం ఎంఈఓలు కనకమహాలక్ష్మి,శ్రీనివాస్ పాఠశాలలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం, ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది.

ఇది పరీక్షాసమయం..!

15 నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏప్రిల్ 3 నుంచి 'పది' పరీక్షలు
- ఉత్తమ ఫలితాల సాధనపై కలెక్టర్ దృష్టి



చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థులకు ఇది పరీక్షా సమయం.. పదో తరగతి విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు దగ్గరపడటంతో విద్యార్థులు రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. మరో పక్క పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

15 నుంచి ఇంటర్ పరీక్షలు..

జిల్లాలో మార్చి 15 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షకు 20,530 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 12,318 మంది విద్యార్థినిలు, 8,212 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రెండో సంవత్సరం 16,947 మంది పరీక్ష రాయనుండగా వీరిలో 10,260 మంది విద్యార్థినిలు, 6,757 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పరీక్షలు..

జిల్లాలో ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 143 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 22,367 మంది విద్యార్థులు హాజరవుతుండగా వీరిలో 12,031 మంది విద్యార్థులు, 10,336 మంది విద్యార్థినిలు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 19,866 మంది, ప్రైవేటు విద్యార్థులు 2,501 మంది ఉన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరగనుంది.

ఉత్తమ ఫలితాలపై కలెక్టర్ దిశా నిర్దేశం..

పరీక్షా ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రత్యేక దృష్టి సారించారు. తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేస్తున్నారు. రాష్ట్రంలో కృష్ణాజిల్లా అత్యుత్తమ స్థానం సాధించేలా అధికారులు కృషి చేయాలన్నారు. మంచి గ్రేడ్‌లు సాధించేలా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపేలా ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకాలు ఇవ్వాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకునేలా చూడాలని ఆర్ఐవోకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్దకు ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి..



ఆరోగ్యంగా ఉండి విద్యార్థులు చదువుపై దృష్టిసారించేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. జిల్లా పరిషత్ సహకారంతో స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను ముందుగానే అందజేశాం. ఇప్పటికే నాలుగు సార్లు రివిజన్ పరీక్షలు నిర్వహించాం. మంచి ఫలితాలు సాధిస్తాం.

–తాహెరా సుల్తానా, డీఈవో

కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం..



ఇంటర్ పరీక్షల సమాచారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. విద్యార్థులు, తల్లిదండ్రులు వారి అనుమానాలను కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నాం. కానూరులోని ఆర్ఐవో కార్యాలయం, తాడేపల్లిలోని ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయం ద్వారా సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తాం. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

–పి.రవికుమార్, ఆర్ఐవో

ఉపాధి పని దినాల లక్ష్యం సాధిస్తాం..



కొత్తపేటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సునీత

కొత్తపేట(కంచికచర్ల): ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 64.30 లక్షల పనిదినాలు కల్పించామని, ఈనెలాఖరులోగా 77లక్షల పనిదినాలు కల్పించాలన్న లక్ష్యాన్ని సాధిస్తామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జే సునీత పేర్కొన్నారు. మండలంలోని కొత్తపేటలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులతో పాటు చెత్త సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నామన్నారు. అమృత సరోవర్ పథకం కింద జిల్లాలో 36 చెరువులను అభివృద్ధి చేయటంతో పాటు మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, పంట కాల్వలు, పంట బోదెలు, డొంక రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. కందకాలు తవ్వటం వంటి పనులు కూడా చేపట్టామన్నారు. కూలీలకు వారి చేసిన పనుల ఆధారంగా రోజుకు సగటున రూ.257 వేతనం లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనిచేసిన దినాలకు ఎప్పటికప్పుడు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పంటలకు మొక్కల పెంపకానికి వర్మీ కంపోస్టు వినియోగిస్తున్నామని అన్నారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించే సమయంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పారిశుధ్య కార్మికులకు, క్లాప్ మిత్రలకు ఇప్పటికే తెలియజేశామని పేర్కొన్నారు. జిల్లాలో 288 గ్రామ పంచాయతీల్లో 265 ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డుల నిర్మాణాలను పూర్తిచేసి సమర్థవంతంగా పని చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. మరో 23 షెడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే బాలశంకరరావు, ఏపీఓ అరిగెల శరత్, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లేపల్లి సంగమేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్, మేట్‌లు, కూలీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు.. స్కూటీ ఢీ

- ఇద్దరు యువకులు దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



దేవళ్ల నాగరాజు(ఫైల్)



శేషపు రవి (ఫైల్)

నున్న (విజయవాడరూరల్): ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ పరిధిలోని నున్న గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్‌నగర్ లూనా సెంటర్‌కు చెందిన దేవళ్ల నాగరాజు (36), షేక్ యూసఫ్ బాషా (23), బావాజీపేటకు చెందిన శేషపు రవి (36) ముగ్గురూ భవన నిర్మాణాల్లో టైల్స్ పని చేస్తుంటారు. శనివారం ఉదయం పనికి వెళ్లిన ఈ ముగ్గురూ సాయంత్రం ఒకే స్కూటీపై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ–నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డులో నున్న గ్రామం పారగాన్ చెప్పుల కంపెనీ సమీపంలోకి రాగానే విసన్నపేట వెళుతున్న ఆర్టీసీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు ఎదురుగా వస్తున్న స్కూటీ వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న నాగరాజు, రవి అక్కడికక్కడే మృతి చెందారు. యూసఫ్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాషా పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. నాగరాజు భార్య అనంత కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.



పృథ్వీరాజ్‌కు కాంస్యం

దోహాలో జరుగుతున్న వరల్డ్ కప్ షాట్‌గన్ షూటింగ్‌లో భారత ఆటగాడు పృథ్వీరాజ్ కాంస్య పతకం గెలుచుకున్నాడు. పురుషుల ట్రాప్ ఈవెంట్ ఫైనల్లో అతను 20 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో ఒగుజాన్ టుజున్ (టర్కీ–33 పాయింట్లు), కోవార్డ్ హోలీ (బ్రిటన్–30 పాయింట్లు)కు స్వర్ణ, రజతాలు దక్కాయి. మరో వైపు మహిళల విభాగంలో శ్రేయాన్సి సింగ్ పతకావకాశాలు కోల్పోయింది. సెమీఫైనల్‌కు అర్హత సాధించిన శ్రేయాన్సియ ఆ పై ముందంజ వేయడంలో విఫలమైంది.

ఐపీఎల్‌కు జాయ్ రిచర్డ్సన్ దూరం



ఆస్ట్రేలియా పేస్ బౌలర్ జాయ్ రిచర్డ్సన్ గాయం కారణంగా ఈ సీజన్ ఐపీఎల్‌నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న అతను శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఇప్పటికే రిచర్డ్సన్ భారత్‌తో వన్డే సిరీస్‌కు కూడా దూరమయ్యాడు. 2023 సీజన్‌లో అతను ముంబై ఇండియన్స్ తరఫున బరిలోకి దిగాల్సింది. ఐపీఎల్‌లో అతను గత ఏడాది పంజాబ్ కింగ్స్ తరఫున ఆడాడు. రిచర్డ్సన్ 36 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆసీస్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

చెలరేగిన మరిజన్, షఫాలీ


మరిజన్

- ఢిల్లీ మెరుపు విజయం
- 10 వికెట్లతో గుజరాత్ చిత్తు

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అసాధారణ విజయం సాధించింది. బౌలింగ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజన్ కాప్ (5/15), బ్యాటింగ్‌లో షఫాలీ వర్మ (28 బంతుల్లో 76 నాటౌట్; 10 ఫోర్లు, 5 సిక్సర్లు) చెలరేగారు. దీంతో ఢిల్లీ 10 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై జయభేరి మోగించింది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. లోయర్ ఆర్డర్‌లో కిమ్ గార్త్ (37 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు) ఇన్నింగ్స్ టాప్ స్కోరర్‌గా నిలిచింది. హర్లీన్ డియోల్ (14 బంతుల్లో 20; 4 ఫోర్లు), జార్జియా వేర్‌హామ్ (25 బంతుల్లో 22; 2 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడారు. ఢిల్లీ మీడియం పేసర్ మరిజన్ (4–0–15–5) బెంబేలెత్తించింది. శిఖాపాండేకు 3 వికెట్లు దక్కాయి. బ్యాటింగ్ ఆర్డర్‌లోని తొలి 4 వికెట్లను మరిజనే పడగొట్టింది. దీంతో 28 పరుగులకే గుజరాత్ 5 వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ వికెట్ నష్టపోకుండా కేవలం 7.1 ఓవర్లలో 107 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు షఫాలీ, కెప్టెన్ మెగ్ లానింగ్ (15 బంతుల్లో 21 నాటౌట్; 3 ఫోర్లు) అజేయమైన ఓపెనింగ్ భాగస్వామ్యంతో జట్టుకు అలవోక విజయం అందించారు. గార్డ్‌నెర్ వేసిన 4వ ఓవర్లో షఫాలీ, లానింగ్ కలిసి 4, 4, 6, 1, 4, 4లతో 23 పరుగులు రాబట్టడం విశేషం. షఫాలీ 19 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది.


షఫాలీ

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై X యూపీ వారియర్స్
రాత్రి గం. 7:30 నుంచి
స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

డరైల్ మిచెల్ సెంచరీ



క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ అనూహ్యంగా స్వల్ప ఆధిక్యం అందుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 162/5తో ఆట కొనసాగించిన కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 373 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ఆ జట్టుకు 18 పరుగుల ఆధిక్యం దక్కింది. డరైల్ మిచెల్ (193 బంతుల్లో 102; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, మాట్ హెన్రీ (75 బంతుల్లో 72; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. అసిత ఫెర్నాండో 4 వికెట్లు పడగొట్టగా, లహిరు కుమారకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం శ్రీలంక మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. ఏంజెలో మాథ్యూస్ (20 బ్యాటింగ్), ప్రభాత్ జయసూర్య (2 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ప్రస్తుతం లంక 65 పరుగులు మాత్రమే ముందంజలో ఉన్న నేపథ్యంలో మ్యాచ్ ఆసక్తికర స్థితికి చేరింది.

ఫైనల్లో అంకితా రైనా

బెంగళూరు: ఐటీఎఫ్ మహిళల ఓపెన్ టోర్నీలో భారత అమ్మాయి, నాలుగో సీడ్ అంకితా రైనా ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో అంకిత 6–1, 6–1 స్కోరుతో భారత్‌కే చెందిన రుతుజ భోస్లేపై ఘనవిజయం సాధించింది. నేడు జరిగే ఫైనల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన టాప్ సీడ్ బ్రెండా ఫ్రుహ్‌విర్టోవాతో తలపడుతుంది. సెమీస్‌లో 15 ఏళ్ల ఫ్రుహ్‌విర్టోవా 7–6 (7/2), 6–2 తేడాతో దలీలా జకుపోవిచ్ (చెక్ రిపబ్లిక్)ను ఓడించింది. ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్‌లో భాగంగా ఈ టోర్నమెంట్ జరుగుతోంది.

భారత అమ్మాయిల ఓటమి

వైట్ ట్రి సిటీ (వియత్నాం): ఆసియాన్ కప్ అండర్–20 మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయింట్ టోర్నమెంట్‌లో భారత్ కథ ముగిసింది. రెండో రౌండ్ చేరేందుకు తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించలేకపోయింది. ఆతిథ్య వియత్నాంతో జరిగిన ఈ పోరును భారత్ 1–1తో డ్రా చేసుకుంది. భారత్ తరఫున బాబినా దేవి 12వ నిమిషంలో, వియత్నాం తరఫున ట్రాన్ హట్ 45+2వ నిమిషంలో గోల్స్ చేశారు. ఇరు జట్లు 3 మ్యాచ్‌ల తర్వాత 7 పాయింట్లతో సమంగా ఉన్నా... వియత్నాంతో పోలిస్తే గోల్ వ్యత్యాసంలో ఒక గోల్ తక్కువగా ఉన్న భారత్ నిష్క్రమించింది.

దక్షిణాఫ్రికా ఘన విజయం

జొహన్నెస్‌బర్గ్: వెస్టిండీస్‌లో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2–0తో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం ముగిసిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 284 పరుగుల భారీ తేడాతో విండీస్‌పై ఘన విజయం సాధించింది. 391 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 35.1 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. జోషువా డి సిల్వ (34)దే అత్యధిక స్కోరు. సఫారీ బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ, సైమన్ హార్మర్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... రబడ, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అంతకు ముందు 287/7తో నాలుగో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 321 పరుగులకు ఆలౌటైంది. బవుమా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవగా, ఎయిడెన్ మార్క్‌రమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 87 పరుగుల తేడాతో నెగ్గింది.

శుబ్‌మన్ వంతు


- శతకం బాదిన గిల్
- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 289/3
- రాణించిన కోహ్లి
- బోర్డర్ గావస్కర్ ట్రోఫీ చివరి టెస్టు


గిల్

అహ్మదాబాద్: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆఖరి టెస్టు పరుగుల కరువును తీర్చడమే కాదు... సెంచరీల దరువుతో సాగుతోంది. మోదీ స్టేడియంలో వరుసగా మూడో రోజూ శతకం నమోదైంది. భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (235 బంతుల్లో 128; 12 ఫోర్లు, 1 సిక్స్) మూడంకెల స్కోరు చేయడంతో భారత్ దీటైన జవాబిస్తోంది. శనివారం ఆట నిలిచే సమయానికి టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 99 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. ఇంకా 191 పరుగులు వెనుకబడినప్పటికీ భారత్ చేతిలో 7 వికెట్లుండటం సానుకూలాంశం. అన్నింటికి మించి చాన్నాళ్ల తర్వాత విరాట్ కోహ్లి (128 బంతుల్లో 59 బ్యాటింగ్; 5 ఫోర్లు) టెస్టుల్లో అర్ధసెంచరీతో ఆకట్టుకోవడం భారత శిబిరంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

రోహిత్ నిరాశ

ఓవర్‌నైట్ స్కోరు 36/0తో ఆట కొనసాగించిన భారత ఇన్నింగ్స్‌ను ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓపెనర్లు రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ 11 ఓవర్లపాటు నడిపించారు. అయితే క్రీజ్‌లో నిలదొక్కుకొని భారీ స్కోరు చేసేలా కనిపించిన దశలో కెప్టెన్ రోహిత్ (58 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) అప్పటి నిరాశగా పెవిలియన్ చేరాడు. కునెమన్ ఈ ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని విడదీశాడు. తర్వాత గిల్, పుజారా కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. 90 బంతుల్లో గిల్ అర్ధసెంచరీ పూర్తయింది. కెప్టెన్ స్మిత్ స్పిన్నర్లు, పేసర్లను అదేపనిగా మార్చినా లాభం లేకపోయింది. 129/1 స్కోరు వద్ద లంచ్ విరామానికి వెళ్లగా, తొలిసెషన్‌లో భారత్ వికెట్ నష్టానికి 93 పరుగులు చేయగలిగింది.


కోహ్లి

కోహ్లి అర్ధసెంచరీ

క్రీజులో పాతుకుపోయినప్పటికీ పుజారాతో పాటు శుబ్‌మన్ కూడా అనవసర షాట్ల జోలికెళ్లకుండా బ్యాటింగ్ చేశారు. ఈ సెషన్‌లో ఇద్దరు నింపాదిగా ఆడటంతో పరుగుల వేగం మందగించింది. కానీ ఆసీస్ శిబిరాన్ని గిల్–పుజారా జోడి నిరాశలో ముంచింది. ఇదే క్రమంలో గిల్ 194 బంతుల్లో టెస్టుల్లో రెండో శతకాన్ని సాధించాడు. ఈ ఏడాది జోరుమీదున్న గిల్ ఈ రెండున్నర నెలల్లోపే ఐదో సెంచరీ (మూడు ఫార్మాట్‌లలో కలిపి) సాధించడం విశేషం. మరో వైపు పుజారా (121 బంతుల్లో 42; 3 ఫోర్లు) అర్ధ సెంచరీకి చేరువవుతున్న దశలో మర్ఫీ అతన్ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. పుజారా రివ్యూ చేసినా లాభం లేకపోయింది. దీంతో రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కోహ్లి క్రీజులోకి రాగా 188/2 స్కోరు వద్ద టీ బ్రేక్‌కు వెళ్లారు. ఆ తర్వాత ఆఖరి సెషన్‌లో గిల్, కోహ్లిలు తమదైన శైలిలో ఆస్ట్రేలియా బౌలర్లను ఎదుర్కొన్నారు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 58 పరుగులు జతచేశాక జట్టు స్కోరు 245 పరుగుల వద్ద లయన్... శుబ్‌మన్ సుదీర్ఘ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అతన్ని ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. గిల్ నిష్క్రమించినప్పటికీ మూడో సెషన్‌లో భారత్‌కు ఇబ్బంది ఎదురు కాలేదు. జడేజా, కోహ్లిల జోడీ కుదురుకోవడంతో ఈ సెషన్‌లోనే 101 పరుగులు వచ్చాయి. ఈ క్రమంలోనే విరాట్ 107 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. గతేడాది దక్షిణాఫ్రికా పర్యటనలో అర్ధసెంచరీ తర్వాత మళ్లీ ఇంతకాలానికి అతను ఫిఫ్టీ బాదాడు. ఈ 14 నెలల వ్యవధిలో ఇంటా బయటా 8 టెస్టులాడిన విరాట్ చెప్పుకోదగ్గ స్కోరు చేయలేకపోయాడు. ఆట నిలిచే సమయానికి కోహ్లి, జడేజా (16 బ్యాటింగ్; 1 సిక్స్) క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 480

భారత్ తొలి ఇన్నింగ్స్: రోహిత్ (సి) లబుషేన్ (బి) కునెమన్ 35; గిల్ (ఎల్బీ) (బి) లయన్ 128; పుజారా (ఎల్బీ) (బి) మర్ఫీ 42; కోహ్లి బ్యాటింగ్ 59; జడేజా బ్యాటింగ్ 16; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (99 ఓవర్లలో 3 వికెట్లకు) 289. **వికెట్ల పతనం:** 1–74, 2–187, 3–245. **బౌలింగ్:** స్టార్క్ 17–2–74–0, గ్రీన్ 10–0–45–0, లయన్ 37–4–75–1, కునెమన్ 13–0–43–1, మర్ఫీ 22–6–45–1.

సినిమా

ఆస్కారం ఎవరికంటే..

- 'నాటు నాటు..'కి చాన్స్ ఎక్కువ



ఆస్కార్ సంబరానికి సమయం ఆసన్నమైంది. ఈ నెల 12న (భారతీయ కాలమానం ప్రకారం 13వ తేదీ) లాస్ ఏంజిల్స్‌లో 95వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనున్న సంగతి తెలిసిందే. 23 విభాగాల్లో విజేతలను ప్రకటిస్తారు. ఆస్కార్ రేస్‌లో ఉన్న చిత్రాల్లో 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం అత్యధికంగా 11 నామినేషన్స్‌ను దక్కించుకుంది. ఆ తర్వాత 'ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్', 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్' చిత్రాలు తొమ్మిది నామినేషన్స్‌తో పోటీలో ఉన్నాయి. కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి వంటి విభాగాలతో పాటు బెస్ట్ ఒరిజినల్ సాంగ్‌కు నామినేట్ అయిన 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు' పాట గురించి కూడా హాలీవుడ్‌లో జోరుగా చర్చ జరుగుతోంది. అవార్డు దక్కే ఆస్కారం ఎక్కువగా ఎవరికి ఉంది? అంటూ హాలీవుడ్ చేస్తున్న విశ్లేషణలోకి వెళదాం.

ఉత్తమ చిత్రం

బెస్ట్ మూవీ విభాగంలో 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్', 'ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్', 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్', 'అవతార్: ది వే ఆఫ్ వాటర్', 'టాప్‌గన్: మ్యావరిక్', 'ఎల్విస్', 'ది ఫేబుల్‌మ్యాన్స్', 'టార్', 'ట్రయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్', 'ఉమెన్ టాకింగ్' ఇలా మొత్తం పది చిత్రాలు బరిలో ఉన్నాయి. కాగా 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రానికే అవార్డు దక్కే ఆస్కారం ఉందనే టాక్ బలంగా వినిపిస్తోంది. 28వ క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్, 29వ యాన్యువల్ స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ అవార్డ్స్, 38వ ఫిల్మ్ ఇండిపెండెంట్ స్పిరిట్ అవార్డ్స్ ప్రదానోత్సవాల్లో 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' ఉత్తమ చిత్రం విభాగంలో విజేతగా నిలిచింది. అలాగే ఇతర విభాగాల్లో 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్, 76వ బాఫ్తా అవార్డ్స్‌లో ఈ చిత్రం అవార్డులను సాధించి, ఆస్కార్ కమిటీ దృష్టిని ఆకర్షించింది. చైనా నుంచి అమెరికాకు వలస వచ్చి, లాండ్రీ షాపు పెట్టుకున్న ఓ కుటుంబం అనుకోని ప్రమాదాల నుంచి ఎలా బయటపడింది? అన్నదే ఈ చిత్రకథ. డేనియల్ క్వాన్, డేనియల్ స్కీనెర్ట్ దర్శకత్వంలో ఆంథోనీ రుస్సో, జో రుస్సో, మైక్ లరోకా, జోనాథన్ వాంగ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మిచెల్ యోహ్, స్టెఫానీ హ్సు, కే హుయ్ క్వాన్ ముఖ్య తారలు.

ఉత్తమ దర్శకుడు

ఉత్తమ దర్శకుడి విభాగంలో మార్టిన్ మెక్‌డొనాగ్ (ది బన్షీష్ ఆఫ్ ఇనిషెరిన్) డానియల్ క్వాన్, డానియెల్ స్కీనెర్ట్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), స్టీవెన్ స్పీల్‌బర్గ్ (ది ఫేబుల్ మ్యాన్స్), రూబెన్ ఆస్టాండ్ (ట్రయాంగిల్ ఆఫ్ సాడ్‌నెస్) టడ్ ఫీల్డ్ (టార్) పోటీ పడుతున్నారు. కాగా డానియల్ క్వాన్, డానియేల్ స్కీనెర్ట్‌లు ఉత్తమ దర్శకులుగా అవార్డు తీసుకెళ్తారని టాక్. 28వ క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్‌లో క్వాన్, స్కీనెర్ట్ అవార్డు సాధించారు.


క్వాన్, స్కీనెర్ట్

ఉత్తమ నటుడు

ఉత్తమ నటుడి విభాగంలోని అవార్డు కోసం ఆస్టిన్ బట్లర్ (ఎల్విస్), కొలిన్ ఫారెల్ (ది బన్షీష్ ఆఫ్ ఇని షెరిన్), బ్రెండన్ ఫ్రాసెర్ (ది వేల్), బిల్ నిగీ (లివింగ్), పాల్ మెస్కల్ (ఆఫ్టర్‌సన్) పోటీ పడుతున్నారు. అయితే ఎక్కువ పోటీ మాత్రం 'ఎల్విస్' చిత్రంలో అద్భుతమైన నటన కనబరిచిన ఆస్టిన్ బట్లర్, 'ది వేల్' చిత్రంతో ప్రేక్షకులను కట్టిపడేసిన బ్రెండెన్ ఫ్రాసెర్‌ల మధ్య కనిపిస్తోంది. ఇక ఇటీవల జరిగిన క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్‌లో బెస్ట్ యాక్టర్‌గా బ్రెండన్ ఫ్రాసెర్ అవార్డును కొల్లగొట్టగా, 80వ గోల్డెన్ గ్లోబ్, 76వ బాఫ్తా అవార్డ్స్‌లో ఉత్తమ నటుడిగా ఆస్టిన్ బట్లర్ నిలిచారు. దీన్ని బట్టి ఆస్టిన్ బట్లర్‌కే ఉత్తమ నటుడి అవార్డు దక్కే అవకాశం కనిపిస్తోంది. అమెరికన్ రాక్ అండ్ రోల్ మ్యూజిక్ సింగర్, యాక్టర్ ఎల్విస్ ప్రెస్లీ జీవితం ఆధారంగా రూపొందిన 'ఎల్విస్'లో టైటిల్ రోల్‌లో తన నటనతో వావ్ అనిపించారు ఆస్టిన్ బట్లర్. ఈ చిత్రానికి బాజ్ లుహర్మాన్ దర్శకుడు.


ఆస్టిన్

ఉత్తమ నటి

ఉత్తమ నటి విభాగంలో అవార్డు కోసం పోటీలో ఉన్న 'అన్నా దె అర్మాస్' (బ్లాండ్), 'ఆండ్రియా రైజ్‌బరో' (టు లెస్లీ), 'మిషెల్ యో' (ఎవ్రీథింగ్ ఎవ్రీ వేర్ ఆల్ ఎట్ వన్స్), 'మిషెల్ విలియమ్స్' (ది ఫేబుల్ మ్యాన్స్) లను దాటుకుని 'కేట్ బ్లాంచెట్' (టార్) విజేతగా నిలిచే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్, గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్, బాఫ్తా అవార్డ్స్ ప్రదానోత్సవాల్లో ఉత్తమ నటిగా 'కేట్ బ్లాంచెట్' అవార్డులు అందుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోగల ప్రతిభ ఉన్న ఓ మహిళా సంగీత విద్వాంసురాలు జీవితంలో ఎదుగుతున్న సమయంలో ఆమెకు వ్యతిరేకంగా ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? ఎలాంటి లైంగిక వేధింపులను ఎదుర్కోవలసి వచ్చింది? వాటిని ఆమె ఎలా అధిగమించారు? అన్నదే 'టార్' సినిమా కథాంశం. మహిళా విద్వాంసురాలిగా కేట్ బ్లాంచెట్ అద్భుతంగా నటించారు. ఈ సినిమాకు టాడ్ ఫీల్డ్ దర్శకుడు.


కేట్ బ్లాంచెట్

లైవ్ ఎన్ని గంటలకు అంటే...

సోమవారం ఉదయం 5 గంటల 30 నిమిషాల నుంచి భారతీయులు ఆస్కార్ అవార్డు వేడుకను వీక్షించవచ్చు. అవార్డు వేడుక లాస్ ఏంజిల్స్‌లో ఆదివారం రాత్రి 8 గంటలకు ఆరంభమయ్యే రెండు గంటల ముందు రెడ్ కార్పెట్ సందడి షురూ అవుతుంది. వేడుక దాదాపు 11 గంటలకు ముగిసే అవకాశం ఉంది. భారతీయ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 5 గంటల 30 నిమిషాల నుంచి వేడుకను వీక్షించవచ్చు. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్, ఏబీసీ నెట్‌వర్క్ (ఏబీసీ టీవీ, ఏబీసీ.కామ్, ఏబీసీ యాప్, యూట్యూబ్) హులు లైవ్ టీవీ, డైరెక్ట్ టీవీ, ఫ్యూబో టీవీ, ఏటీ అండ్ టీ టీవీలో ఆస్కార్ అవార్డుల వేడుకను ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడవచ్చు. అయితే కొన్నింటికి సబ్‌స్క్రిప్షన్ అవసరమవుతుంది.


ఆస్కార్‌లో భారత్


ఎన్టీఆర్, రామ్‌చరణ్

ఈ ఏడాది దేశం నుంచి మూడు విభాగాల్లో (బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్) నామినేషన్స్ దక్కాయి. ఈ మూడు విభాగాల్లోనూ అవార్డులు రావాలని భారతీయ సినీ ప్రేమికులు కోరుకుంటున్నారు. ఇక బరిలో ఉన్న ఈ మూడు విభాగాల విశేషాల్లోకి వస్తే...

నాటు నాటు..కే అవార్డు?

'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఐదు పాటలు బరిలో ఉన్నాయి. వీటిలో 'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు..' పాటకు అవార్డు వస్తుందని హాలీవుడ్ మీడియా జోస్యం చెబుతోంది. ఇప్పటికే 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో, 28వ క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్‌లో 'బెస్ట్ సాంగ్'గా 'నాటు నాటు..' నిలిచింది. హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ తదితర అవార్డ్స్‌లోనూ అవార్డులు గెల్చుకుంది. కీరవాణి స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ పాడిన సంగతి తెలిసిందే. ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రఫీ చేశారు. 'నాటు నాటు'తో పాటు 'టెల్ ఇట్ లైక్ ఏ ఉమెన్'లోని 'అప్లాజ్', 'బ్లాక్ పాంథర్: వకాండ ఫరెవర్'లోని 'లిఫ్ట్ మీ అప్', 'ఎవ్రీథింగ్ ఎవ్రీ వేర్ ఆల్ ఎట్ వన్స్'లోని 'దిస్ ఈజ్ ఏ లైఫ్', 'టాప్‌గన్: మ్యావరిక్' చిత్రం నుంచి 'హోల్డ్ మై హ్యాండ్' పాటలు నామినేషన్స్ దక్కించుకున్నాయి. ఒకవేళ 'నాటు నాటు..' పాటకు అవార్డ్ వస్తే భారతీయులకు పండగే పండగ.


ఆల్ దట్ బ్రీత్స్

గాయపడ్డ పక్షుల కోసం...

బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో శౌనక్ సేన్ దర్శకత్వం వహించిన ఇండియన్ డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్' నామినేషన్ దక్కించుకుంది. గాయపడిన పక్షుల సంరక్షణ కోసం ఢిల్లీకి చెందిన సోదరులు నదీమ్ షెహజాద్, మహమ్మద్ సాద్ తమ జీవితాలను ఏ విధంగా త్యాగం చేశారు? అన్నదే ఈ డాక్యుమెంటరీ ప్రధాన కథాంశం. గత ఏడాది 75వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఆల్ దట్ బ్రీత్స్' గోల్డెన్ ఐ అవార్డును సాధించింది. ఇక ఇదే విభాగంలో అమెరికన్ 'ఫైర్ ఆఫ్ లవ్', రష్యా 'నవల్నీ', 'ఎ హౌస్ మేడ్ ఆఫ్ స్ప్లింటర్స్', 'ఆల్ ది బ్యూటీ అండ్ ది బ్లడ్ షెడ్' పోటీలో ఉన్నాయి.

తప్పిపోయిన ఏనుగు

తప్పిపోయిన ఓ ఏనుగును గిరిజన దంపతులు ఏ విధంగా పెంచి పోషించారు? ఈ క్రమంలో వారికి ఆ ఏనుగుతో ఎలాంటి అనుబంధం ఏర్పడింది? అనే అంశాల నేపథ్యంలో భారతీయ దర్శకురాలు కార్తికి గోన్సాల్వేస్ రూపొందించిన డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ 'ది ఎలిఫెంట్ విష్పరర్స్'. బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్ విభాగంలో నామినేషన్ దక్కించుకున్న 'ది ఎలిఫెంట్ విష్పరర్స్'తో పాటు 'హాలౌట్', 'హౌ డు యు మెసర్ ఎ ఇయర్', 'ది మార్తా మిచెల్ ఎఫెక్ట్', 'స్ట్రేంజర్ ఎట్ ది గేట్' పోటీలో ఉన్నాయి.


ది ఎలిఫెంట్ విష్పరర్స్

లైవ్‌లో నాటు.. నాటు

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు..' పాటను కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడనున్నారు. ఈ పాటకు తాను కూడా లైవ్‌లో పెర్ఫార్మ్ చేయనున్నట్లు అమెరికన్ యాక్ట్రస్, డ్యాన్సర్ లారెన్ గాట్లీబ్ వెల్లడించారు. కాగా హిందీలో 'ఏబీసీడీ', 'ఏబీసీడీ 2' వంటి చిత్రాల్లో నటించారామె.

ప్రీ ఆస్కార్ పార్టీ

అమెరికాలో ప్రీ ఆస్కార్ పార్టీ అదిరిపోయే లెవల్‌లో జరిగింది. ఈ పార్టీలో ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో పాటు ప్రియాంకా చోప్రా, ప్రీతి జింతా తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


లారెన్ గాట్లీబ్

పాట చాలా బాగుంది – నాగచైతన్య

తేజ్ బొమ్మదేవర, రిషికా లోక్రే జంటగా బొమ్మదేవర రామచంద్రరావు స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న సినిమా 'మాధవే మధుసూదన'. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'హోయ్.. అలాంటి అందం ఇలాంటి నేల మీద ఎలాగు పుట్టినాదో. ఏమో ఏమిటో...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను హీరో నాగచైతన్య విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''ఈ పాట చాలా బాగుంది. తేజ్‌కు కంగ్రాట్స్. మంచి ఎమోషనల్ లవ్‌స్టోరీగా రూపొందిన ఈ సినిమా విజయం సాధించాలి. చంద్ర అండ్ టీమ్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. వికాస్ బాడిస స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు.


నాగచైతన్య, తేజ్

అవకాశం రావడమే సక్సెస్ – దీక్షిత్ శెట్టి

''సినిమాలకు ఇప్పుడు భాష లేదు. 'ఆర్‌ఆర్‌ఆర్', 'పుష్ప', 'కేజీఎఫ్' వంటి సినిమాలను ఇండియన్ సినిమాల్లానే సెలబ్రేట్ చేసుకుంటున్నాం'' అన్నారు కన్నడ యాక్టర్ దీక్షిత్ శెట్టి. నాని, కీర్తి సురేష్ హీరో హీరోయిన్లుగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన సినిమా 'దసరా'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో ఓ కీ రోల్ చేసిన దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో ధరణి (నాని పాత్ర పేరు) క్లోజ్ ఫ్రెండ్ సూరి పాత్రలో కనిపిస్తాను. మంచి కథకు అన్ని అంశాలు మిళితమై ఉన్న మంచి వినోదాత్మక చిత్రం 'దసరా'. ఇలాంటి సినిమాలో భాగం కావడం హ్యాపీగా ఉంది. ఈ సినిమాలో నటించే అవకావం రావడాన్నే నేను ఒక సక్సెస్‌లా భావిస్తున్నాను. నానీగారి నుంచి చాలా నేర్చుకున్నాను. నన్ను నమ్మి చాన్స్ ఇచ్చిన సుధాకర్‌గారికి రుణపడి ఉంటాను'' అన్నారు.



గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



రాజులు/41/5'5"/B.Sc, ఫెయిర్, మేనేజర్ 11L. PA, Hydలో సొంత ఇల్లు వరునికి, రాజులు 1వ, 2వ. బ్రాహ్మణ, కమ్మ, కాపు, పద్మశాలి, అగ్రకుల క్షత్రియ 1వ వధువు కావలెను. డైరెక్ట్: 8885861136 [HA-10368]

రెడ్డి/USA అబ్బాయిలు 29, సాఫ్ట్‌వేర్. 41, లేట్ పెళ్లి. *లోకల్ సాఫ్ట్‌వేర్, బిజినెస్ అన్ని వయస్సుల ఫస్ట్, సెకండ్, లేట్ Matches కలవు. Contact: 6304826162 (*మీ పెళ్లి మా బాధ్యత*) [HA-10368]

యాదవ/M.Tech/C.Govt. Asst Engineer (HPCL)/ 1Lakh / PM / 5'8" ఎత్తు/28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8008965895 [HA-10369]

మాల క్రిస్టియన్/M.Tech/C.Govt. Asst Manager (Union Bank) / PM / 5'8" ఎత్తు/28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10369]

మాల హిందూ/M.Tech/C.Govt. Asst Engineer(IOCL)/80,000 PM/ 5'8" ఎత్తు/28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9866034870 [HA-10369]

హిందుమాల/కట్నం ప్రసక్తిలేదు/ M.Tech/ C.Govt. Jr. ఇంజనీర్/ రైల్వే/ 70,000/-pm/ 5'8" ఎత్తు/ 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13705]

ముదిరాజ్/కట్నం ప్రసక్తిలేదు/ B.Tech/ Govt. AE/ ఇరిగేషన్ Dept./ 85,000/-pm/ 5'9" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13705]

SC హిందుమాదిగ/B.Tech/ C. Govt. ఇన్‌స్పెక్టర్/ ఎక్సైజ్ Dept./ 65,000/-pm/ 5'11" ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10365]

క్రిస్టియన్ మాల/M.Tech / C. Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్/ BHEL/ 85,000/-pm/ 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10365]

SC మాల & క్రిస్టియన్/కట్నం ప్రసక్తి లేదు / B.Tech(EEE)/C.Govt.Jr. ఇంజనీర్/ రైల్వే/ 80,000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. Ph: 9676995093 [HA-13709]

నాయిబ్రాహ్మణ/B.Tech/ C.Govt.Asst. మేనేజర్ /ఆంధ్రాబ్యాంక్ /68000/-PM/5'10" ఎత్తు / 28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9515942275 [HA-13709]

SC మాదిగ/ఏకైక కుమారుడు /B.Tech /C. Govt.Sr. ఇన్స్పెక్టర్ / రైల్వే /80,000/-PM/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి అందమైన వధువు కావలెను. Ph: 7032058965 [HA-13709]

SC /30yrs/ 5'7"/ కలర్ : fair/ B.Tech / సాఫ్ట్‌వేర్ జాబ్/85K per Month. Well Settled. వరుడికి అందమైన వధువు కావలెను. No Caste Bar. ఫోన్: 8500427582. [H-793727]

కాపు/60 సం॥/5'7"/M.Sc.,/గవర్నమెంట్ జాబ్ గెజిటెడ్ ఆఫీసర్ నెలకు 1,50,000/- సంపాదించు వరునకు తగిన వధువు కావలెను. బ్రోకర్లు లేరు. ✆ : 95508 95951 [R-1687]

Reddy, Now Hyd-28/5'10"/B.Tech-MS-USA. *32/5'10"/MBBS Residency USA. *28/5'10"/B.Tech IIT-MS-USA-350K/ Rich. Cont: P.P.Reddy-9391198332. [H-792950]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: koreddy43@gmail.com, Facebook.com/koreddymarriagebureau

వధువు కావలెను

Reddy/USA Citizen/Royal Family/ Parents Doctors-USA/BS/MS/USA/ 1999/5'6"/Rich/USA * Cont : K.C. Reddy-Hyd. Ph:9849321309

Reddy/MBBS/Most Beautiful/ 1995/5'7"/10Cr/Need Doctor or Business Boy. *Cont: K.C. Reddy - Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ MBA/Most Beautiful/1999/ 5'2"/ 5Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau Hyd-Road No.3-B.Hills. Ph: 9849321309/ 9347807015

Reddy/BE(BITS PILANI)/MS/Ph.D Most Beautiful/1995/5'1"/150K. * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/MBBS/MS/(Gen-Surg) Most Beautiful/Need Doctor or a good business boy *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Good Business/Very Handsome Boy/B.Tech/1997/6'/100Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau - Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/ MBBS/MD/Hyd/Very Handsome Boy/1995/5'10"/400Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Divorcee/B.Tech/MBA/Job & Business/1994/5'10"/300Cr/50L/M. Rental Income. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/IIT/MS/H1/USA/1992/ 5'11"/495K/10Cr. * Cont : K.C. Reddy-Mar-Bureau-Road No. 3-B.Bhills-Hyd. Ph:9849321309/9347807015

Reddy/USA-Doc / USA - Citizen/ MBBS/ MS (Surgeon)/Very Handsome Boy/1990/6'/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

వరుడు కావలెను

Reddy/Australian/Citizen/Rich Family/BS/MS(USA)/Job USA/Royal Family/1994/5'8"/150K USD *Cont: K.C. Reddy-Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/Now in Hyd-V.Fair/1992/5'9"/185K/50Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/1993/5'3"/1000Cr. *IIT/B.Tech/1994/5'7"/1500Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3-B.Hills-Hyd. Ph: 9849321309

Reddy/BBA/Most Beautiful/ 1997/ 5'4"/100Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3-B.Hills-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/Divorcee/MBBS/USA/Doctor/Most Beautiful/1993/5'8"/40Cr. *Cont: K.C. Reddy- Hyd- Ph: 9849321309/9347807015

Reddy/MBBS/MD/1993/5'7"/100Cr/ Most Beautiful. Needs any well settled. * Cont: K.C. Reddy- Mar-Bureau-Hyd- Ph: 9849321309

Reddy/(Divorcee)Most Beautiful/ B.Tech/MS/1993/5'7"/15Cr-Most Beautiful. *Cont: K.C. Reddy - Hyd-Ph:9849321309/9347807015

Reddy/CATHOLIC/B.Tech/MS/India/1993/5'3"/Beautiful/100Cr-Hyd. *Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/USA-Doctor/Most Beautiful/1992/5'7"/50Cr. *Cont: K.C. Reddy-Marriage Bureau- Hyd-Ph: 9849321309/9347807015

Reddy/ Divorcee / B.Tech / Most Beautiful/1993/5'6"/50Cr. *Cont: K.C. Reddy-Mar-Bureau-Road No.3-B.Hills-Hyd- Ph: 9849321309/9347807015 [D-504]

Reddy, 25 / 5'4" / M.Com. *22/ 5'4" / B.Com. *26 / 5'4"/ B.Tech / SWE-Hyd. Cont: P.P.Reddy-9391198332. [H-792950]

Reddy, 2nd Marriage-42/5'9"/ B.Tech-MS-USA Citizen. *32/5'10"/ B.Tech-MS USA. *32/5'9"/B.Tech-SWE-Hyd. Cont: P.P.Reddy-9391198332. [H-792950]

★★

2nd మ్యారేజ్/విడో/కుల, కట్నం ప్రసక్తిలేని 43/5'8"/B.Tech/SWE/ Hyd/ 60K pm. కోట్ల ఆస్తి గల వరుడికి 2nd మ్యారేజ్ అయినా, లేట్ అయినా వధువు కావలెను. (అర్జెంట్). Ph: 9494252545 [H-793531]

పద్మశాలి, 28సం., 5'11", ఎరుపు, మేనేజర్ HDFC బ్యాంక్, 10L PA, అందమైన యువకునికి 5'3" ఎత్తు తగ్గని అందమైన యువతి కావలెను. సంప్ర॥ 93921 34606, 73828 99350. [B-786514]

డైరెక్ట్ కుల, కట్నం పట్టింపు లేదు. 45Y, B.Tech, 5'9". జాబ్ చేస్తున్న వరునికి విడో, ఒంటరి, లేటు, డైవర్సీ 50 సం. లోపు వధువు కావలెను. ✆ 95533 54288 [B-1234672]

రెడ్డి / వయస్సు : 42, ఎత్తు : 5'11" ఆదాయం 60వేలు (PM) వరుడికి తగిన వధువు కావలెను. కాంటాక్ట్ : 94935 58088, 80749 45158. [NA-5421]

ముస్లిం / వయస్సు: 43 సంవత్సరములు. ప్రైవేట్ జాబ్, 2వ వివాహం వధువు కావలెను. వివరములకు డైరెక్ట్ కాంటాక్ట్ : 94942 98213. [NA-5424]

బ్రాహ్మణ్/ మొదటి పెళ్ళి/B.Sc., B.Ed., స్థిరమైన ఉద్యోగం 30,000/-P.M 5'5" ఎత్తు, 51 సం॥ల వరునకు వధువు కావలెను. ✆ 98495 40225 [R-5722]

(BC) నాయిబ్రాహ్మిన్ /Rtd. ఉప MRO/65+ y/pm. 50వేలు, Well Settled వారికి, ఏ బాధ్యత లేని ఆంధ్రప్రాంతానికి చెందిన 50y పైబడిన (Any) B.C వధువు కావలెను. డైరెక్ట్ Ph: 9110761160, 8886339797 [S-1156468]

వరుడు కావలెను



No Caste bar : 1,2 వ 1కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు, వారికి తగిన వరులు కావలెను ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారికోసం మాత్రమే. Ph: W: 7794960803 [H-796819]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BBA, 25, 5' 10", Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 6'2", SWE, 310 K, H1, 100 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Germany, BE, MS, 28, 6', 84 K Pounds, 15 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 31, 6', 30 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS, 26, 5' 7", SWE, 170 K, 40 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS 27, 5' 7", Analyst, 120 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5' 5", Sr SWE, 16 L P/A, 1.5 Cr, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 8", Accenture, 4 L P/A, 2 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 29, 5' 11", SWE, 130 K, H1B, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5' 8", Engineer, 40 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DNBSS, 27, 6" Doctor, 10 Crores Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", 22 L P/A, 100 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS, 28, 5' 3", SAP Consultant, 20 L P/A, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 3", SWE, 150 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 25, 5' 5", Doctor, 30 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MDS, MPH, 35, 5' 6", 8.5 L P/A, 5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ వయసు: 30/డిగ్రీ/మంచి వ్యాపారములు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా పరవాలేదు) Ph: 9100717575 [HA-10368]

డాక్టర్స్/వధువులు రెడ్డి, కమ్మ, కాపు, అన్ని కులాల వారు ఉన్నారు. మంచి సర్వీస్‌తో తగిన పెళ్లి సంబంధాన్ని సెట్ చేసే డాక్టర్ Marriages. రిజిస్ట్రేషన్ కోసం వాట్సాప్ 6304826162 (ఫస్ట్, సెకండ్, లేట్, ఎన్నారై) [HA-10368]

కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/వయసు:30, ఎత్తు: 5'4" / వధువుకి మంచి వరుడు కావలెను. 1st (or) 2nd అయినా పరవాలేదు. Ph: 9121300377. [HA-10368]

యాదవ/ B.Tech / C.Govt.Officer (Income Tax Dept)/50,000/-PM/5'4" ఎత్తు/ 25 సం.ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8008965895 [HA-10369]

మాల క్రిస్టియన్/ B.Tech / C.Govt.Asst Manager (Canara Bank)/50,000/-PM/5'4" ఎత్తు/ 26 సం.ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9866034870 [HA-10369]

వడ్డెర/B.Tech / C. Govt. బ్యాంక్ క్యాషియర్/SBI/ 38,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-13705]

హిందుమాల/B.Tech / Govt. AE/ ఇరిగేషన్ Dept./ 52,000/-pm/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13705]

ముదిరాజ్/B.Tech / SWE/ 50,000/-pm/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13705]

వడ్డెర/B.Tech / Govt. Asst. ఇంజనీర్/ ట్రాన్స్‌కో/ 60,000/-pm/ 5'5" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-10365]

క్రిస్టియన్ మాదిగ/M.Sc/ Agri/ Govt. AEO/ అగ్రికల్చర్ Dept./ 45,000/-pm/ 5'4" ఎత్తు / 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10365]

SC హిందుమాల/B.Tech/ Govt. సబ్-ఇంజనీర్/ ఎలక్ట్రికల్ Dept./ 65,000/-pm/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10365]

వైశ్య/50y / విడో/Govt. Job/ Own Hospital / Medical Shop/ 17 Acres Land/ 32 Lakhs Income గల వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 8885924657 [H-793292]

రెడ్డి/విడో/ తెల్లనిఛాయ/ తక్కువ చదువు/Own బిజినెస్/ 2 వాటాల ఇల్లు గల పిల్లలులేని ఒంటరి వధువుకు మంచి వ్యక్తిత్వం గల వరుడు కావలెను. Ph: 8179141662 [H-793292]

నాయుడు/58y/ విడో / 5'3"/ ఫ్యామిలీ పెన్షనర్/ 40,000/-pm/ సొంత ఇల్లు/ కారం బిజినెస్/ 1 L pm, పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. Ph: 9515939479 [H-793292]

రెడ్డి/విడో/58y/ House wife/ Own బిజినెస్/ రెండంతస్తుల ఇల్లు గల ఒంటరి వధువుకు మంచి వ్యక్తిత్వం గల కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 9848402716 [H-793292]

బ్రాహ్మణ/25/5'3"/ఇంటర్ *28/5'3"/B.SC *28/ 5'4"/BBM *27/5'2"/హోటల్ మేనేజ్‌మెంట్ వధువులకు వరులు కావలెను కట్నం ప్రసక్తి లేని వారు సంప్ర:జాబ్, పురోహితం అయినా Ok ఫోన్: 7893005879. [HA-13708]

కుల పట్టింపు లేదు/ 2వ పెళ్లి/ గౌడ్/ 2 పిల్లలు/ నర్సింగ్ అందమైన వధువుకి వరుడు కావలెను. ఇంకా చాలా ప్రొఫైల్స్ కోసం "sujithamatrimony". Appని ప్లేస్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకోండి. ఫోన్: 7075337673 [HA-13708]

బ్రాహ్మణ: 27/5'2"/10th* 2వ పెళ్లి/ 31/5'3"/ ఇంటర్* అందమైన వధువులకు తగిన జాబ్, బిజినెస్, పురోహితం వరులు కావలెను. ఫోన్ : 9676812525 [HA-13708]

రెడ్డి: 53Y/ ఫ్యామిలి పెన్షనర్/ సొంత ఇల్లు/ మూడు కోట్ల ప్రాపర్టీ ఆస్తి గల వధువుకి కుల కట్నం ప్రసక్తి లేని వరుడు కావలెను. ఇల్లరికం. ఫోన్ : 8886503524 [HA-13708]

బ్రాహ్మణ/25/5'3"/ఇంటర్ *28/5'2"/B.SC *30/5'3"/ఇంటర్ *27/5'3"/MBA వధువులకు వరులు కావలెను. జాబ్, బిజినెస్ Ok పురోహితులకు సం॥ధాలు కలవు ఫోన్: 7815999246. [HA-13708]

రెడ్డి: విడో 38 సం॥ 5'3" ఎత్తు సొంత ఇల్లు 20 ఎకరాల పొలం స్థిరాస్తి కలిగి పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు) Send Only whatsapp. Ph: 9441145961 [H-796819]

రెడ్డి : 45yrs/ కులపట్టింపు లేదు/ ఫెయిర్, బ్యాంక్ మేనేజర్ 1.80 లక్షలు (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 2 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర: 9492081545 [H-796819]

2వ పెళ్లి : కుల ప్రసక్తి లేదు 35yrs/MBA సెంట్రల్ Govt ఆఫీసర్ 3 లక్షలు (pm) 15 కోట్ల ఆస్తి గల పిల్లలులేని తెల్లని అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా OK) సంప్ర: 7729937291 [H-796819]

బ్రాహ్మిన్స్ : విడో/60Y/Very Fair/5'4"/M.Com/ రిటైర్డ్ సెంట్రల్ Govt Employee/ పెన్షన్: 80,000/ pm /2 వాటాల సొంత ఇల్లు కలిగిన వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని మధ్యతరగతి వరుడు కావలెను. 9059150892 [H-796819]

కుల ప్రసక్తి లేదు/విడో/50y/Dept of NPPA /1.4L PM/Own House/10 ఎ" ల్యాండ్స్/కోట్ల ప్రాపర్టీ గల వెల్ సెటిల్ అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9000648037. [H-796874]

యాదవ/విడో/48y/ 5'4" / B.Sc / Staff Nurse / VRS / 50K PM /Medical Agency/Own House, Lands /36L PM పొపర్టీగల పిల్లలులేని అందమైన వధువుకు FC / BC ఇల్లరికం వరుడు కావలెను (పిల్లలున్నా Ok) ఫోన్: 9542256979. [H-796874]

కమ్మ డైవర్సీ / 33y / 5'.9"/ B.Tech (CSE) సెటిల్డ్ వధువుకు SWE/Pvt Job, బిజినెస్ చేయు వరుడు కావలెను. ఫోన్: 9885144375 / 6302543297. [H-796874]

కాపు విడో/48y/5'4"/PG/Govt.EMP/VRS70K PM/ Supermarket / Own House (Rents) / కోట్ల ప్రాపర్టీ గల ఫ్యామిలీని కోల్పోయిన ఒంటరి వధువుకు FC / BC ఇల్లరికం వరుడు కావలెను పిల్లలున్నా Ok. ఫోన్: 9177831661. [H-796874]

కాపు/2వ పెళ్లి/54yrs/ఫ్యామిలీ పెన్షన్/ 45000/-PM & Own House/ 8 ఎకరాల వ్యవసాయ భూమి గల వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph : 8978651721 [HA-13709]

గౌడ/B.Tech / C.Govt. బ్యాంక్ P.O / కెనరా బ్యాంక్ / 52000/-PM / 5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9052296834 [HA-13709]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech/MBA/ C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/65000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529, 9912280929 [HA-13709]

క్రిస్టియన్/విడో/కుల ప్రసక్తి లేదు/B.Tech/ Govt.Jr.Asst(గ్రామ పంచాయతీ)/35000/-PM/5'4"ఎత్తు/39 సం॥ల పిల్లలు లేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9550650024 [HA-13709]

SC మాల/ B.Tech / C.Govt. Jr. ఇంజనీర్ / రైల్వే / 50,000/-PM / 5'4" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph : 8897389698 [HA-13709]

రజక/ఏకైక కుమార్తె / CA / చార్టెడ్ అకౌంట్ / 60,000/-PM/5'3" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [HA-13709]

2వ పెళ్లి/ M.Tech / C.Govt. బ్యాంక్ క్లర్క్ /SBI / 45000/-PM / 5'4" ఎత్తు/30 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963757612 [HA-13709]

బ్రాహ్మణ/విడో/ 48y/ 5'4"/PG/Govt.EMP/VRS/ 60K PM/Own School/House Rents/4L PM/ కోట్ల ప్రాపర్టీ గల ఒంటరి వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను పిల్లలున్నా OK ఫోన్: 8297518729. [HA-10825]

రాజులు/విడో/49y/5'5"/డిగ్రీ/School Admin/VRS/50K PM/Own Industry / House, పొలాలు, తోటలు/3L PM కోట్ల ప్రాపర్టీ అమ్మతప్పు పూర్తి ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను ఫోన్: 7888919418. [HA-10825]

గౌడ/విడో/47y / 5'4" / MA B.Ed / Govt Teacher / VRS / 50K PM / Family Pensioner / Resturent/ Agriculture Lands / 3L PM కోట్ల ప్రాపర్టీ ఏకైక గల వధువుకు FC/BC వరుడు కావలెను ఫోన్: 9063710965. [HA-10825]

SC మాదిగ/24y / 5'5" / Fair/ B.Tech (Civil) AEE/ఇరిగేషన్ Department/50,000/- PM గల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను (Any Software / Govt Job) ఫోన్: 9059470587. [HA-10825]

రెడ్డి /30yrs/5'4"/కలర్: fair/MA, B.Ed/ సొంత వ్యాపారం/85K Per Month. వెల్ సెటిల్డ్. అందమైన వధువుకి వరుడు కావలెను. ఫోన్: 7995825318. [H-793727]

బ్రాహ్మణ/విడో/ 51y / ప్రైవేట్ జాబ్/ సొంత ఇల్లు/5 ఎకరాల పొలం కల వెల్ సెటిల్డ్ వధువుకు కుల, ఆస్తి పట్టింపు లేని వరుడు కావలేను. ఫోన్: 9121433952. [H-793727]

2వ పెళ్ళి/35yrs/కుల పట్టింపు లేదు/ Govt ఎంప్లాయ్ 2,50,000/-(PM) బాగా స్థిరపడిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయిన Ok) సంప్ర: 9502046384. [H-793727]

కాపు 40yrs/5'5"/కుల పట్టింపు లేదు/ఫెయిర్ PG/ Govt ఎంప్లాయ్ 80K (PM) వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం Ok) సంప్ర: 8008474869. [H-793727]

మాల : B.Tech. MS (USA) / 5'4 / 29Y / V.Fair, 1 Cr. /100K జీతంతో USAలో జాబ్ చేస్తున్న వధువు కొరకు (అర్జెంట్‌గా) సంప్ర॥ సెల్ : 8106501199, 92484 94810. [M-109]

Reddy Br. 26/5'6"/B.Tech (Bits) MS-USA/200Cr. *24/5'5"/B.Tech- MS-USA. 20Cr. *25/5'6"/B.Tech, SWE, 20Cr. Cont: P.P.Reddy-9391198332 [H-792950]

Reddy/30/5'5"/MD (Peodric) 15Cr. *24/5'5"/MD (Radiologist) 2nd yr. *25/5'5"/MD (Gynic). Cont : P.P.Reddy-9391198332 [H-792950]

★★

రెడ్డి/విడో/50y/ ఒంటరి/5'3"/ ఇంటర్/ సొంత షాపింగ్ కాంప్లెక్స్/ టైల్స్ షోరూం/ రెంట్స్. మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. (ఇల్లరికం Ok). (నో బ్రోకర్స్). Ph: 7799083500, 7386660643 [HA-29022]

హిందూ-మాదిగ - క్రిస్టియన్ MBBS చదివిన PHC లో పనిచేస్తున్న అందమైన 29 సం॥ యువతికి తగిన MBBS - PG వరుడు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ ✆ 9492690456 [G-779533]

వేదికలు



కావ్య మ్యారేజ్‌లింక్స్:1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్సీస్, విడోస్ విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులములవారికి త్వరగా చూపబడును. ఫోన్: 8074670989. [H-796874]

ఓన్లీ మున్నూరు కాపు/కాపు మ్యారేజ్ బ్యూరో. హైదరాబాద్ డాక్టర్/ఇంజనీర్స్ /ఎన్.ఆర్.ఐ/Govt మీరు కోరిన పెళ్లి కోరిన పెళ్లి సంబంధాలకు. సంప్ర: భ్రమ రాంబ ఎమ్.బి.సెల్: 9515987410. [HA-10825]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13708]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13708]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13708]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13708]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Nikhil, Ph: 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13708]

నమో వెంకటేశాయ! డాక్టర్స్, ఇంజనీర్స్, గ్రూప్ 1& 2, అబ్రాడ్, 1,2 పెళ్ళి సంబంధాలు ఫాస్ట్‌గా చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-454]

వసుంధర : 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్స్ విడోస్, అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధములు చూడబడును. స్త్రీలకు ఫ్రీ ✆ 90005 23308 [B-448]

వడ్డెర వరుడు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి: 9381553423 [HA-10303]

40 సం॥లుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ "కాకతీయ మ్యారేజస్" రెడ్డి, కమ్మ, కాపు, ఇతర కులముల సంబంధాలకై kaakateeya.com. Ph: 9342939345, 9848134222 [HA-10348]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-793278]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-793292]

★★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE Govt Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-1004]

క్రిస్టియన్ 2nd మేచ్‌లు చూడబడును. సాఫ్ట్ వేర్ ఇంజనీర్స్, గవర్నమెంట్ ఎంప్లాయ్స్, ప్రైవేట్ ఎంప్లాయ్స్, వధూవరులకు సంబంధాలు చూడబడును. ✆ : 77949 11019 [R-1686]

1వ, 2వ, తోడు, ఒంటరి, రిటైర్డ్ సంబంధాలు కలవు. అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. సంప్ర : 83095 25477 [V- 776901]

35సం॥ నుండి 45 సం॥ మధ్య వయసు గల ఒంటరి, విడోలు మరియు విడాకులు పొందిన స్త్రీ/పురుషులకు కులం, కట్నం, మతం ప్రసక్తిలేని అభ్యుదయ భావాలు కలిగిన ఆదర్శ వివాహ సంబంధాలు ఉచితముగా చూడ బడును. ఈ సేవ ప్రస్తుతం ఉన్న వివాహ వేదికల శైలికి భిన్నమైనది. కావున సంప్రదించాలనుకున్నవారు తప్పని సరిగా పై నిబంధనలు పాటించి, తమ ప్రొఫైల్ వివరాలను మా యొక్క నంబర్ 85230 53468కు వాట్సప్ మాత్రమే పంప గలరు. [O-786998]

ఏపీ తీరంలో ఉన్న సమస్యలపై పరిశోధన

- కేంద్ర భూశాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి రవిచంద్రన్
- డాల్ఫిన్ నోస్‌పై కోస్టల్ రీసెర్చ్ సెంటర్‌కు భూమిపూజ



మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రవిచంద్రన్

సాక్షి, విశాఖపట్నం : తీర ప్రాంత పరిశోధనలకు టెస్టింగ్ సెంటర్‌గా విశాఖను అభివృద్ధి చేస్తామని కేంద్ర భూశాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి రవిచంద్రన్ తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ అనుబంధ కేంద్ర సంస్థ నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్(ఎన్‌సీసీఆర్) ఆధ్వర్యంలో విశాఖలోని డాల్ఫిన్ నోస్‌పై తీర ప్రాంత పరిశోధన కేంద్రం, ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీఆర్ కార్యకలాపాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రవిచంద్రన్ మాట్లాడుతూ రూ.62 కోట్లతో 5.5 ఎకరాల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.22 కోట్లు మంజూరు చేశామనీ.. మిగిలిన నిధులు కూడా అందించి.. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పరిశోధన కేంద్రంతో పాటు ఎర్త్‌సైన్స్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని కూడా నిర్మిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ఏపీ తీరంలో ఉన్న సమస్యలపై ఈ కేంద్రం పరిశోధనలు చేస్తుందని, 972 కి.మీ. వెంబడి ఏఏ సమస్యలున్నాయన్నది ఎన్‌సీసీఆర్ స్వయంగా పరిశీలించి.. ఏపీ షోర్‌లైన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ తయారు చేస్తుందన్నారు. కాలుష్యం వల్ల సముద్రాల్లో వస్తున్న మార్పులు, మడ అడవుల విస్తీర్ణం తగ్గడం వల్ల తలెత్తుతున్న ప్రమాదాలు.. మొదలైన వాటిపై నిరంతరం పరిశోధనలకు విశాఖ కేంద్ర బిందువుగా మారుతుందని చెప్పారు. ఈ భవనం కేవలం పరిశోధన కేంద్రంగా మాత్రమే కాకుండా విశ్వవిద్యాలయాలు, ఇన్‌స్టిట్యూట్‌లకు అధ్యయన కేంద్రంగానూ ఉపయోగపడుతుందని వెల్లడించారు. తీరంలో తలెత్తుతున్న మార్పులపై పరిశోధనలు చేసి దేశ వ్యాప్తంగా అమలు చేయనున్న బ్లూ ఎకానమీ పాలసీ కోసం నివేదిక సిద్ధం చేస్తున్నామని రవిచంద్రన్ తెలిపారు. ఎన్‌సీసీఆర్ డైరెక్టర్ డా.ఎంవీ రమణమూర్తి మాట్లాడుతూ ఈ పరిశోధన కేంద్రం ద్వారా సముద్ర జలాల నాణ్యత, తీర ప్రాంత కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలు తదితర అంశాలపై పరిశోధనలు చేస్తామని వివరించారు.

ముగిసిన ఎమ్మెల్సీ ప్రచారం

రేపు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్

- 16న ఓట్ల లెక్కింపు, ఫలితాలు
- 14 స్థానాలకు నోటిఫికేషన్.. 5 ఏకగ్రీవం
- 9 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- 3 పట్టభద్రులు, 2 టీచర్, 4 స్థానిక సంస్థల స్థానాలు
- 11 జిల్లాల్లో 13న ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు
- ప్రైవేటు ఉద్యోగులకు పర్మిషన్
- రేపు సాయంత్రం వరకు మద్యం అమ్మకాలు నిలిపివేత

సాక్షి, అమరావతి: పట్టభద్రులు, టీచర్లు, స్థానిక సంస్థల స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 4 గంటలతో ముగిసింది. మొత్తం 14 ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయగా ఐదు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా తొమ్మిది స్థానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 3 పట్టభద్రులు, 2 టీచర్, 4 స్థానిక సంస్థల స్థానాలు ఉన్నాయి. సోమవారం ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 16న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదే రోజు ఫలితాలను ప్రకటిస్తారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు

ఎన్నికలు జరుగుతున్న 11 ఉమ్మడి జిల్లాల్లో మార్చి 13న ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినంగా ప్రకటించారు. ప్రైవేటు యాజమాన్యాల్లో పనిచేస్తున్న ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి పర్మిషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు జరుగుతున్న జిల్లాల్లో ప్రచారం ముగిసిన సమయం (శనివారం సాయంత్రం) నుంచి పోలింగ్ ముగిసే వరకు (13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు) డ్రై డేగా ప్రకటించి మద్యం అమ్మకాలను నిషేధించింది.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. సంబంధిత జిల్లా కలెక్టర్లు ఎన్నికల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఎన్నికలు జరిగే రోజున పోలింగ్ కేంద్రాలను వెబ్‌కాస్టింగ్ చేస్తూ సచివాలయంలోని ప్రధాన ఎన్నికల కార్యాలయానికి ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు.

ఓటు ఇలా వేయండి

ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఉంటాయని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. బ్యాలెట్ పేపర్‌తో పాటు ఇచ్చిన వయొలెట్ స్కెచ్ పెన్ ఉపయోగించి మాత్రమే అభ్యర్థుల ప్రాధాన్యతను తెలపాలని చెప్పారు. అభ్యర్థుల ప్రాధాన్యతను తెలుపుతూ ఒకటి, రెండు, మూడు వంటి అంకెలను మాత్రమే అభ్యర్థి పేరు ఎదురుగా వేయాలని తెలిపారు. దానికి భిన్నంగా టిక్, ఇంటూ మార్క్ చేసినా, తెలుగు, ఇంగ్లిష్‌లో రాసినా, సంతకాలు చేసినా చెల్లని ఓట్లుగా పరగణిస్తారని చెప్పారు.

ఎన్నికలు జరిగే స్థానాలు

పట్టభద్రుల స్థానాలు
శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం; ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు; కడప-అనంతపురం-కర్నూలు

ఉపాధ్యాయ స్థానాలు
ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు; కడప-అనంతపురం-కర్నూలు

స్థానిక సంస్థల కోటా
కర్నూలు జిల్లా, శ్రీకాకుళం జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు నియోజకవర్గాలు

ఏకగ్రీవమైన స్థానిక సంస్థల స్థానాలు
కడప, అనంతపురం, నెల్లూరు, తూర్పుగోదావరి, చిత్తూరు

అనాథ బాలలకు ప్రభుత్వ భరోసా

- నెలకు రూ.4 వేలు
- స్పాన్సర్‌షిప్ పథకంలో 7,253 మందికి రూ.19.56 కోట్లు
- పోస్టర్ కేర్ ద్వారా మరో 20 మందికి రూ.7.20 లక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళా శిశు సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతున్న ప్రభుత్వం అనాథలు, అభాగ్యులైన బాలలకు సైతం కొండంత భరోసా ఇస్తోంది. అనేక కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లిదండ్రులకు దూరమైన వారు, అనేక రకాల బాధిత పిల్లల విద్య, పౌష్టికాహారం, ఆరోగ్య అవసరాలతోపాటు సంరక్షణ, పునరావాసం కల్పించడంలో పెద్ద మనస్సుతో వ్యవహరిస్తోంది. ఇందు కోసం స్పాన్సర్‌షిప్, పోస్టర్ కేర్ వంటి పథకాల ద్వారా అర్హులైన బాలలు ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు సహాయం అందిస్తోంది. తాజాగా స్పాన్సర్‌షిప్ పథకం ద్వారా రాష్ట్రంలో 7,253 మంది పిల్లలకు ఏడు నెలలకు రూ.19,56,20,000, పోస్టర్ కేర్ ద్వారా మరో 20 మందికి 9 నెలలకు రూ.7,20,000 విడుదల చేసినట్టు ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సంచాలకుడు బి.రవిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ మొత్తాలను లబ్ధిదారులైన బాలలకు అందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ రెండు పథకాల్లో అర్హత, లబ్ధిదారుల ఎంపిక మార్గదర్శకాలను రవిప్రకాశ్‌రెడ్డి వివరించారు.

ఆర్థికంగా, సామాజికంగా బలహీనులకు స్పాన్సర్‌షిప్ పథకం

స్పాన్సర్‌షిప్ పథకంలో ఆర్థికంగా, సామాజికంగా బలహీనమైన బాలల విద్య, పోషకాహారం, ఆరోగ్య అవసరాల కోసం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. జువెనైల్ జస్టిస్ బోర్డ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చిల్డ్రన్స్ కోర్ట్ ఎంపిక చేసిన 18 ఏళ్ల వయస్సు వరకు ఉన్న బాలలు ఈ పథకం ద్వారా సహాయం పొందవచ్చు. తల్లి వితంతువైనా, విడాకులు పొందినా, కుటుంబం వదిలేసినా, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినా, పేదరికంతో పెద్ద కుటుంబానికి చెందినా ఈ పథకం వర్తిస్తుంది. అదేవిధంగా జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015 ప్రకారం ఇల్లు లేకపోయినా, ప్రకృతి వైపరీత్యానికి గురైన, బాల కార్మికులు, బాల్య వివాహ బాధితులు, అక్రమ రవాణాకు, దాడులకు గురైన, హెచ్‌ఐవీ బాధిత పిల్లలు, వికలాంగులు, తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు, బాల యాచకులు, వీధుల్లో నివసించే వారు స్పాన్సర్‌షిప్ పథకానికి అర్హులు.

పిల్లల సంరక్షణ, పునరావాసానికి పోస్టర్ కేర్

పోస్టర్ కేర్ పథకంలో పిల్లల సంరక్షణ, పునరావాసం కోసం నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందిస్తారు. తల్లిదండ్రులకు దూరమైన పిల్లల సంరక్షకులు, పెంపుడు తల్లిదండ్రులకు ఈ మొత్తాన్ని అందిస్తారు. రెండేళ్లకుపైగా శిశు సంరక్షణ కేంద్రం (చైల్డ్ కేర్)లో ఉంటున్న 6 నుంచి 18 సంవత్సరాల పిల్లలు, దత్తతకు చట్టబద్ధంగా ఉచితమని ప్రకటించబడని వారు వ్యక్తిగత సంరక్షణ ప్రణాళిక ఆధారంగా పోస్టర్ కేర్‌లో ఉంచుతారు. తీవ్ర అనారోగ్యం పాలైన తల్లి తండ్రులు తమ పిల్లల సంరక్షణ కోసం కమిటీ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌కు అభ్యర్థన సమర్పిస్తే వారి పిల్లలను పోస్టర్ కేర్‌లో ఉంచుతారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం ప్రస్తావించిన బాధిత బాలలకు సైతం పోస్టర్ కేర్ సాయం అందిస్తారు.

అడవిలో బతకడం ఎలా?

పులి పిల్లలకు తిరుపతి జూ పార్కులోని 'ఇన్ సిటు ఎన్‌క్లోజర్'లో ప్రత్యేక శిక్షణ

- దాదాపు అడవిలో ఉన్నట్లే రెండేళ్లు పెంచేలా ఏర్పాట్లు
- అడవిలో ఎలా బతకాలి.. ఎలా వేటాడాలో తెలిసేలా చేయడమే లక్ష్యం
- రెండేళ్ల తర్వాత అన్ని పరీక్షల్లో నెగ్గితే నల్లమల అడవుల్లో వదిలే అవకాశం
- ఎన్‌టీసీఏ మార్గదర్శకాల మేరకు పులి పిల్లల సంరక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



తిరుపతి జూలో పులి కూనలు

సాక్షి, అమరావతి: ఆత్మకూరు సమీపంలో తల్లి పులి నుంచి తప్పిపోయిన 4 పులి పిల్లలకు అడవి పాఠాలు నేర్పేందుకు అటవీ శాఖ సమాయత్తమైంది. ఇప్పటికే వాటిని తిరుపతి జూ పార్క్‌లోని ఇన్ సిటు ఎన్‌క్లోజర్(సహజ స్థితిలో ఉండే ఆవరణ)కు చేర్చారు. 100 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ ఎన్‌క్లోజర్ ఇప్పటివరకు ఖాళీగా ఉంది. ఇందులో పెరిగే జంతువులను చూసేందుకు సందర్శకులకు అనుమతి ఉండదు. అడవి మాదిరిగానే దీన్ని ఉంచుతారు. సహజంగా అడవిలో జంతువులు ఎలా ఉంటాయో ఈ ఎన్‌క్లోజర్‌లో పులి పిల్లల్ని కూడా అలాగే ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్‌టీసీఏ(నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ) మార్గదర్శకాల మేరకు పులి పిల్లలకు అక్కడ శిక్షణ ఇవ్వనున్నారు.

పరీక్షల్లో పాసైతేనే అడవిలోకి..

దొరికిన నాలుగు ఆడ పులి పిల్లల వయసు 60 రోజులుగా నిర్ధారించారు. రెండేళ్ల వయసు వచ్చే వరకు వాటిని ఈ జూలోనే ఉంచుతారు. కానీ.. వాటిని జూలోని మిగతా జంతువుల్లా కాకుండా అడవిలో ఉన్నట్లు జీవించేలా చూస్తారు. 45–60 రోజుల పులి పిల్లలకు మేక పాలు, చికెన్ సూప్ ఆహారంగా ఇస్తారు. 61వ రోజు నుంచి ఉడికించిన చికెన్ ముక్కలు పెడతారు. 75–90 రోజుల మధ్య ఎముకతో పూర్తిగా ఉడికించిన చికెన్ అందిస్తారు. 90–105 రోజుల మధ్య సగం ఉడికిన చికెన్, 105–120 రోజుల మధ్య పచ్చి చికెన్, 120–150 రోజుల మధ్య గొడ్డు మాంసం సూప్, చికెన్‌తో కలిపి ఇస్తారు. 6 నెలల తర్వాత పూర్తి పచ్చి గొడ్డు, కోండి మాంసాన్ని ఆహారంగా అందిస్తారు. ఒక సంవత్సరం తర్వాత అవి వేటాడి ఆహారాన్ని సంపాదించుకునే ఏర్పాట్లు చేస్తారు. ఇందుకోసం కొన్ని జంతువులను వాటికి తెలియకుండానే ఎన్‌క్లోజర్‌లోకి వదులుతారు. నాలుగు పిల్లలు ఎన్ని జంతువులను ఎలా



అడవిలో తిరుగుతున్న తల్లి పులి (కెమెరా ట్రాప్)

వేటాడాయనే విషయాలను నమోదు చేస్తారు. ఇంకా అడవిలో ఎలా జీవించాలనే దానిపై కొన్ని పరీక్షలు పెడతారు. సంవత్సరం తర్వాత నుంచి మనుషులు వాటికి కనపడకుండానే పరిశీలిస్తారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించి అడవిలో ఒంటరిగానైనా అవి వేటాడి జీవించగలవని నిర్ధారణ అయితే రెండు సంవత్సరాల తర్వాత వాటిని అడవిలో వదులుతారు. ఇందుకోసం వాటికి కొన్ని పరీక్షలు కూడా పెడతారు. వాటిలో పాస్ అయితేనే అడవిలో వదిలే అవకాశం ఉంటుంది.

తల్లి పిల్లల్ని ఎందుకు వదిలేస్తుందంటే..

పులి పిల్లలు వైకల్యంతో పుట్టినా.. బలహీనంగా ఉన్నా.. గాయాలై నడవలేకపోయినా.. తల్లి అనారోగ్యంతో ఉన్నా.. లేక వేట/నీటి కోసం వెళ్లినప్పుడు తప్పిపోయినా తల్లి పులి పిల్లల్ని వదిలేస్తుందని ఎన్టీసీఏ చెబుతోంది. ఆత్మకూరు ఘటనలో పులి తన పిల్లల్ని సురక్షితమని భావించిన చోట ఉంచి వేట కోసమో లేదా నీళ్ల కోసమో వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు. సాధారణంగా పులి పిల్లలు అటవీ శాఖకు దొరికితే వెంటనే వాటిని జూ పార్క్‌కు తరలిస్తారు. కానీ.. ఆత్మకూరు సమీపంలో దొరికిన పులి పిల్లల్ని వెంటనే కాపాడగలిగిన అటవీ శాఖ తల్లి పులి గాండ్రింపులు వినపడటం, పిల్లల కోసం వచ్చినట్టు నిర్ధారణ కావడంతో దానికి జత చేసేందుకు ప్రయత్నించింది. తల్లి పులి వద్దకు వెళ్లేందుకు వాటిని వదిలినా ఎండ తీవ్రతతో అవి వదిలిన చోటే వెనక్కి వచ్చేశాయి. తల్లి పులి ఉనికి కోసం పులి ఆవాస ప్రాంతంలో 50 కెమేరా ట్రాప్‌లు అమర్చి గస్తీ నిర్వహించారు. పిల్లల్ని తల్లి దగ్గరకు చేర్చేందుకు అటవీ శాఖాధికారులు ఎంత ప్రయత్నించినా వీలు కాలేదు. మనుషుల తాకిడి పిల్లలపై ఉండటంతో తల్లి పులి వాటిని స్వీకరించడం లేదని స్పష్టమవడం, ఒకవేళ తల్లి పులి వద్దకు వాటిని చేర్చినా పిల్లలు మనుగడ సాగిస్తాయా లేదో స్పష్టత లేకపోవడంతో వాటిని తిరుపతిలోని ఇన్-సిటు ఎన్‌క్లోజర్‌కు తరలించారు. గతంలో పులి పిల్లలు దొరికినా అవి బతికిన ఘటనలు లేవు. ఐదేళ్ల క్రితం ఇలాగే నల్లమలలో 3 పులి పిల్లలు దొరికినా తిరుపతి నుంచి వెటర్నరీ డాక్టర్లు వచ్చేసరికి అవి చనిపోయాయి. కానీ ఇప్పుడు వెంటనే ఆత్మకూరు నుంచి డాక్టర్లు వెళ్లడంతో చికిత్స అందించి బతికించగలిగారు. డాక్టర్లు వెళ్లే సమయానికి నాలుగింటిలో రెండింటికీ రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించారు. సకాలంలో వెళ్లడంతో వాటిని కాపాడగలిగారు.

రెండేళ్లు శిక్షణ ఇస్తాం



ఎన్టీసీఏ మార్గదర్శకాల ప్రకారం పులి పిల్లల్ని ఇన్-సిటు ఆవరణలో రెండేళ్లు శిక్షణ ఇస్తాం. అవి అడవిలో బతకగలవని నిర్ధారణ అయ్యాక వాటిని నల్లమలలో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటాం. పులి పిల్లల్ని సంరక్షించడంలో క్రియాశీలకంగా వ్యవహరించాం. అవి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాయి.

– ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రాజెక్టు టైగర్ సర్కిల్ ఏసీఎఫ్ (అసిస్టెంట్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్)

ఇంటర్ హాల్‌టికెట్లు సిద్ధం

ఇంటర్ బోర్డు కార్యదర్శి శేషగిరిబాబు

సాక్షి, అమరావతి: ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లు జ్ఞానభూమి పోర్టల్‌లో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్లలో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 18004257635కు ఫోన్ చేయొచ్చన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు రాష్ట్రంలో 1,489 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 10,03,990 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 4,84,197 మంది, ద్వితీయ సంవత్సరం 5,19,793 మంది ఉన్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను నిషేధించామన్నారు.

గుండెను బాగుచేసిన ఫేస్‌బుక్ పరిచయం

రాజమహేంద్రవరం వాసికి కర్నూలు పెద్దాస్పత్రిలో సర్జరీ



డిశ్చార్జ్ అవుతున్న శర్మతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఫేస్‌బుక్ పరిచయం ఓ వ్యక్తిని ప్రాణాపాయం నుంచి కాపాడింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఉన్న ఓ వ్యక్తిని కర్నూలుకు రప్పించి గుండె ఆపరేషన్ చేయించింది. రాజమహేంద్రవరం హుకుంపేట గ్రామానికి చెందిన గంటి కైలాస్ నాగవెంకటశర్మ వ్యవసాయ దారు. ఇటీవల ఆయనకు గుండెకు సమస్య వచ్చింది. స్థానికంగా వైద్యులకు చూపిస్తే గుండె బలహీనమైంది.. వాల్వ్ మార్చాలి.. చాలా డబ్బు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో ఏం చేయాలో పోలుపోలేదు. తనకు ఫేస్‌బుక్ ఫ్రెండ్ అయిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ ప్రభాకరరెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆయన వెంటనే రమ్మని చెప్పడంతో శర్మ ఇటీవలే కర్నూలు ఆస్పత్రిలో చేరారు. ఆయనకు మళ్లీ అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వారం రోజుల కిందట డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా మైట్రల్ వాల్వ్ ఆపరేషన్ పూర్తి చేశారు. శనివారం ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. తన ఫేస్‌బుక్ పరిచయం కర్నూలులో గుండె ఆపరేషన్ చేయించి.. తనను సంపూర్ణ ఆరోగ్యవంతుడిని చేసిందని శర్మ సంతోషంగా చెప్పారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

వేసవి దృష్ట్యా అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు

- ప్రాథమిక చికిత్స కిట్లతో వైద్య సిబ్బంది
- 20 నుంచి 25 పరీక్షా కేంద్రాలకొక 108 అంబులెన్స్
- తగినన్ని ఆర్టీసీ బస్సులు
- కలెక్టర్లు, ఎస్పీలు, విద్యా శాఖ అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు



సాక్షి, అమరావతి: ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శనివారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే ప్రాథమిక చికిత్స కిట్లతో వైద్య సిబ్బంది ఉండాలని చెప్పారు. ప్రతి 20 నుంచి 25 పరీక్షా కేంద్రాలకొక 108 అంబులెన్సును కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు ఆయా రూట్లలో తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వదంతులకు ఆస్కారం ఇవ్వొద్దు

ముఖ్యంగా పరీక్షలు జరిగే సమయంలో ప్రశ్నపత్రాల లీకేజ్ లేదా మాల్‌ప్రాక్టీస్ జరిగిందనే వదంతులు సృష్టించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ఇలా విద్యార్థులను ఆందోళనలకు గురిచేసే ప్రయత్నాలు కొందరు చేసే ప్రమాదం ఉందన్నారు. అలాంటివి జరగకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌ల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆయా పరీక్షా కేంద్రాల పరిధిలో పరీక్షలు జరిగే తేదీల్లో జిరాక్స్ సెంటర్లు, ఫొటోస్టాట్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తగినన్ని మొబైల్ పెట్రోలింగ్ బృందాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

పరీక్షలు జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. ఇందుకు ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. ఇంటర్ బోర్డు అధికారులతో నోడల్ అధికారి సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పరీక్షల పటిష్ట నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయ సమావేశాలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్ బోర్డు కార్యదర్శి శేషగిరిబాబు, వీడియో లింక్ ద్వారా పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు పాల్గొన్నారు.

అవయవదానానికి శతాధిక వృద్ధుడు అంగీకారం

- ఆస్పత్రి వారికి సమ్మతిపత్రం అందజేసిన పలమనేరు మాజీ ఎమ్మెల్యే టీసీ రాజన్
- అవయవదానం ఓ ఉద్యమంలా సాగాలని ఆకాంక్ష



టీసీ రాజన్

పలమనేరు(చిత్తూరు జిల్లా): స్వాతంత్ర్య సమర యోధునిగా, ఎమ్మెల్యేగా దేశానికి, ప్రజలకు సేవలు అందించిన ఠానేధార్ చిన్న రాజన్(103) తన మరణానంతరం కూడా నలుగురికీ ఉపయోగపడాలని నిర్ణయించుకున్నారు. వందేళ్లకు పైగా జీవించిన తాను ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని భావించారు. ఇందులో భాగంగా తన అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు అవయవదానానికి అంగీకారం తెలియజేస్తూ శనివారం బెంగళూరులోని వైదేహీ ఆస్పత్రి వైద్యులకు సమ్మతిపత్రాన్ని తన కుటుంబ సభ్యుల సాక్షిగా టీసీ రాజన్ అందజేశారు. తాను మృతిచెందిన తర్వాత అవయవాలు అవసరమైన వారికి ఉపయోగపడాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తన అవయవాలు కొందరి ప్రాణాలనైనా కాపాడగలిగితే, వారి శరీరంలో తాను జీవించినట్లేనని పేర్కొన్నారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, ఈ కార్యక్రమం భవిష్యత్‌లో ఓ ఉద్యమంలా సాగాలని ఆయన ఆకాంక్షించారు. దీనిపై ప్రభుత్వం సైతం విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఇటీవల వరకు పలమనేరులోని కొత్తపేటలో ఓ ఇంట్లో అద్దెకు ఉన్న టీసీ రాజన్ వృద్ధాప్యం రీత్యా బెంగళూరు వెళ్లి తన కుమారుని పర్యవేక్షణలో ఉంటున్నారు. తన మరణానంతరం మృతదేహాన్ని పలమనేరుకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులకు ఆయన సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.